ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

బుధ వారం, జూలై 29, 2009

తొమ్మిదవ సమావేశము, సంపుటము IV నంబరు 4

విరోధినామ సంవత్సర శ్రావణ శు. 8.

**WEDNESDAY, THE 29th JULY, 2009**

**NINTH SESSION, VOLUME IV, NO.4**

**7 SRAVAN, 1931 S.E.**

* * * * *

శాసన పరిషత్తు సచివాలయము,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **డెప్యూటీ ఛైర్మన్** | : | శ్రీ మహ్మద్ జానీ |
| **ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక** | : | శ్రీ వి. భూపాల్‌రెడ్డి<br>శ్రీ వాసిరెడ్డి వరద రామారావు<br>డా. రాయపాటి శ్రీనివాస్<br>డా. మసాల పద్మజ |
| **కార్యదర్శి** | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| **ప్రత్యేక కార్యదర్శి** | : | శ్రీ కె. గోపాల కృష్ణయ్య |
| **సంయుక్త కార్యదర్శులు** | : | శ్రీ డి. శివరావు<br>శ్రీ ఎం.వి.వి. సత్యానందం |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ ఎం. పాండురంగాచార్య<br>శ్రీ డి. నర్సింహులు<br>శ్రీ పి. సత్యనారాయణ<br>శ్రీ కె. సుభాష్ చంద్రబోస్ |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ ఎ. రాంరెడ్డి<br>శ్రీమతి వి. గిరిజాసుందరి<br>శ్రీ ఎస్. జయరాం<br>శ్రీ కె. సత్యనారాయణరావు<br>శ్రీ మహ్మద్ జహీరుద్దీన్<br>శ్రీమతి ఎ. సత్య సాయి లక్ష్మి<br>శ్రీమతి ఎస్.ఎ. జ్యోతి<br>శ్రీ జి. వెంకట కృష్ణ<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ జి.ఎల్. నరసింహారావు<br>శ్రీమతి వి. ప్రభ<br>శ్రీమతి వై. వెంకట రమణమ్మ |
| **మార్షల్** | : | శ్రీ ఆర్. సీతారామారావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఎల్. తిరుమలరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

## అధికార నివేదిక

## బుధ వారం, జూలై 29, 2009

### విషయ సూచిక

1. సభా కార్యక్రమము ః
   విషయము : వాయిదా తీర్మానము అనుమతి గురించి.

2. నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు - వాగ్రూప సమాధానాలు ః

3. స్వల్ప వ్యవధి ప్రశ్నలు ః

4. సభా సమక్షంలో ఉంచిన పత్రములు ః

5. ప్రకటన ః
   విషయము : 29.7.2009 న సాయంత్రము గం. 4.00 లకు జరుగనున్న సెమినార్ గురించి.

6. సభా కార్యక్రమము ః
   విషయము : i) 30.07.2009 న సాయంత్రపు సమావేశము నిర్వహించుట గురించి.
   ii) ఎం.ఎల్.సిల సౌకర్యాలు, ప్రోటోకాల్ అమలు గురించి.

7. అర్జీల సమర్పణ ః

8. ప్రత్యేక ప్రస్తావన ః

9. 2009-2010 సంవత్సరమునకు వార్షిక ఆదాయ, వ్యయ పట్టిక (బడ్జెట్) పై సాధారణ చర్చ (కొనసాగింపు) ః

*****

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

**2009, జూలై 29వ తేది, బుధ వారము**

**తొమ్మిదవ సమావేశపు నాల్గొవ రోజు**

**(సభ ఉదయం గం.10.00 లకు సమావేశమైంది. మిస్టర్ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)**

MR. CHAIRMAN: Now, I will take up the Question Hour.

<u>సభాకార్యక్రమము</u>

<u>విషయము : వాయిదా తీర్మానముల అనుమతి గురించి</u>

శ్రీ దాడి వీరభద్రరావు(విశాఖపట్నం) : సార్ మేము కొన్ని అడ్జర్నమెంట్ మోషన్స్ ఇవ్వడం జరిగింది.

MR. CHAIRMAN: Yes, I have received your adjournment motion regarding T.T.D. Cottages and I have already disallowed it.

శ్రీ దాడి వీరభద్రరావు : సార్, తిరుమల తిరుపతి దేవస్థానం నిధుల విషయం గురించి గానీ యాత్రీకుల నివాస విషయమై కాటేజీల నిమిత్తం భూముల కేటాయింపు గురించిగాని, ఆడిట్ మరియు అడ్మినిస్ట్రేటివ్ రిపోర్టు పెట్టకపోవడం గురించి గానీ, భక్తుల సౌకర్యాల గురించిగాని మొత్తం ఒకేసారిగా చర్చించే అవకాశం మాకు రావడం లేదు. నిన్న కూడా క్వశ్చన్ అవర్ చివరిలో రావడం వల్ల మాకు ఎక్కువ ప్రశ్నలు వేసే అవకాశం కలగలేదు. కాబట్టి వాటిపై చర్చించడానికి సమయం కేటాయించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ విషయమై ప్రతిరోజు వార్తా పత్రికలలో వస్తోంది. కాబట్టి విపులంగా చర్చించడానికి తగు సమయం ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

MR. CHAIRMAN: I will agree only for short duration.

శ్రీ చేరుపల్లి సీతారాములు (అసెంబ్లి) : సార్, మహిళలపై హత్యలు, అత్యాచారాలు, యసిడ్ దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. దీనిని చాలా సీరియస్ ఇష్యూగా తీసుకొని చర్చించవలసిన అవసరమున్నది. మహిళా నాయకులు అత్యున్నత స్థానంలో ఉన్న ఈ రోజులలో కూడా మహిళలకు భద్రత లేకుండా పోతున్నది.ఈ విషయంపై చర్చించడం మంచిదని నా అభిప్రాయం.

MR. CHAIRMAN: Give me a separate notice under different Rule, then I will consider.

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు–వాగ్రూప సమాధానాలు

## జనాభా ప్రాతిపదికన మండలాల పునర్వ్యవస్థీకరణ

ప్రశ్న నెం. 21 (2565)

శ్రీ జి. తిప్పేస్వామి:

గౌరవనీయులైన రెవెన్యూ, సహాయ, పునరావాస శాఖామంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా;

అ) రాష్ట్రంలోని జనాభా ప్రాతిపదికపై మండలాలను పునర్వ్యవస్థీకరిస్తున్న విషయం వాస్తవమేనా;
ఆ) అయితే, పాటించాలని ప్రతిపాదించిన విధానంతోపాటు ఆ వివరాలేమిటి?

రెవెన్యూ, సహాయ, పునరావాస శాఖ మంత్రిగారు ( శ్రీ ధర్మాన ప్రసాదరావు)

అ) అవునండీ. జనాభా ప్రాతిపదికన పట్టణ ప్రాంతాలలో కొత్త మండలాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నది.

ఆ ) 2001, జనాభా లెక్కల ప్రకారం ఒక లక్షమందికి మించి జనాభా ఉన్న మునిసిపాలిటీలలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలను విభజించి, క్రొత్తగా ఒక పట్టణ మండలాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడమయింది. దీని వల్ల ప్రస్తుతమున్న మండలం గ్రామీణ మండలం అవుతుంది. క్రొత్తగా ఒక పట్టణ మండలాన్ని ఏర్పాటు చేయడమయింది.

1. మూడు లక్షలకు లోపు జనాభా వున్న మునిసిపాల్ కార్పొరేషన్లలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలను విభజించడం ద్వారా క్రొత్తగా ఒక పట్టణ మండలాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడమయింది.

2. 3,00,000 - 6,00,000 మధ్య జనాభా వున్న మునిసిపల్ కార్పొరేషన్లలో మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంతపు ప్రతి సగభాగానికి క్రొత్తగా రెండు పట్టణ మండలాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడమయింది.

3. జి.హెచ్.ఎం.సి, విశాఖపట్టణం, విజయవాడ వంటి మునిసిపలు కార్పొరేషన్లలో 6,00,000లకు పైగా జనాభా వున్నప్పుడు ప్రతి 3,00,000ల జనాభాకు క్రొత్తగా ఒక పట్టణ మండలాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడమయింది.

శ్రీ జి. తిప్పేస్వామి (అసెంబ్లి) : అధ్యక్షా, అర్బన్ ప్రాంతాలలో కొత్తగా మండలాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉన్నదని మంత్రిగారు తెలిపారు చాలా సంతోషం. మన ప్రియతమ ముఖ్యమంత్రిగారు గతంలో ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి కొన్ని సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చారు. ఇవన్నీ ప్రతి మారుమూల గ్రామాలలోని లబ్ధిదారులందరికీ చెందాలంటే మండలాల సంఖ్యను పెంచవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. గత 25 సంవత్సరాల క్రితం ఏర్పాటు కాబడిన మండలాలలో ఈనాడు జనాభా ఎక్కువ కావడం జరిగింది. కాబట్టి

మండలాల పునర్వ్యవస్థీకరణ అవసరం ఎంతైనా ఉన్నది. రెండవ విషయమేమంటే రెవెన్యూ డివిజన్ కేంద్రాలు ఏప్పుడో బ్రిటిష్ కాలంనాటివి అనుకుంటాను. అనంతపురం జిల్లాలో పెనుగొండ రెవెన్యూ డివిజన్ కేంద్రంలో 26 మండలాలు ఉన్నాయి. అదే ఇంకో రెవెన్యూ డివిజన్ కేంద్రంలో కేవలం 10,15మండలాలు ఉన్నాయి. ఒక ఆర్‌డివో, సబ్‌కలెక్టర్ ఆయా మండలాలలో పర్యటించి సమీక్షించడం చాలా కష్టమవుతుంది. రెవెన్యూ డివిజన్ కేంద్రాలను కూడా పునర్వ్యవస్థీకరించాలని తమద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ జల్లి విల్సన్ (అసెంబ్లి) : అధ్యక్షా, మండలాల పునర్వ్యవస్థీకరణ పట్టణాలకు మాత్రమే పరిమితం చేస్తున్నారా? గ్రామీణ ప్రాంతాలలోని మండలాలను కూడా ఆయా భౌగొళిక పరిస్థితులకనుగుణంగా పునర్వ్యవస్థీకరించడాన్ని కూడా ఆలోచించాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కె.ఎస్. లక్ష్మణ్ రావు (కృష్ణా, గుంటూరు) : అధ్యక్షా, గుంటూరు నగరంలో ఏడు లక్షల జనాభా ఉన్నది. గుంటూరు నగరానికి రూరల్ ఏరియాకి కలిపి ఒకే రెవెన్యూ మండలం ఉన్నది. గతంలో గౌరవ మంత్రిగారు గుంటూరు జిల్లాకు ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్నప్పుడు మరొక మండలం ఏర్పాటు చేస్తామని అంగీకరించారు. ప్రస్తుతం ఆ ప్రతిపాదనేమైనా ఉన్నదా అని తమ ద్వారా అడుగుతున్నాను.

ఉ. 10.10

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం) : పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని పరిపాలనా సౌలభ్యంకోసం ఈ మండలాలను ఏర్పాటు చేయడం స్వాగతించదగిన విషయం. అయితే మున్సిపాలిటీ ఏరియాలలో ఒక మండలం, కార్పోరేషన్లలో జనాభా ఎక్కువగా ఉన్నచోట రెండు మండలాలను ఏర్పాటు చేయడం సంతోషించదగిన విషయమే. అయితే ప్రస్తుతం మండల పరిషత్ నడుస్తున్నటువంటి విధానంలో మండల పరిషత్ అని, ఎం.పి.డి.సి అని ఉన్నాయి. ఈ కార్పోరేషన్లలో ఆల్‌రెడీ కౌన్సిలర్లు, కార్పోరేటర్లు అని ఉన్నారు. దీనిని ఏ రకంగా అడాప్ట్ చేయబోతున్నారు అనే దానిపైన వివరించవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ బి. చెంగల్‌రాయుడు (అసెంబ్లి) : అధ్యక్షా, ఎప్పుడో జిల్లాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు జనాభా పెరిగింది కాబట్టి ఒక్కొక్క పార్లమెంట్ నియోజక వర్గ పరిధిని ఒక్కొక్క జిల్లాగా చేస్తే చాలా సౌలభ్యంగా ఉంటుందని మీ ద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను. ఇది చాలా ముఖ్యమైన విషయం. జిల్లాలలో జరుగుతున్న సమీక్షా సమావేశాలలో స్థానిక పార్లమెంట్ సభ్యులు అధ్యక్షత వహిస్తున్నారు. పార్లమెంట్ సెగ్మెంట్‌ను ఒక జిల్లా హెడ్ క్వార్టర్ చేస్తే ఆ పార్లమెంట్ మెంబరే నాన్ అఫీషియల్‌గా ఉండేదానికి అవకాశం ఉంటుందని, దీనిని చాలా సీరియస్‌గా తీసుకోవాలని మీ ద్వారా మనవి చేస్తున్నాను.

శ్రీ ధర్మాన ప్రసాదరావు :- అధ్యక్షా, రెవెన్యూ డివిజన్ అనేది జనరల్ అడ్మినిస్ట్రేషన్‌కి సంబంధించింది. మీకు తెలియంది కాదు, మండలాలు ఏర్పాటు చేసినప్పుడు అప్పటి పరిస్థితి, ఇప్పటి పరిస్థితి చూస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున అర్బన్ ప్రాంతాలకి వైద్యంకోసం, చదువుకోసం, ఉపాధికోసం, విలాసాల కోసం వలస వస్తున్నారు. గడచిన రెండున్నర దశాబ్దాల నుంచి చూస్తే పెద్ద ఎత్తున గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు తరలి వస్తున్నారు. మొన్న జరిగిన డీలిమిటేషన్స్ కనుక మీరు చూస్తే రూరల్ జిల్లాలనుంచి అర్బన్ నియోజక వర్గాలు కూడా పెద్ద ఎత్తున రూరల్ ప్రాంతాల నుంచి తగ్గి, అర్బన్ ప్రాంతాలనుంచి పెరిగాయి. గ్రామీణ

ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు స్పష్టంగా వలసలు పెరిగాయి. వీటి శాతాలలో కూడా పెద్ద ఎత్తున మార్పులు వచ్చాయి. గతంలో ఏర్పాటు చేసిన మండలాలలో, రెవెన్యూ సర్వీసులు సజావుగా అందాలంటే అర్బన్ ప్రాంతాలను పెంచవలసినవసరం ఏర్పడింది. ఉదాహరణకు విశాఖపట్టణం జిల్లాను తీసుకుంటే మొత్తం కార్పోరేషన్ పరిధి అంతా కలిపి ఒక రెవెన్యూ మండలం ఉంది. అక్కడ రెవెన్యూ సర్వీసులు సజావుగా, సులువుగా, తక్షణమే అందించాలంటే సాధ్యం కాదు. ఇలాంటి విజ్ఞాపన పత్రాలు అనేక ప్రాంతాల నుంచి ప్రభుత్వానికి అందిన తరువాత ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి డీటైల్డ్‌గా స్టడీ చేశాము. అలా స్టడీ చేస్తున్నప్పుడు జనాభా ప్రాతిపదికన చేస్తే బాగుంటుందని కొన్ని గైడ్‌లైన్స్ జిల్లా కలెక్టర్లకి పంపించడం జరిగింది. దీనిపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుంది. అర్బన్ ప్రాంతాలలో పెరిగినటువంటి జనాభాకు అనుగుణంగా రెవెన్యూ సేవలు అందించడానికి తగ్గట్టుగా కొన్ని మండలాలను ఏర్పాటు చెయ్యాలనే నిర్ణయం మేరకు ఒక కమిటీని వేయడం జరిగింది. గుంటూరు ప్రాంతామా, ఇంకొక ప్రాంతమా అనేది ఈ గైడ్‌లైన్స్ పరిధిలో ఉండవలసి ఉంటుంది. ఒకటీ, అరా చిన్న చిన్నవి ఉంటే వాటిని తదుపరి ప్రభుత్వం ఆలోచిస్తుంది.

రెవెన్యూ డివిజన్స్ గురించి అడిగారు. రెవెన్యూ డివిజన్‌కి కూడా ఊరికే పెంచుకుంటూ పోవడం వలన ప్రభుత్వానికి అదనంగా ఖర్చు తప్ప ప్రయోజనం ఉండదు. తిప్పేస్వామిగారు చెప్పారు ఒక్కొక్క జిల్లాలో ఉండే రెవెన్యూ డివిజన్లలో ఉండే పరిధి గానీ, వర్క్ లోడ్ గానీ సమానంగా లేదని. దానిని నేను అంగీకరిస్తున్నాను. ఈ పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా ఉందని అంగీకరిస్తున్నాను. గొప్ప రెవెన్యూ డిపార్టుమెంట్‌ను ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చు కాని ఉన్న రెవెన్యూ డిపార్టుమెంట్ వర్క్ లోడ్‌ని ఈక్వల్‌గా డిస్ట్రిబ్యూట్ చేయడానికి డీలిమిటేషన్ తరువాత ఒక అవకాశం ఉంది కనుక ఈ డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి అయింది కనుక నియోజకవర్గం, రెవెన్యూ డివిజన్స్‌ని, కోటెర్మినస్ చేయడానికి ఉండే సాధ్యా సాధ్యాలు పరిశీలించమని రెవెన్యూ ఉన్నతాధికారులకు చెప్పడం జరిగింది. ఈ రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్‌ని స్ట్రెంగ్తెన్ చేసే ప్రక్రియలో భాగంగా కొన్ని చర్యలు ఇప్పటికే తీసుకున్నాం.

మొదటగా గ్రామీణ ప్రాంతాలలో రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్‌ని బలోపేతం చేశాం. తరువాత సర్వేలు పెద్ద ఎత్తున రిక్రూట్ మెంట్ చేశాము. క్రొత్త మండలాలను అర్బన్ ప్రాంతాలలో ఏర్పాటు చేసుకున్నాము. రెవెన్యూ డివిజన్స్‌ని సరిచేసే ప్రయత్నం చేస్తున్నాము. జాయింట్ కలెక్టర్లని, అడిషనల్ జాయింట్ కలెక్టర్లని అపాయింట్ చేస్తున్నాం. ఇది అంతా స్ట్రాటజీలో ఒక భాగం. రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ స్ట్రెంగ్తెన్ చేసే డెసిషన్‌కి అనుకూలంగానే ఈ నిర్ణయాలు జరుగుతున్నాయి. నెక్స్ట్‌ఫేస్‌లో ఇతర విషయాలన్నీ పరిశీలించడం జరుగుతుంది. ఇతర జిల్లాల ఏర్పాటు ఇవన్నీ ప్రభుత్వ పరిశీలనలో లేవు. ఇప్పుడది సందర్భం కూడా కాదని మనవి చేస్తున్నాను.

శ్రీ జి. తిప్పే స్వామి : అధ్యక్షా, చాలా సంతోషం. మంత్రిగారిని క్రొత్తగా రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేయమని చెప్పడం లేదు కానీ, ఉన్న డివిజనన్లు రీఆర్గనైజ్ చేసి, సమానంగా పంచమంటున్నాము. ఆ విధంగా చేసినా బాగుంటుంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుట్టపర్తి కేంద్రం అనంతపురం జిల్లాలో ఉంది. పుట్టపర్తి అనేది పెదగొండ రెవెన్యూ డివిజన్ క్రిందకి వస్తుంది. పుట్టపర్తికి ప్రతి రోజూ ఒక విఐపి వస్తూనే ఉంటారు. ఆర్‌డివో ప్రోటోకాల్ పుట్టపర్తిలోనే ఉండాలి. హెడ్‌క్వార్టర్ పెదగొండలో ఉంటుంది. నా అభ్యర్థన ఏమిటంటే ప్రోటోకాల్ ఆఫీసర్‌గా పుట్టపర్తిలో ఒక ఆర్‌డివోని సెపరేట్‌గా నియమించండి.

శ్రీ ధర్మాన ప్రసాద రావు : అధ్యక్షా, కొన్ని ముఖ్యమైన ప్రాంతాలున్నాయి. హైదరాబాద్ స్టేట్ హెడ్ క్వార్టర్స్‌లో సెపరేట్‌గా ఒక డిపార్ట్‌మెంట్ ఇలాంటి మర్యాదలన్నీ ప్రోటోకాల్‌ని, అబ్జర్వ్ చేస్తుంది. జిల్లాలకు

వచ్చేటప్పటికి విశాఖపట్టణం, తిరుపతి, పుట్టపర్తి ప్రాంతాలలో ఇటువంటి సమస్య ఉన్నమాట వాస్తవం. ఆర్‌డివో మాత్రమే ప్రోటోకాల్‌ని చూడాలనేటటువంటి ఆదేశం ఇవ్వడం వలన ఇబ్బంది వస్తుంది. ఇది మా దృష్టికి కూడా వచ్చింది. ఇలాంటి ప్రాంతాలలో ఈ సమస్యని పరిష్కారం చేయడానికి ఆర్‌డివో కేడరా, ఇంకొకటా అనే విషయాన్ని ప్రభుత్వం ఆలోచనచేసి తగు పరిష్కారం చేస్తుందని మనవి చేస్తున్నాను.

శ్రీ దాడి వీరభద్రరావు : అడిషనల్ జాయింట్ కలెక్టర్లని ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో పత్రికలలో కూడా ప్రతిపాదనలు చూశాము. అడిషనల్ జాయింట్ కలెక్టర్లని ఏర్పాటు చేయడం అవసరమా, అలా అవసరమైతే వారికి డ్యూటీస్ ఏ విధంగా కేటాయిస్తారు, వారికి ఏ విధమైన బాధ్యతలు, అధికారాలు ఇస్తారు, అడిషనల్ జాయింట్ కలెక్టర్లుగా ఐఏఎస్ ఆఫీసర్లని వేస్తారా, లేదా ఆ కాడర్‌ని దిగజార్చి మళ్ళీ క్రింద వారిని వేస్తారా? వేసినట్లయితే దానివలన ఇబ్బందులు వస్తాయి. దాని స్థాయి దిగజారిపోతుంది. కావున ఐఏఎస్ క్యాడర్‌ని కంటిన్యూ చేస్తారా? అలా కంటిన్యూ చేస్తే ఉన్నటువంటి ఐఏఎస్ ఆఫీసర్లందరూ కూడా సెక్రటేరియట్‌లో డిప్యూటీ సెక్రటరీల దగ్గర నుంచి చాలా మంది ఉన్నారు. వారినే అడ్జస్ట్ చేస్తారా, లేక బయటనుంచి కొంతమందిని తీసుకురావడానికి ప్రయత్నం చేస్తారా?

మిస్టర్ ఛైర్మన్ : లింక్ చేశారు. ఇది చాలా ఇంపార్టెంట్.

శ్రీ ధర్మాన ప్రసాదరావు : సబ్జెక్ట్ తెలుసుకునే ఉత్సాహం ఉండడంలో తప్పులేదు. దీనిని తప్పకుండా క్లారిఫై చేస్తాము. ఇది సందర్భం కాదు. దీనికోసం ప్రత్యేకించి ప్రశ్నలతో వస్తే డీటైల్డ్‌గా చెబుతాము. ఇన్ ప్రిన్సిపుల్ అడిషనల్ జాయింట్ కలెక్టర్లని వేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వేరే రూపంలో అడ్మిట్ చేస్తే మేము సమాధానం చెబుతాము.

శ్రీ దాడి వీరభద్రరావు : అధ్యక్షా, రోశయ్యగారు, ప్రసాదరావు గారు ఎన్‌సైక్లోపీడియా లాంటి వారు. వారి బ్రెయిన్‌లో ఇన్ఫర్మేషన్ అంతా ఉంటుంది. వారు అంతా సమాధానం చెప్పదలచుకుంటే ఇప్పుడే చెప్పవచ్చు.

## రంగారెడ్డి జిల్లా, వికారబాద్‌లో అదనపు జిల్లా న్యాయస్థానం

ప్రశ్న నెం.22 (2505)

డా. కె. నాగేశ్వర్ :

గౌరవనీయులైన న్యాయ, కోర్టులు, సాంకేతిక విద్య, పారిశ్రామిక శిక్షణా సంస్థల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా ;

అ) రంగారెడ్డి జిల్లా వికారాబాదులో అదనపు జిల్లా కోర్టును ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

ఆ) అయితే, ఎప్పటిలోగా అది పనిచేయడం ప్రారంభిస్తుంది?

న్యాయ, కోర్టులు, సాంకేతిక విద్య, పారిశ్రామిక శిక్షణా సంస్థల శాఖ మంత్రిగారు (శ్రీ ఎమ్.వి. రమణారావు):

అ) అవునండీ, ఈ ప్రతిపాదనను ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తున్నది.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

డా. కె. నాగేశ్వర్ (మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాదు) : అధ్యక్షా, పైన చెప్పినట్లు చురుకుగా పరిశీలిస్తుందని సమాధానం ఇచ్చినప్పుడు 'ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు' అనేది రాదు. ఇది శాశ్వతంగా చురుకైన పరిశీలనలోనే ఉంటుందా? 2003వ సంవత్సరంలో ఫాస్ట్ ట్రాక్ ఒకటి ఏర్పాటయింది. గత 3,4 సంవత్సరాలుగా ప్రభుత్వం చురుకుగానే పరిశీలిస్తోంది. ఇంకా చురుకైన పరిశీలన పూర్తి కాలేదు. మార్చి 2010 సంవత్సరం నాటికి ఫాస్ట్ ట్రాక్ గడువు ముగుస్తుంది. కేంద్రప్రభుత్వం దీనిని రెన్యువల్ చేస్తుందో, లేదో తెలియదు. 14 నెలలుగా అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి లేరు. వికారాబాద్ రంగారెడ్డి జిల్లా హెడ్ క్వార్టర్స్. 600 కేసులు పెండింగులో ఉన్నాయి. అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి లేకపోవడం వలన ఈ రోజు 302 ఐపిసి వంటి మర్డర్ కేసులు, 304-బి లాంటి వరకట్న చావుల కేసులు పెండింగులో ఉన్నాయి. ప్రతి నెలా 60 కేసులు పెండింగు వస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా బషీరాబాగ్ చివరి పోలీస్ స్టేషన్ లిమిట్స్ నుంచి ఎల్.బి. నగర్ కోర్టు 160 కిలోమీటర్లు, తాండూరు నుంచి 130 కిలోమీటర్లు, పరిగి, చేవేళ్ల, తాండూరు, వికారాబాద్ లకి సంబంధించిన కేసులు ఇక్కడకు రావాలి. ఇంకా ఇది పరిశీలనలోనే ఉంటే, 2010 మార్చి నాటికి ఫాస్ట్ ట్రాక్ గడువు కూడా పూర్తి అవుతుంది. ఇంతకుముందు డిగ్రీ కాలేజీ విషయంలో ఇలాగే హామీ ఇచ్చారు. సభలో పెద్దలు రోశయ్యగారు ఉన్నారు కనుక నిర్దిష్టమైన హామీ ఇవ్వవలసిందిగా కోరుతున్నాను. అంతేగాక మా జిల్లా నుంచి భూముల విక్రయాల వలన మూడు వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. జిల్లా హెడ్ క్వార్టర్లో అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు లేకపోతే ఎంత అన్యాయం. అధ్యక్షా తమరన్నా ఇన్‌వాల్వ్ అయ్యి, ఆదేశించైనా ప్రభుత్వాన్ని ఒప్పించండి.

ఉ. 10.20

శ్రీ కొంపల్లి యాదవ రెడ్డి (అసెంబ్లి) : అధ్యక్షా, నాగేశ్వర్‌గారు చాలా విషయాలు చెప్పారు. వికారాబాద్‌లో ఫాస్ట్ ట్రాక్ కోర్టు వచ్చిన తర్వాత దాదాపు వేయి కేసులు పరిష్కరించడం జరిగింది. అయితే వికారాబాద్, తాండూరు, పర్గి, చేవేళ్ల అనే ఈ నాలుగు గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి, అయిదారు వందల కేసులు ఇంకా పెండింగులో ఉన్నాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టు గడువు కూడా వచ్చే సంవత్సరం మార్చి నెలతో ముగుస్తుంది. వికారాబాద్‌లో అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఏర్పాటు కొరకు హైకోర్టు కూడా రికమండ్ చేసింది. అయితే రెండు సందర్భాల్లో వేరే ప్రాంతాలకు అవి తరలిపోయాయి. ఒకసారి, సిద్ధిపేటకు పోతే, రెండవసారి, గుడివాడకు పోయింది. కాబట్టి వికారాబాద్‌లో అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టును తప్పకుండా ఏర్పాటు చేయాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. ఈ సందర్భంగా ప్రభుత్వ దృష్టికి తీసుకుని వస్తున్నాను. కొత్త కోర్టు ఏర్పాటు కొరకు మొత్తం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అక్కడ ఉంది. ఒక్క రూపాయి కూడా అదనంగా ప్రభుత్వం మీద భారం పడదు. బిల్డింగు కూడా ఉంది. మొత్తం స్టాఫ్ ఉన్నారు. కాబట్టి తక్షణమే చర్య తీసుకోవలసిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ బి. మోహన్ రెడ్డి (మెదక్, నిజామాబాదు, కరీంనగర్) : అధ్యక్షా, ఒక సామెత ఉంది. కేసు ఓడిపోయిన వాడు కోర్టులో ఏడిస్తే, గెలిచిన వాడు ఇంట్లో ఏడుస్తాడని. అంటే కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి డబ్బులు ఖర్చు అయిపోతాయి. కాబట్టి కోర్టులను దగ్గర దగ్గరగా ఏర్పాటు చేస్తే, కక్షిదారులకు వీలుగా ఉంటుంది. ప్రస్తుతం కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి కాబట్టి, దగ్గర దగ్గర ప్రాంతాల్లో కొత్త కోర్టులను ఏర్పాటు చేయవలసిందిగా కోరుతున్నాను. ఒక్క వికారాబాద్‌లోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా కోర్టుల సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా?

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు : అధ్యక్షా, విశాఖపట్నం నుండి హైదరాబాద్‌లోని హైకోర్టుకు రావాలంటే చాలా మందికి దూరా భారంతోపాటు, చాలా ఖర్చు అవుతోంది. కాబట్టి విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్‌ను ఒక దానిని ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాలుగా డిమాండ్ ఉంది. కాబట్టి, విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్‌ను ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారు?

మిస్టర్ ఛైర్మన్ : క్వశ్చన్‌కు, మీరు అడిగిన దానికి ఏం సంబంధం ఉందండీ? మినిస్టర్‌గారు ఉంటే ఇన్ని సప్లిమెంటర్స్ వస్తాయి. I do not know. I will leave it to the Minister.

శ్రీ ఎం. వి. రమణారావు : అధ్యక్షా, గౌ.సభ్యులు నాగేశ్వర్‌గారు మాట్లాడుతూ, వికారాబాద్‌లో అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఏర్పాటుకు సంబంధించి ఎంతో కాలంగా పెండింగులో ఉందని, అదే విధంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టు గడువు మార్చి, 2010 తో ముగిసిపోతున్నదని చెప్పారు. కొత్త కోర్టుల ఏర్పాటు గురించి హైకోర్టు నుండి మనకు క్లియరెన్స్ ఉన్నా, గవర్నమెంట్ దగ్గరకు వచ్చేసరికి, బడ్జెట్ గాని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు కాని, పోస్టుల శాంక్షన్‌కు సంబంధించిన విషయం గాని ఇలాంటి అనేక అంశాలతో ముడిపడి ఉంది. దాని వల్ల కొత్త కోర్టుల ఏర్పాటు ఇష్యూ పెండింగులో ఉంది. వికారాబాద్‌కు సంబంధించినంత వరకు ప్రపోజల్ మూవ్ అయి ఉంది. ఆ ప్రాంతంలో ఉన్న సమస్య తీవ్రత గురించి నాగేశ్వర్‌గారు మీ ద్వారా సభకు తెలియచేశారు. కాబట్టి ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని, మా అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరలోనే కోర్టు ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తాను. ఇకపోతే, ఫాస్ట్ ట్రాక్ కోర్టు గడువుకు సంబంధించి, అవసరమైతే దాని ఎక్స్‌టెన్షన్ కోసం అడుగుతామని గౌ.సభ్యులకు మీ ద్వారా తెలియచేస్తున్నాను.

డా.కె. నాగేశ్వర్ : అధ్యక్షా, మేము ఎక్స్‌టెన్షన్ అడగడం లేదు. ఎక్స్‌టెన్షన్ కాకుండా, full-fledged కోర్టు ఏర్పాటు చేయమంటున్నాము. గతంలో కూడా న్యాయవాదులు రిప్రజెంట్ చేస్తే, పెద్దలు ఆర్థిక మంత్రిగారు సానుకూలంగా స్పందించారని విన్నాము. రోశయ్యగారు ఇలాంటి వాటి మీద చాలా సానుకూలంగా స్పందిస్తారు. మాకు ఆ అనుభవం ఉంది. గతంలో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు కొరకు 35 నిమిషాల్లోనే అనౌన్స్ చేసి, రంగారెడ్డి జిల్లా ప్రజల ప్రేమాభిమానాలను పొందారు వారు. కాబట్టి , వికారాబాద్‌లోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు గడువు, మార్చి, 2010 తో ముగుస్తున్నది కాబట్టి, అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టును ఒక దానిని అక్కడ త్వరగా ఏర్పాటు చేయండి. ఆల్‌రెడీ హైకోర్టు క్లియరెన్స్ ఉంది. హైకోర్టు చాలా స్ట్రాంగ్‌గా రికమెండ్ చేసింది. ఇప్పుడే యాదవరెడ్డిగారు కూడా చెప్పారు అక్కడ అంతా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉందని. ఛైర్మన్‌గా ఉన్న మీరు న్యాయశాస్త్ర పండితులు. కాబట్టి మీరు గవర్నమెంట్‌కు ఒక డెడ్ లైన్ పెట్టి అక్కడ కోర్టును ఏర్పాటు చేయమని చెప్పండి. కాకపోతే పది రోజులు లేటవుతుంది. కాని ఒక టైమ్ అయితే ఉండాలి కదా ! మాకు న్యాయం చేయండి. ఛైర్మన్‌గా మీరు గవర్నమెంట్‌కు స్పష్టమైన ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాను. నిధుల అవసరం లేదని యాదవరెడ్డిగారు అన్నారు. దాదాపు 160 మంది న్యాయవాదులు అక్కడ ఉన్నారు. కాబట్టి త్వరగా కోర్టు ఏర్పాటు చేయవలసిందిగా కోరుతున్నాను.

MR CHAIRMAN: I am going to the next question.

(డా.కె. నాగేశ్వర్ నుండి అంతరాయం)

శ్రీ ఎం. వి. రమణారావు :అధ్యక్షా, గౌ.సభ్యులు ఆ ప్రాంతంలో కోర్టు ఏర్పాటులో ఆర్థికపరమైన ఇబ్బందులు ఏవీ లేవని తెలియచేస్తున్నారు. కాబట్టి ఈ విషయానికి టాప్ ప్రయార్టీ ఇచ్చి, సాధ్యమైనంత త్వరలో ఆ కోర్టు ఏర్పాటు చేసే దానికి ప్రయత్నం చేస్తాము.

డా.కె. నాగేశ్వర్ : అధ్యక్షా, దయచేసి మీరు ప్రభుత్వానికి ఒక డెడ్ లైన్ పెట్టండి. ఒక నెల, రెండు నెలలు అని గడువు విధించండి. ఆ తర్వాత వారం రోజులు లేటైనా అర్థం చేసుకుంటాము....

(సభలో నవ్వులు)

శ్రీ ఎం. వి. రమణారావు : అధ్యక్షా, గౌ.సభ్యులు శ్రీనివాసులు నాయుడుగారు మాట్లాడుతూ విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు గురించి చెప్పారు. ఒక్క విశాఖపట్టణంలోనే అని కాదు, విశాఖపట్నంతోపాటు, గుంటూరు, అలాగే కొన్ని ప్రాంతాల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని చెప్పి ఎంతో కాలంగా డిమాండ్ ఉన్న మాట వాస్తవమే. అయితే బెంచ్ ఏర్పాటులో అనేక అంశాలు అందులో ఇమిడి ఉన్నాయి. కాబట్టి అక్కడ ఉండే పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తప్పకుండా పరిశీలన చేయడం జరుగుతుంది....

(డా.కె. నాగేశ్వర్ నుండి అంతరాయం కొనసాగింపు)

MR CHAIRMAN: You are becoming emotional.

డా.కె. నాగేశ్వర్ : మిమ్మల్ని ప్రెజరైజ్ చేయమంటున్నాము ప్రభుత్వాన్ని....

MR CHAIRMAN: You cannot pressurize the Minister like this. You cannot even pressurize the Government. You can pressurize me, no problem.

డా.కె. నాగేశ్వర్ : మీ నాయకత్వంలో మేము ఇక్కడ ఉన్నాం, మీరు న్యాయశాస్త్ర కోవిదులు, మీరు ప్రభుత్వాన్ని కొత్త కోర్టు ఏర్పాటు గురించి ప్రెజరైజ్ చేస్తారనే విశ్వాసంతో ఉన్నాము. మీరు సమస్యను అర్థం చేసుకోండి. 14 నెలల నుండి అక్కడ జడ్జి లేరు. 600 కేసులు పెండింగులో ఉన్నాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టు గడువు ముగిసే దానికి ఏడు నెలలు మాత్రమే సమయం ఉంది. న్యాయశాస్త్రం చదివిన మీకు తెలియనది కాదు. మిమ్మల్ని చూస్తే మాకు ఎంతో ధైర్యం, మీరు చేస్తారనే విశ్వాసం ఉంది.

MR CHAIRMAN: I am looking at the Leader of the House.

శ్రీ కె. రోశయ్య (ఆర్థికశాఖమంత్రి) : అధ్యక్షా, ప్రొ. నాగేశ్వర్‌గారు కాని, మిగిలిన వారు కాని మాట్లాడిన మాటలు వాస్తవం. జ్యుడీషియరీలో అనేక కేసులు పెండింగులో ఉన్న మాట వాస్తవమే. వేర్వేరు దశల్లో కేసులు ఎక్కువ సంఖ్యలో పెండింగులో ఉన్నాయి, కేసుల డిస్పోజల్ మాత్రం చాలా తక్కువుగా ఉంటోంది. డిస్పోజల్ త్వరగా జరగడం లేదనే ఆవేదన అటు ప్రజల్లోనూ, ఇటు ప్రభుత్వానికి కూడా ఉంది. అయితే వీటికి కొన్ని లిమిటేషన్స్ ఉన్నాయి. ఇప్పటికే మనం మామూలుగా గవర్నమెంట్ ఎంప్లాయిస్ మీద డైరక్టుగా సాలరీల కింద దాదాపు రూ. 17 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాము. అదే విధంగా పెన్షన్స్ అయితే రూ. 5457 కోట్లు ఖర్చు అవుతున్నది. ఆ

విధంగా ఓవరాల్‌గా సిబ్బంది జీతభత్యాల ఖర్చు పెరిగిపోతున్నది. There is a justification. అయితే అనేక ఇతర సంక్షేమ కార్యక్రమాలు తీసుకోవడం, వాటికి కావలసిన నిధులు ఏర్పాటు చేయడం జరుగుతోంది. సరే, ఎన్ని చేసినా, ప్రజల మీద భారం వేసే దానికి మనసు రానటువంటి ప్రభుత్వం ఇది. గత అయిదు సంవత్సరాలుగా ఆర్టీసి ఛార్జీలు పెంచలేదు. గతంలో పెంచలేదు, రాబోయే అయిదు సంవత్సరాల్లో కూడా పెంచేది లేదు. అదే విధంగా గత అయిదు సంవత్సరాలుగా, విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, రాబోయే అయిదు సంవత్సరాల్లో పెంచం. కొత్త పన్నులు వేసే దానికి ఆలోచనే లేదు. కనుక రావలసిన రెవిన్యూను సంపాదించడం కొంచెం ఇబ్బందికరం. అంతేకాకుండా, నాగేశ్వర్‌గారు చెప్పిన దాంతో ఏకీభవిస్తాను. ఆర్థికంగా కొన్ని ఒడుదుడుకులు ఉన్నాయి. మనకు కొంచెం ఇబ్బందికరమైన పరిస్థితి ఉంది. వాటిని సర్దుబాటు చేసుకుంటూ, వారు చెప్పిన దానికి ప్రాధాన్యత ఇచ్చి, న్యాయవ్యవస్థ పరంగా కూడా కొన్ని చర్యలు తీసుకునే దానికి తప్పకుండా ప్రభుత్వం ఆలోచిస్తుంది.

ఉ . 10.30

## ఆయుష్‌కు జాతీయ ఆరోగ్య పథకం

ప్రశ్న నెం. 23 (2858)

కె.ఆర్. అమోస్:

గౌరవనీయులైన ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ 2007-09 సంవత్సరంలో ఆయుష్ కోసం జాతీయ వైద్య పథకం క్రింద నిధులను సమకూర్చడం జరిగిందా;

ఆ అల్లోపతి ఆసుపత్రులు, ప్రజా వైద్య కేంద్రాలలో ఆయుష్ రోగుల కోసం ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయడానికి ఖర్చుచేసిన మొత్తం ఎంత;

ఇ 2007-09 లో సదరు విస్తరణ కేంద్రాలలో యునాని, హోమియో ఆయుర్వేదాలలో చికిత్స పొందిన రోగుల సంఖ్య ఎంత;

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ డి . నాగేందర్)

అ 2007-09 సంవత్సరానికి కేంద్రప్రభుత్వం కేటాయించిన రూ. 17.22 కోట్ల మొత్తంలో విడుదలైన రూ.8 .60 కోట్లమొత్తాన్ని ఖర్చు చేయడమయింది.

ఆ 2008-09 సంవత్సరానికి కేంద్రప్రభుత్వం రూ. 17.22 కోట్ల మొత్తాన్ని కేటాయించగా ఇప్పటివరకు ఎటువంటి మొత్తం విడుదల చేయలేదు.

ఇ 2009-10 సంవత్సరానికి కేంద్రప్రభుత్వం రూ. 17.22 కోట్ల మొత్తాన్ని కేటాయించగా, ఇప్పటివరకు రూ. 2 .00 కోట్ల మొత్తాన్ని విడుదల చేయడమయింది.

శ్రీ కె. ఆర్. అమోస్ (అసెంబ్లి) : అధ్యక్షా, మీద్వారా మంత్రిగారి దృష్టికి తెచ్చే విషయం, ఈ ఆన్సర్ కంప్లీట్‌గా లేదు. నేను అడిగింది ఒకటి. జవాబు ఇంకొకటి వచ్చింది. సరైన పద్ధతిలో ఇండియన్ మెడిసెన్ సిస్టమ్‌ను ప్రజల దగ్గరకు తీసుకుని పోవడానికి మనం సరైన ప్రయత్నం చేయలేకపోతున్నాము అనిపిస్తుంది. రూరల్ ఏరియాలలో ఆయుర్వేదం, యునాని మందుల మీద నమ్మకంతో ఉంటారు కాబట్టి దానికి జాతీయస్థాయి నుండి రూ.17.22 కోట్లు డబ్బులు తెచ్చారు. రూ. 8 కోట్లు 2007 లో ఖర్చు చేశామని అన్నారు. 2008 లో రూ. 17 కోట్లు అంటున్నారు. రిలీజ్‌కు, ఖర్చుచేసినదానికి చాలా తేడా ఉంది. డిపార్ట్‌మెంట్ వారు ఈ విధమైన సమాధానం ఇవ్వడం................ The way in which the answer is given is misleading answer.

MR. CHAIRMAN: What do you mean by misleading?

SRI K.R. AMOS (ASSEMBLY): Yes, Sir. When the released amount is not spent, what is the use of releasing the amount?

ఈ పాయింట్ కాకుండా నేను ఈ క్వశ్చన్‌లో ఆయుర్వేదం, యునానికి చెందిన ఎక్స్‌టెన్షన్ కౌంటర్లు హాస్పిటల్స్‌లో పెట్టామని అన్నారు. డిస్పెన్సరీలు కాకుండా సెపరేట్ వార్డులు పెట్టాలని భారతప్రభుత్వం ఫండ్స్ రిలీజ్ చేశారు. దీనికి ఇన్ని హాస్పిటల్స్‌లో చేశాము లేక చేయలేదు అనే సమాచారం ఇవ్వలేదు. ఈ హాస్పిటల్స్ సెంట్రల్ గవర్నమెంట్ ఫండ్‌తో ఉన్నాయి తప్ప స్టేట్ గవర్నమెంట్ ఫండ్‌తో కానే కాదు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ క్లినిక్స్ ద్వారా ఎక్స్‌టెన్షన్ సెంటర్లలో ట్రీట్ చేస్తున్నామని అంటున్నారు. దానికి డీటెయిల్స్ ఇవ్వకుండా ఎంతమంది రోగులకు వైద్యం చేశారో దానిని మాత్రమే ఇస్తున్నారు కాబట్టి దీనికి చెందిన వివరాలతో మంత్రిగారు సమాచారం ఇస్తే బాగుంటుంది. లేకపోతే సమాచారం తీసుకుని పంపితే బాగుంటుంది. ఈ ఆయుర్వేదానికి, యునానికి ప్రజలలో చాలా నమ్మకం ఉంది. కొన్ని డిసీజెస్ నూరుశాతం కూడా ట్రీట్‌మెంట్ కన్సల్ట్స్ ఉంటుంది కాబట్టి దీనిని ఆరోగ్యశ్రీతో ఎటాచ్‌చేసి, ఇంట్రడ్యూస్ చేసే దానికి ప్రయత్నం చేస్తారా? ఇక్కడ మిస్‌లీడింగ్ స్టేట్‌మెంట్ వచ్చింది. ఈ క్వశ్చన్ ఓపెన్ చేయడానికి కారణం అల్లోపతిపైన కాలేజీలు, యూనివర్సిటీలు, పెట్టి డబ్బు ఖర్చుచేస్తున్నాము. ఈ సిస్టం మీద మన స్టేట్ ఖర్చుచేయడంలేదు కాబట్టి దీనిపై దృష్టి సారించి మంత్రిగారు చర్యలు తీసుకోవాలని మీద్వారా కోరుతున్నాను.

శ్రీ డి. నాగేందర్ : అధ్యక్షా, రూరల్ హెల్త్ మిషన్ ఏదైతే ఉందో దానికి చాలా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. కేంద్రప్రభుత్వం దీనికి ఏదయితే నిధులు కేటాయించారో, వాటితో ప్రత్యేకంగా గ్రామీణప్రాంతాలలో ఉన్న ప్రజలను చైతన్యవంతులను చేయడానికి మన ప్రభుత్వం ద్వారా చాలా కార్యక్రమాలు తీసుకున్నాము. మన సభ్యులు అమోస్‌గారు చెప్పినట్లు 39 సెంటర్లలో ఇప్పటివరకు సెటప్ చేశాము. ఈ ఆయుర్వేదానికి సంబంధించి సుమారు 439 ప్రైమరీ హెల్త్ సెంటర్లలో దీనిని తీసుకునిరావడం జరిగింది. ఇంకా 52 పిఎస్‌సిలలో కూడా ఈ సౌకర్యాన్ని విస్తరింపజేశాము. దీనికి రూ. 15.2950 కోట్లు వెచ్చించడం జరిగింది. ఆ రకంగా కేంద్రప్రభుత్వం తీసుకున్న కార్యక్రమం, యునాని, హోమియో, న్యాచురోపతి, ఆయుర్వేదానికి రూ. 8.60 కోట్లు మాత్రమే విడుదల చేయడం జరిగింది. ఆ మొత్తం ఖర్చుచేశాము. సెకండ్ ఫేజులో వీటికి రూ. 17 కోట్ల 22 లక్షలు విడుదల చేయలేదు. చేయడానికి ఈ ప్రభుత్వం ద్వారా ఇప్పటికే చాలా సందర్భాలలో ప్రపోజల్స్ పంపాము. ఆ కాన్సెప్ట్‌లో డబ్బులు తెచ్చిన తరువాత యునాని, ఆయుర్వేదం, న్యాచురోపతి విధానాలలో గ్రామీణప్రాంతాలు చాలావరకు ఆధారపడిన విషయం ఒప్పుకుంటూ, దీనిని పూర్తిగా వర్తింపజేయడానికి, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రతిహాస్పిటల్లోను ఈ యూనిట్లు ఏర్పాటుచేయడానికి ప్రయత్నం చేస్తున్నాము. వారి కంట్రిబ్యూషన్‌తో ఇతర

సదుపాయాలు కలిగించడానికి మేము ప్రయత్నం చేస్తున్నాము. తప్పకుండా వారు ఇచ్చిన సూచనలు పరిగణనలోకి తీసుకుని రాబోయేరోజులలో వీటిని మెరుగుపరచడానికి ప్రయత్నం చేస్తాము.

శ్రీ బి. చెంగల్‌రాయుడు : అధ్యక్షా మూడు సంవత్సరాలలో రూ. 51 కోటి 66 లక్షల బడ్జెట్ ఎలోకేషన్ కేంద్రప్రభుత్వం ఇచ్చింది. ఇందులో రూ. 10 కోట్ల 6 లక్షలు తెచ్చుకున్నాము. మిగిలిన రూ. 40 కోట్లు తెచ్చుకోలేదు. ఈ లోపం గుర్తించి, డబ్బు తెచ్చుకునే ఆలోచన ప్రభుత్వానికి ఉందా?

శ్రీ డి. నాగేందర్ : అధ్యక్షా, మిగిలిన డబ్బు విషయానికి సంబంధించి జిల్లా కలక్టర్లకు ఆదేశాలు ఇచ్చాము. మిగతా పిహెచ్‌సిలలో సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారు. కొన్ని హాస్పిటల్స్‌లో ఉంది. దీనికి సెపరేట్ ఎస్టాబ్లిష్‌మెంట్ చేయాలనే ఆలోచన ఉంది. మొత్తం డబ్బు విడుదలయితే యునాని, ఆయుర్వేదంకు సెపరేట్ సెంటర్లు పెట్టే అవకాశం ఉంటుంది కాబట్టి ఆ ప్రక్రియలో ఉన్నాము. వీలయినంత త్వరలో ఆ కార్యక్రమం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాము. కేంద్రప్రభుత్వ రూరల్ హెల్త్ మిషన్‌కు ఏదైతే డబ్బు ఇస్తున్నారో దానిని పూర్తిగా సద్వినియోగం చేసుకోడానికి కృషి చేస్తాము. ఆ సౌకర్యాలు ప్రజలకు అందించే విషయంలో మా ప్రయత్నాలలో లోపం ఉండదని స్పష్టం చేస్తున్నాను.

## <u>ఫించను దారులకు బహుళ ప్రయోజన గుర్తింపు కార్డులు</u>

ప్రశ్న నెం. 24 (2469)

శ్రీ పోచింరెడ్డి సుబ్బారెడ్డి;

గౌరవనీయులైన ఆర్థికశాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ పింఛనుదార్లకు బహుళ ప్రయోజనాల గుర్తింపుకార్డులను జారీచేస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ అయితే, ఆ వివరాలేమిటి;

ఇ సదరు కార్యం కోసం పైలెట్ ప్రాతిపదికన కొన్ని జిల్లాలను మాత్రమే ఎంపిక చేశారన్న విషయం కూడా వాస్తవమేనా;

ఈ అయితే, అందుకుగల కారణాలేమిటి? ఎప్పటిలోగా జిల్లాలకన్నింటికి వర్తింపజేయడమవుతుంది?

ఆర్థిక శాఖ మంత్రి (శ్రీ.కె. రోశయ్య):

అ, ఆ అవునండీ, 30.4.2002 తేదీగల ఆర్థిక (పిఎస్‌సి) శాఖ జివోఎంఎస్ నెం. 555 ద్వారా పశ్చిమ గోదావరి, నిజామాబాదు, కర్నూలు ఈ మూడు జిల్లాలలో పైలెట్ ప్రాతిపదికపై మొదట ఈ పథకాన్ని చేపట్టడమైనది. తదనంతరం, పథకం ఫలితాల ఆధారంగా 13.05.2009 తేదీగల ఆర్థిక (పిఎస్‌సి) శాఖ జివోఎంఎస్ నెం.134 ద్వారా ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయడమైనది.

ఇ, ఈ అవునండీ. 30.4.2002 తేదీగల ఆర్థిక (పిఎస్‌సి) శాఖ జివో ఎంఎస్ నెం.555 ద్వారా పైలెట్ ప్రాతిపదికన మొదట మూడు జిల్లాలు అంటే, పశ్చిమ గోదావరి, నిజామాబాద్, కర్నూలు జిల్లాలను ఎంపికచేసిన విషయం వాస్తవమే. ఈ పథకం నిర్వహణ ఫలితాల ఆధారంగా, 13.5.2009 తేదీగల ఆర్థిక (పిఎస్‌సి) శాఖ, జివో ఎంఎస్ నెం. 134 ద్వారా ఈ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయడమైనది.

శ్రీ పోచిరెడ్డి సుబ్బారెడ్డి (కడప, అనంతపూర్, కర్నూలు) : అధ్యక్షా, 30.4.2002 నాడు 555 జివో ఇష్యూ చేశారు. ఇందులో ఏడు సంవత్సరాలలో కార్డులు ఇష్యూ చేస్తామని అన్నారు. 7 సంవత్సరాలవ్యవధి ఏప్రిల్ 2009 తో ఐపోయింది. ఎప్పటిలోగా ఈ కార్డులు పూర్తిగా అందించగలరు అనేది ఒకటి. రెండవది నేను వేసిన ప్రశ్న దీంట్లో, ఎందుకు బ్రీచ్ జరిగిందో కానీ ఈ కార్డులు ఏ ఏ అవసరాలకు ఉపయోగపడుతుంది అని వేసిన ప్రశ్న ఉంది. దయచేసిదానికి సమాధానం చెప్పాలని కోరుతున్నాను. మూడవది ఈ కార్డులు ఇష్యూ చేయడానికి రూ.2 కోట్ల 78 లక్షలు ఖర్చువుతుందని, ఆ ఖర్చు కూడా పెన్షనర్స్ భరిస్తారు అనే లెటరు గవర్నమెంట్‌కు ఇవ్వడం జరిగింది.

ఉ.10.40

మరి డైరక్టర్ ఆఫ్ ట్రెజరీస్‌కు ఆ రకమైన ప్రపోజల్స్‌పంపించడం జరిగింది కాబట్టి, పెన్షనర్లే ఆ ఖర్చును భరిస్తామని అన్నారు కాబట్టి, త్వరగా వారికి గుర్తింపు కార్డులు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేయాలని తమరి ద్వారా కోరుతున్నాను.

శ్రీ బి. మోహన్ రెడ్డి : అధ్యక్షా, పెన్షన్‌దారులకు బహుళ ప్రయోజన గుర్తింపు కార్డులు అన్నపుడు ఏ ఏ అంశాలు అందులోకి వస్తాయి ? ముఖ్యంగా ఆరోగ్యానికి సంబంధించి, హెల్త్ కార్డులు చేరి వున్నాయా ? ఎందుకంటే ఈ రోజు పెన్షనర్లు హాస్పిటల్స్‌లో చేరాలంటే అనేక రకమైన ఇబ్బందులకు గురవుతున్నారు. రీఎంబర్స్‌మెంట్‌కు సంబంధించిన ఇబ్బందులను కూడా పడుతున్నారు. ఆ హెల్త్ కార్డులు కూడా ఇందులో ఒక భాగమా అనేది చెప్పాలని కోరుతున్నాను. అవి మల్టీ పర్పస్ హెల్త్ కార్డుల క్రింద ఉపయోగపడతాయా అనేది చెప్పాలని తమరి ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కె.రోశయ్య : అధ్యక్షా, సుబ్బారెడ్డి గారు నేను చెప్పిందే రిపీట్ చేసారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ వారి యొక్క సంఘాల ద్వారా వచ్చి, ‘మేము పెన్షన్లు డ్రా చేసుకోవడానికి వెళ్లినపుడు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము, మాకు ఒక ఐడెంటిటీ కార్డు ఇస్తే బాగుంటుంది, ఆ ఖర్చు మేమే భరిస్తాము, మేము కార్డులు తెచ్చుకుంటామని’’ కోరడం జరిగింది. అట్లాగే వారు కార్డులు తెచ్చుకుంటే సంబంధిత ఆఫీసర్ సంతకం చేయడం జరిగింది. దానిని వారు లామినేషన్ చేసుకోవడం జరిగింది. ఆ విధంగా కర్నూలు జిల్లాలో 10368 మంది, వెస్ట్ గోదావరి జిల్లాలో 6,368 మంది మాత్రమే వినియోగించుకోవడం జరిగింది. నిజామాబాదులో 11,028 మంది వినియోగించుకున్నారు. ఐచ్ఛికంగా వారు తెచ్చుకుని వాడుకోవడం వల్ల తక్కువ సంఖ్యలో వాడుకోవడం జరిగింది. ఎవరి మటుకు వారే అంటే ఇబ్బందికరంగా వుంటుందనే భావనతో ప్రభుత్వం కూడా ఆలోచించి సెంట్రలైజ్ చేస్తే బాగుంటుందని ఆలోచించి, పెన్షనర్లకు కార్డు జారీ చేసేటపుడు ఆ డబ్బు తీసుకుంటే బాగుంటుందనే భావనతో 2009 మే లో ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

సుబ్బారెడ్డి గారు చెప్పారు, డబ్బులు వారే ఇస్తున్నారని, ఆ మాట కరెక్ట్. వారి దగ్గర డబ్బులు తీసుకుంటున్నామని కాదు కాని, ఇండివిడ్యువల్‌కు కార్డు జారీ చేసి, దాని కాస్ట్ వారి దగ్గర నుంచి తీసుకుంటుంటే

బాగుంటుందని అనుకున్నాము. మే 13న నిర్ణయం తీసుకున్నాము కాబట్టి ఎక్కువ టైమ్ తీసుకోకుండా వీలైనంత త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాము.

2002లో జారీ చేసేటపుడు ఆనాడు దీనిని కేవలం పెన్షన్ డ్రా చేయడానికి ఐడెంటిఫికేషన్‌కు ఇబ్బంది లేకుండా వుండడానికి ఐడెంటిటీ కార్డు క్రింద పెట్టుకున్నాము. ఇది మల్టీ పర్పస్ కార్డు అని పేరు వుంది కాని, ఏమేమి వస్తాయని చూస్తే, నేను నిన్న విచారించాను. మల్టీ పర్పస్ కార్డు అనేది పేరుకే తప్ప, అది కేవలం పెన్షన్ డ్రా చేయడానికి ఐడెంటిఫికేషన్‌కు మాత్రమే పనికొస్తుంది. మెడికల్ బిల్స్ డ్రా చేసుకోడానికి ఇబ్బంది అవుతోందని అన్నారు. ఇందులో ఇబ్బంది వుంటే సాధ్యమైనంత త్వరగా ఇబ్బందిని తొలగించడానికి ప్రయత్నిస్తాము. మీరు చెప్పినట్లుగా, ఇతరత్రా ప్రయోజనాలకు ఈ కార్డును ఉపయోగించుకోడానికి ఫర్దర్‌గా ఆలోచన చేయాలి తప్ప, ఇప్పటికైతే కేవలం పెన్షన్ డ్రా చేసుకునేందుకు ఐడెంటిఫికేషన్ కొరకు ఫెసిలిటేట్ చేసుకోడానికి వినియోగిస్తున్నాము.

శ్రీ దాచూరి రామిరెడ్డి (ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) ః ఈ కార్డుల ద్వారా స్పౌసెస్‌కు కూడా ఐడెంటిఫికేషన్‌కు అవకాశం కల్పిస్తారా? కేవలం పెన్షన్ డ్రా చేసే వారికే ఇస్తారా?

శ్రీ పోచింరెడ్డి సుబ్బారెడ్డి ః అధ్యక్షా, రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యన గౌరవ ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన ఒక సమావేశం నిర్వహించినపుడు మొత్తం ఎంప్లాయీస్, రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు మల్టీ పర్పస్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు కాబట్టి ఈ కార్డులను మల్టీ పర్పస్ కార్డులుగా మార్పు చేసినట్లయితే రెండింటికీ ఉభయతారకంగా వుంటుందని, మంత్రి గారిని ఆలోచించమని తమరి ద్వారా కోరుతున్నాను.

శ్రీ కె. రోశయ్య ః సర్, ఇప్పుడు పెన్షన్‌లో రెండు రకాలైన పెన్షన్లు వున్నాయి. 1. రెగ్యులర్ పెన్షన్, 2. ఫామిలీ పెన్షన్. ఫామిలీ పెన్షన్ వున్న చోట్ల రెండు ఫొటోలు కలిపి ఇవ్వడం జరుగుతుంది. అట్లా కాకుండా మామూలుగా రెగ్యులర్ పెన్షన్ అయితే పెన్షనర్లకు మాత్రమే జారీ చేయడం జరుగుతుంది. మీరు చెప్పిన సలహా ప్రకారం, ఇంకా ఇతరత్రా ప్రయోజనాలను కవర్ చేయడానికి వీలుందా లేదా అనేది ఎగ్జామిన్ చేయాలి. As on today, the identity cards are being used by the pensioners for drawing the pension.

శ్రీ బి. మోహన్ రెడ్డి ః దీనిని సులభతరం చేయడానికి, మళ్లీ మళ్లీ ఫొటోలు తీసుకోనవసరం లేకుండా .....

మిస్టర్ చైర్మన్ ః మీరు ఆల్‌రెడీ చెప్పారు కదా.

శ్రీ బి. మోహన్ రెడ్డి ః పెన్షనర్లకు సహకరిస్తే మీకు పుణ్యం వస్తుంది.

( సభలో నవ్వులు )

పెన్షన్ పేపర్లు సబ్మిట్ చేసేటపుడు భార్యా భర్తల ఇద్దరి ఫొటోలను ఇస్తారు. కార్డు ఆ విధంగా ఇచ్చినట్లయితే, భర్తకు, భర్త పోతే భార్యకు ఆటోమేటిక్‌గా ఉపయోగపడుతుంది. అందువల్ల భార్యాభర్తలకు ఇద్దరికీ కలిపి కార్డులు ఇస్యూ చేసినట్లయితే ఒకరు పోయినా మరొకరికి ఉపయోగపడుతుంది. దీనిని పరిశీలించాలని తమరిని కోరుతున్నాను.

శ్రీ కె. రోశయ్య : మీ సలహా తప్పకుండా ఆలోచిస్తాము.

మిస్టర్ చైర్మన్ : మోహన్ రెడ్డి గారూ, మీరు మంచి మంచి సలహాలను ఇస్తారు. అయితే క్వశ్చన్ వచ్చినపుడే చెప్పనక్కరలేదు. You can always give useful suggestions to the Government even outside the House. I compliment you for giving useful suggestion to the Government.

<u>తూర్పుగోదావరి ఏజన్సీ ప్రాంతంలో రబ్బరు తోటలు</u>

ప్రశ్న నెం. 25 (2601)

శ్రీ గిడుగు రుద్రరాజు:

గౌరవనీయులైన గిరిజన సంక్షేమం, ఆర్ఐఎడి శాఖా మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ;

(అ) తూర్పు గోదావరి ఏజన్సీ ప్రాంతంలోని భూములు రబ్బరు సాగుకు అనుకూలమన్న విషయం వాస్తవమేనా;
(ఆ) అయితే సదరు ప్రాంతాలలో రబ్బరు సాగును అభివృద్ధి చేయడానికి తీసుకున్న చర్యలేమిటి;
(ఇ) రబ్బరు సాగుకు లభ్యంగా వున్న భూమి విస్తీర్ణం, వినియోగించిన భూమి విస్తీర్ణం ఎంత?

గిరిజన సంక్షేమం, ఆర్ఐఎడి శాఖా మంత్రి (శ్రీ పి. బాలరాజు);

(అ) అవునండి
(ఆ) 1993-2007 కాలంలో రబ్బరు బోర్డు, ఐటిడిఎ ద్వారా 275 ఎకరాల విస్తీర్ణంలో సాగును చేపట్టింది. 2007-2010 కాలంలో ఎన్ఆర్ఇజిఎస్, ఐటిడిఎ, రబ్బరు బోర్డు 6707 ఎకరాలలో సాగును చేపట్టింది. లబ్ధిదారులను గుర్తించి వారికి శిక్షణను ఇవ్వడమయింది. నర్సరీలను పెంచడమయింది.
(ఇ) తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం లోని ఐటిడిఎ రబ్బరు సాగు కోసం తూర్పు గోదావరి జిల్లాలో 31,100 ఎకరాల విస్తీర్ణాన్ని గుర్తించింది.

శ్రీ గిడుగు రుద్రరాజు (తూర్పుగోదావరి) : అధ్యక్షా, గిరిజనుల యొక్క సమగ్రాభివృద్ధి కోసం వారికి శాశ్వతమైన ఆదాయ వనరులను పెంచాలనే దృక్పథంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి ఈ విధమైన ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకున్నందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటినీ నేను అభినందిస్తున్నాను.

2007-08 సంవత్సరంలో పైలట్ ప్రాజెక్ట్ క్రింద తీసుకుని వేసిన ప్లాంటేషన్లు 1.30 లక్షలు వుంటే అందులో సర్వైవ్ అయినవి 33 శాతం మాత్రమే. సుమారు 63 నుంచి 67 శాతం వరకూ మొక్కలు చనిపోయిన మాట వాస్తవమా కాదా? చనిపోయిన మొక్కలకు రీఎంబర్స్ చేయడం కాని, వారికి రీప్లాంటేషన్‌కు పోవడానికి కాని అవకాశం వుంటుందా? ఉద్యానవన శాఖకు సంబంధించిన నిబంధనల ప్రకారం మొక్కలు 20 శాతం వరకూ

వుంటేనే మెయిన్టెనెన్సుకు వయబిలిటీ కాని, ఫీజిబిలిటీ కాని వుంటుందని అంటున్నారు. ఇప్పుడు 67 శాతం వరకూ మొక్కలు చనిపోయాయి కాబట్టి ఎటువంటి చర్యలు ప్రభుత్వ పరంగా తీసుకుంటారనేది ఒకటి.

స్టాఫింగ్ పాటర్న్‌కు సంబంధించి, ఇప్పుడు వున్న పరిస్థితులలో మనం ఒక మాసివ్ ప్లాంటేషన్‌ను తీసుకుంటున్నాము కాబట్టి, 31,000 ఎకరాలలో మనం ప్లాంటేషన్ చేస్తున్నాము కాబట్టి ఉద్యానవన శాఖ అధికారులు ఎంత మంది వున్నారు, అవసరమైన నియామకాలను ఈ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందా, ప్లాంటేషన్‌కు సంబంధించి చుట్టూ ఫెన్సింగ్ వేసుకోవడానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కొంత అమౌంట్ ఇస్తారా అని తమరి ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

ఉ. 10.50

శ్రీ పి. బాలరాజుః ఇది 7 సంవత్సరాల ప్రాజెక్ట్. ఈ 7 సంవత్సరాల ప్రాజెక్ట్‌లో మొదటి సంవత్సరం క్రింద నర్సరీలు రైజ్ చేసి 6 నెలల కాలం తరువాత ప్లాంటేషన్ మొదలు పెట్టడం జరుగుతుంది. 7 సంవత్సరాలలో ఫేజ్డ్ మ్యానర్ క్రింద సంవత్సరాల వారీగా అక్కడున్న రైతాంగానికి ఈ కార్యక్రమం ఉద్ధేశ్యాలను తెలియచేయడం జరుగుతుంది. ఈ మొత్తం 31,000 ఎకరాలకు పూర్తిగా ఐటిడిఏ., వ్యవసాయ, హార్టీ కల్చర్ అధికారుల పర్యవేక్ష ణలో ఈ కార్యక్రమం జరుగుతుంది. మొదట సర్‌వైవల్ శాతానికి సంబంధించి ఎక్కడ సర్‌వైవల్ నష్టపోయిందో ఆ స్థలంలో ఈ సంవత్సర ప్రోగ్రామ్ క్రింద తీసుకొని వాటిని పూర్తి చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవడం జరుగు తుంది. ఈ భారీ కార్యక్రమం 15,000 మందికి లబ్ధి చేకూర్చే కార్యక్రమం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని వారిని ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్లడానికి తీసుకున్న కార్యక్రమం. ఈ కార్యక్రమంలో రైతుల భాగ స్వామ్యంతోబాటు వారికి శిక్షణ ఇచ్చే కార్యక్రమం చేపట్టి వారిని భాగస్వామ్యులుగా చేసి పూర్తిగా అధికారుల సహా యంతో రైతాంగ పర్యవేక్షణలో ఇది జరుగుతుంది ఐటిడిఏ., ఎన్ఆర్ఇజిఎస్, కేంద్ర ప్రభుత్వం రబ్బరు బోర్డ్, ఈ మూడు శాఖల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

## <u>జి.హెచ్.యం.సి. పబ్లిక్ పార్కుల నిర్వహణ</u>

ప్రశ్న నెంః 26 (2432)

శ్రీ పి. సుధాకరరెడ్డి;

గౌ.న మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచే స్తారా;

అ) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పార్కుల సంఖ్య ఎంత? వాటి నిర్వహణను అప్పగించిన సంస్థల వివరాలు ఏమిటి;

ఆ) జలగం వెంగళరావు పార్కులోగల కుంట నుండి దుర్వాసన వెలువడుతున్నందున వాకర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న విషయం వాస్తవమేనా;

ఇ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్యలు ఏమిటి;

ఈ) ఈ పార్కుల నిర్వహణను మల్టీనేషనల్ కంపెనీలకు అప్పగించే ప్రతిపాదన ఏదైనా ఉందా?

మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు (శ్రీ ఆనం రాంనారాయణరెడ్డి):

అ) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 260 పార్కులను నిర్వహిస్తున్నది. 77 పార్కులను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తుండగా, 183 పార్కులను కాలనీ సంక్షేమ సంఘాల సహాయంతో నిర్వహించడమవుతున్నది.

ఆ) లేదండి.

ఇ) పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధనాసంస్థ సూచించిన విధంగా దుర్వాసనను నియంత్రించడానికి, కుంట నీటిని శుభ్రపరచడానికిగాను సంవత్సరం పొడవునా వారానికి ఒకసారి డొలోమైట్, జియొలైట్ వంటి రసాయనాలతో కుంట నీటిని శుద్ధి చేయడం, జరుగుతున్నది . అంతేకాకుండా కుంట లోనికి వచ్చి చేరే నీటిని ముందే శుద్ధి చేయడానికి జలగం వెంగళరావు పార్కులో ఎస్‌టిపి (మురుగునీటి శుద్ధి చేసే ప్లాంటును) ఏర్పాటు చేయడమయింది.

ఈ) లేదండి

శ్రీ పి. సుధాకర్ రెడ్డి (మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాదు) : మంత్రిగారు చెప్పిన రెండవ సమాధానానికి, మూడవ సమాధానానికి తేడా ఉంది. వెంగళరావు పార్కులో జలాశయం నుండి దుర్వాసన వస్తుందంటే లేదన్నారు. మూడవ దానిలో ప్లాంట్‌తో నీటిని శుద్ధి చేస్తున్నామన్నారు.స్వయంగా వెంగళరావు పార్కులో నేను వాకర్‌ని. అక్కడ వాక్ చేస్తాను. జలాశయం నుండి వస్తున్న దుర్వాసన నేను చూస్తున్నాను. వాకర్లు ఇబ్బంది పడుతున్నారు. దానిని శుద్ధి చేసే ప్లాంట్, ప్రైవేట్ కాంట్రాక్టర్ ద్వారా నిర్వహిస్తున్నారు. ప్లాంట్ నుండి వచ్చే నీరు నుండి దుర్వాసన వస్తోంది. అక్కడ సరైన కాంట్రాక్టర్ లేరు. రెండవది, వాకర్ పాత్ ఎత్తుపల్లాలు ఉండడంవల్ల ఒక వృద్ధ మహిళ నడుస్తున్నావిడ నిన్ననే పడి పోయి ఆమె కాలు నుండి రక్తం కారింది. 77 పార్కులు మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తోందన్నారు. జలగం వెంగళరావు పార్క్‌ని మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది. పార్క్‌లో దుర్వాసన రాకుండా చర్యలు ఏమైనా తీసుకుంటారా? డ్రైనేజ్ కూడ ఈ పార్క్‌లోకి వస్తోంది. దీనికిగాను నివారించే చర్యలు ఏమైనా తీసుకుంటారా? వాకర్ పాత్ కూడా ఎత్తుపల్లాలు లేకుండా సమతలం చేసే కార్యక్రమం మున్సిపల్ కార్పొరేషన్ చేపడుతుందా? ఈ రెండు ప్రశ్నలకు సముచితమైన సమాధానం రావాలని కోరుతున్నాను.

శ్రీ చేరుపల్లి సీతారాములు: ఈ పార్కుల స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని అనేక సందర్భాలలో పత్రికలలో కూడా వార్తలు వస్తున్నాయి. ఆక్రమణలకు గురైన పార్కుల జాబితా ఉందా? ఆక్రమణలకు గురి కాకుండా తీసుకునే చర్యలు తీసుకుంటున్నారా? ఈ విషయంలో సమాధానం తెలియచేయాలని కోరుతున్నాను.

డా. కె. నాగేశ్వర్: ఇటీవల జిహెచ్ఎంసి., నగరంలో చాలా పార్కులకు డెవలప్‌మెంట్ తీసుకుంది. ప్రత్యేకంగా వెల్ఫేర్ అసోసియేషన్‌ల సహకారంతో నిర్వహించే పార్కులలో కనీస సదుపాయాలు వాకర్స్‌కి సదుపాయాలు, చిన్న పిల్లలు ఆడుకోవడానికి సదుపాయాలు, లైటింగ్ మొదలైనవి ఏర్పాటు చెస్తే బాగుంటుంది. ఇదివరకే ప్రభుత్వం సదుపాయాలు క్రియేట్ చేసింది మళ్లీ వాటిని గమనించవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ గిడుగు రుద్రరాజు: గౌరవ సభ్యులు సుధాకర్‌రెడ్డిగారుచెప్పినట్లుగా,యూసఫ్‌గూడలో కృష్ణకాంత్‌గారి పేరు మీద పెద్ద పార్క్ ఉంది. యూసఫ్‌గూడలోని మున్సిపల్ పార్క్‌లో మార్నింగ్ వాక్‌కి నేను వెళతాను. వాకర్

పాత్ సమస్య ఉంది. ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్యం ఇచ్చే బదులు అనారోగ్యం ఇవ్వకూడదు కాబట్టి గౌరవ మంత్రి గారిని ఈ విషయంలో ఆలోచించి సానుకూలంగా స్పందించాలని కోరుతున్నాను.

శ్రీ బి. మోహన్‌రెడ్డిః ప్రభుత్వం వారు నిజంగా గతం కన్నా ఎక్కువ సుందరమైన పార్కులను తయారుచేస్తున్నారు. బ్రహ్మాండంగా పార్కులు ఎక్కువ అవుతున్నాయి. ముందుకన్నా ఎక్కువయ్యాయి, అనుమానం లేదు. పార్కుల్లో కూర్చుంటూ ఉంటే దోమలు కుడుతున్నాయి. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. వాతావరణం బాగా ఉంటుందని అందరూ పార్కులకు వెళతారు. మాకు షుగర్ ఉంది. అందుకే దోమలు ఎక్కువగా అట్రాక్ట్ అయి కుడుతున్నాయోమో? పార్కులలో దోమల మందు వేయించాలని కోరుతున్నాను.

శ్రీ బి. రాధాకృష్ణయ్య (నామినేటెడ్) ః అధ్యక్షా, పార్కులలో సెక్యూరిటి గార్డ్‌లను పెట్టారు. కానీ ప్రతీ పార్క్‌లలో వారికి షెల్టర్స్ లేవు. ఎండకు ఎండి, వానకు తడిసిపోతున్నారు. కాబట్టి వారికి షెల్టర్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరుతున్నాను.

శ్రీ ఆనం రాంనారాయణరెడ్డిః అధ్యక్షా, ప్రధానమైన ప్రశ్న, జలగం వెంగళరావు పార్క్‌కి సంబంధించిన ప్రశ్న. వెంగళరావుగారి పేరుతో ఉన్న పార్క్‌లో వచ్చే దుర్వాసన గురించి అక్కడున్న వాకర్ పాత్ సరైన లెవెల్‌లో లేకుండా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మొదట ఈ పార్క్ ఏర్పాటు చేసిన సందర్భంలో దాదాపు 9.85 ఎకరాల విస్తీర్ణం కలిగినది. ఇందులో 3 ఎకరాల స్థలంలో ఒక మడుగు ఉంది. గతంలో ఉన్న రిజర్వాయర్ వాటర్ బాడీస్‌లో ఇది ఒకటి. ఆ ప్రాంతంలో ఉన్న వర్షం నీరు, మురుగునీరు అందులో పడడం జరిగింది. ఈ పార్క్ ఏర్పాటు చేసేటప్పుడు గత సంవత్సరంలో ఈ దుర్గంధం వస్తుందని కంప్లయింట్ వచ్చిన తరువాత దానిని డీసిల్టింగ్ చేయడం జరిగింది. ఫ్రెష్ వాటర్ రావాలని దానిలో (పాయింట్). 5 ఎంజిడి., కెపాసిటి కలిగిన సెపరేట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ రు.47 లక్షల ఖర్చుతో పెట్టడం జరిగింది.

ఉ. 11.00

దాదాపు 47 లక్షల రూపాయల ఖర్చుతో ఏర్పాటుచేసిన ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా శుభ్రపరచిన నీటిని పాండ్‌లోకి వదిలి వేయడం జరుగుతోంది. అయినప్పటికీ ఇంకా దుర్వాసన వస్తుందనే కంప్లయింట్ వచ్చిన తరువాత నీటిని ఎప్పటికప్పుడు ట్రీట్ చేయాలనే ఉద్దేశ్యంతో డోలోమైట్, జియోలైట్ అనే కెమికల్స్‌ను ఉపయోగించి నీటిని శుభ్రం చేసి పాండ్‌లోకి వదలడం వల్ల అక్కడికి వెళ్లే పాదచారులకు కాని, చుట్టుపక్కల ఉండే ప్రజలకు కాని ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చేయడం జరుగుతోంది. సుధాకర రెడ్డి గారు అడిగిన ప్రశ్నను చూచిన తరువాత అదనపు కమీషనర్, జి.హెచ్.ఎం.సిని ఇన్‌స్పెక్ట్ చేయమని ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా వారు అక్కడికి వెళ్ళి ప్రతి రోజూపార్కుకు వచ్చే వాకర్స్‌తో దుర్వాసన సమస్య గురించి మాట్లాడడం జరిగింది. అక్కడకు వచ్చే ప్రతి ఒక్కరు కూడా గతంలో దుర్వాసన వస్తున్న మాట వాస్తవమే కాని ఇప్పుడు చాలా వరకు కంట్రోల్ అయింది. ఎప్పటికప్పుడు రసాయనాలు వాడడం ద్వారా ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచే ప్రయత్నం చేయండని సలహా ఇవ్వడం జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఏర్పడిన తరువాత పార్కుల కోసం కేటాయించబడిన మున్సిపల్ స్థలాలను భద్రపరచడం కష్టమౌతుందని, అలాగే వదిలి వేస్తే ఎవరి మటుకు వారు ఆక్రమించుకుంటారన్న ఉద్దేశ్యంతో వీటన్నింటికి ప్రహరీ గోడల నిర్మాణం చేయాలని మున్సిపల్ శాఖ సమీక్షా సమావేశంలో గౌరవ ముఖ్యమంత్రి గారు నిర్ణయం తీసుకున్నారు. దాని ప్రకారం జి.హెచ్.ఎం.సి కింద గుర్తించబడ్డ 2202 స్థలాలను (మొత్తం 1727 ఎకరాల భూమి అవుతుంది) తప్పని సరిగా కాపాడాలనే ఉద్దేశ్యంతో గత ఒకటిన్నర

సంవత్సరాలలోనే దాదాపు రూ.98 కోట్లు ఖర్చు పెట్టి ఇప్పుటి వరకు 914 స్థలాలకు ప్రహరీ గోడలు కట్టడం జరిగింది. గేట్లను కూడా పెట్టడం జరిగింది. మిగిలిన వాటిని కూడా కాపాడే నిమిత్తం ఈ సంవత్సరం బడ్జెట్‌లోను రాబోయే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోను నిధులు మంజూరు చేయడం ద్వారా మిగిలిన ప్రభుత్వ స్థలాలకు, పార్కులకు ప్రహరీ గోడల నిర్మాణం చేసి వాటిని కాపాడటంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలియచేస్తున్నాను. పార్కులో పాదచారులు నడిచే పెడస్ట్రియన్ స్ట్రిప్ డ్యామేజ్ అయిందని సభ్యులు తెలియచేసినందు వల్ల పరిశీలన చేసి దానిని బాగు చేయించడానికి తప్పకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియచేస్తున్నాను.

శ్రీ దాడి వీరభద్రరావు : అధ్యక్షా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న మున్సిపల్ స్థలాల చుట్టూ ప్రహరీ గోడలు కట్టడానికి నిధులు మంజూరు చేస్తున్నామని మంత్రి గారు చెపుతున్నారు. అన్ని మున్సిపాల్టీలలోను మున్సిపల్ స్థలాలను కాపాడే నిమిత్తం ఆ స్థలాల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసి ఇప్పటికి రెండు సంవత్సరాలు అయింది. ఇంతకు ముందు రంగారావు గారు మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు వచ్చే ఆరు మాసాలలో ప్రహరీ గోడల నిర్మాణం పూర్తి చేస్తామని సభకు హామీ ఇచ్చారు. కాని, ఇంతవరకు అమలు జరగలేదు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఎప్పటిలోగా అమలుపరచడానికి మంత్రి గారు చర్యలు తీసుకుంటారో చెప్పవలసిందిగా మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ బి. మోహన్ రెడ్డి : అధ్యక్షా, దోమలు నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి మంత్రి గారు సమాధానం చెప్పాలి.

శ్రీ ఆనం రామనారాయణరెడ్డి : అధ్యక్షా, ప్రధాన ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ స్థలాలు, పార్కులు కాపాడటంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఏ విధంగా ప్రభుత్వం అమలు పరుస్తుందని అడిగిన దానికి సమాధానంగా ఇంతకు ముందే చెప్పిన ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న మొత్తం 2202 ప్రభుత్వ స్థలాలను (1727 ఎకరాల విలువైన భూమి) కాపాడటంలో ఇప్పటికి రూ.98 కోట్లు ఖర్చు పెట్టి 914 స్థలాలకు ప్రహరీ గోడల నిర్మాణం పూర్తి చేయడం జరిగింది. మిగిలిన వాటికి కూడా ప్రహరీ గోడల నిర్మాణం పూర్తి చేయడానికి సత్వర చర్యలు తీసుకుంటున్నాం. అలాగే, 547 మున్సిపల్ స్థలాలకు ప్రహరీ గోడలు కట్టడానికి నిధులు మంజూరు చేయడం జరిగింది. దానికి అవసరమైన శాంక్షన్స్ కూడా ఇవ్వడం జరిగింది. ఏ ఒక్క స్థలాన్ని వదులు కోవడానికి కాని, ఆక్రమణదారుల చేతుల్లోకి పోవడానికి కాని ప్రభుత్వం సంసిద్ధంగా లేదు కాబట్టి తప్పనిసరిగా వాటిని కాపాడటానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొంటుంది.

మిస్టర్‌ఛైర్మన్ : దోమల నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారో చెప్పండి.

శ్రీ ఆనం రామనారాయణరెడ్డి : అధ్యక్షా, మురుగు కాల్వలు, మురుగు నీరు ఉన్న ప్రదేశాల దగ్గర కొంత దోమల బెడద ఉంటుంది. దోమల బెడద లేదని చెప్పను కాని ఎప్పటికప్పుడు మున్సిపల్ హెల్త్ శాఖ ద్వారా దోమలను నిర్మూలించడానికి స్ప్రేయింగ్స్‌ను, రసాయనాలను వాడటం జరుగుతూనే వుంటుంది. సభ్యులు చెప్పినట్లు ఇంకా ఎక్కడైనా వుంటే శానిటేషన్ ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుంది. పార్కులలో ఎక్కువగా గ్రీన్ బెల్ట్ లాన్స్ ఉంటాయి కాబట్టి ఆ లాన్స్‌ల దగ్గర సహజంగా దోమలు ఉండడమనేది జరుగుతుంది. తప్పనిసరిగా మేలైన పరిస్థితిలో పార్కులను నడపడానికి ప్రయత్నం చేస్తామని తెలియచేస్తున్నాం.

## రెడ్‌క్రాస్ చిహ్న దురుపయోగం

ప్రశ్న నం. 27 (2736)

డా. కె. రాజ్యలక్ష్మి

గౌరవనీయులైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా;

అ) రెడ్‌క్రాస్ చిహ్నం వినియోగాన్ని 1960, జెనీవా కన్వెన్షన్ చట్టం ద్వారా నియంత్రిస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) రాష్ట్రంలో రెడ్‌క్రాస్ చిహ్నాన్ని చాలా ఎక్కువగా దుర్వినియోగపరుస్తున్న విషయం వాస్తవమేనా;

ఇ) అయితే, అవగాహన కల్పించడం ద్వారా ఈ చట్టాన్ని పటిష్టంగా అమలుపర్చేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ డి. నాగేందర్) ః

అ) అవునండీ. అంతర్జాతీయ మానవతా చట్టం (ఐహెచ్ఎల్) ఆధారంగా ఇప్పుడు రూపొందించిన 1949 జెనీవా కన్వెన్షన్స్ రెడ్‌క్రాస్ చిహ్నాన్ని యథాతథంగా ఉంచాయి. భారతదేశం, 1950 అక్టోబరు 19 వ తేదీన జెనీవా కన్వెన్షన్స్ ధృవీకరించింది. జెనీవా కన్వెన్షన్స్ క్రింద బాధ్యతలను నెరవేర్చడానికి, భారత పార్లమెంట్, 1960 లో జెనీవా కన్వెన్షన్స్ చట్టాన్ని చేసింది. ఈ చట్టంలోని 13వ పరిచ్ఛేదంతోపాటు 12 వ పరిచ్ఛేదం, రెడ్‌క్రాస్ చిహ్నం అనధికారికంగా వినియోగించడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నది. అంతేకాక, అట్టి అనధీకృత వినియోగాన్ని శిక్షించదగు నేరంగా పేర్కొంటుంది.

ఆ) అవునండి.

ఇ) చట్టంలోని నిబంధనలపై ప్రజలను చైతన్యపరచడంలో వైద్య, దంత, నర్సింగ్ అసోసియేషన్లు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్లు, ప్రయివేటు నర్సింగ్ అసోసియేషన్లు మొదలగు వాటి విషయంలో భారత రెడ్ క్రాస్ సొసైటీ (ఎపి) తో కలిసి పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది.

2009, ఆగస్టు 10వ తేదీన హైదరాబాదులో రెడ్‌క్రాస్ చిహ్నం పై ఒక సెమినార్, వాలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి 2009, ఆగస్టు 11వ తేదీ నుండి 13 వ తేదీ వరకు ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేయాలని భారత రెడ్ క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాంచ్ ప్రతిపాదించింది.

డా. కె. రాజ్యలక్ష్మి (నామినేటెడ్) ః అధ్యక్షా, మంత్రి గారు క్షుణ్ణంగా సమాధానం ఇచ్చారు. పార్ట్‌నర్ షిప్‌తో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారితో పనిచేసి చిహ్నాన్ని వాడేవిధంగా అమలులోకి తీసుకువస్తామన్నారు. 1960 లో భారతదేశ పార్లమెంట్‌లో పాస్ అయిన చట్టాన్ని ఇంతవరకు అమలులోకి తీసుకురాకపోవడానికి కారణం ఒక రకమైన అశ్రద్ధే అని అనుకోవాలి. అయితే ఈ మధ్య ఇండియన్ హ్యుమానిటేరియన్‌లోకి వచ్చిన తరువాత దీని మీద

కొంత శ్రద్ధ పెరిగింది. గత ఐదు సంవత్సరాలుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతి జిల్లాలో ప్రజలను చైతన్యం చేయడానికి సమావేశాలు పెట్టి చెప్పడం జరుగుతుంది కాని దానిని ఎవ్వరూ అమలుచేయడం లేదు. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే కలెక్టర్ గారు చొరవ తీసుకొన్నందువల్ల అక్కడ కొంత అమలు జరిగింది. అయితే, జిల్లా కలెక్టర్లు ఏమంటున్నారంటే ప్రభుత్వం నుండి డైరక్షన్ కనుక వస్తే మేము దీనిని అమలు చేయడానికి సాధ్యమవుతుందని చెప్పుతున్నారు. అదే కాకుండా డెక్కన్ కాలర్ ఆఫ్ ఇండియా వారిని అప్రోచ్ అయినప్పుడు వారు ప్రతి రాష్ట్రానికి సమాచారం పంపించినప్పుడు ఫార్మసీలందరిని గ్రీన్ క్రాస్ చిహ్నం కిందకు ఆంధ్రప్రదేశ్‌తో సహా మొత్తం భారతదేశంలో మార్చడం జరిగింది. అంటే ఒక్క ఉత్తరం డైరక్టర్ జనరల్ నుండి వచ్చినప్పుడు ఇది చేయడం జరిగింది. ఇప్పుడు భారతదేశ ప్రభుత్వం దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నందువల్ల జమ్ము కాశ్మీర్ లోను, త్రిపురలోను ఇది అమలు జరుగుతుంది. అక్షర క్రమంలో ముందున్న ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో కూడా ముందుకు రావాలని ఆశిస్తూ ప్రభుత్వం ద్వారా ప్రతి జిల్లాకు ఆదేశాలు పంపించినట్లయితే ఇది అమలులోకి వస్తుందని నేను భావిస్తున్నాను. అదే కాకుండా, అంబులెన్స్‌లు, డాక్టర్లు , ఆసుపత్రుల వాళ్లు వారికి వేరే చిహ్నాలున్నా వాటిని వారు వాడడం లేదు. ఆ చిహ్నాల గురించి వారికి అవగాహన కలుగచేసి దీనిని అమలుకు కృషి చేయాలని కోరుతున్నాను.

ఉ. 11.10

అదీ కాకుండా 108లో రెడ్‌క్రాస్ సొసైటీ ఏమీ లేదు. అది ఇల్లీగల్ కాబట్టి అందులో పెట్టడం జరుగలేదు. అదే మిగతా ఆంబులెన్సులలో అన్నింటిలో అమలు జరుపేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని నేను ఆశిస్తున్నాను.

శ్రీ డి. నాగేందర్:- అధ్యక్షా, రాజ్యలక్ష్మి గారు రెడ్‌క్రాస్ సొసైటీలో కూడా పని చేయడం జరిగింది. She is aware of this. మీరు రెడ్‌క్రాస్ సొసైటీలో వున్నారు కాబట్టి దీని గురించి నేను బాగా ప్రిపేర్ అయి వచ్చాను. తేది.11.08.2009 న దీనికి సంబంధించిన మీటింగు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది. వారు ఒక వ్యాల్యూయబుల్ సజెషన్ కూడా ఇవ్వడం జరిగింది. దీని గురించి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు యిచ్చి ఎక్కడైతే మిస్‌యూజ్ జరుగుతుందో వాటిని గురించి సీరియస్‌గా పరిగణించడం జరుగుతుంది. ఎందుకంటే రెడ్‌క్రాస్ సొసైటీ అనేది రెండవ ప్రపంచ యుద్ధంలో గాని ఇంకొక యుద్ధంలో గాని ఎక్కడ కూడా ఇరు వర్గాల మధ్య ఎవరైనా injure అయిన వారికి సేవ చేసేందుకోసం humanitarian grounds లో ఏర్పాటు చేసిన సంస్థ. అయితే దీనికి సంబంధించిన విషయాలలో మనం ఒకసారి ఆలోచించినట్లైతే ఎవరికైనా ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు వీరిని ఎవరూ పట్టించుకోని సందర్భంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేయడం జరిగింది. అందువల్ల దీన్ని సీరియస్‌గా పరిగణించి రెడ్‌క్రాస్ సొసైటీ అంబులెన్సును ఎవరైనా మిస్‌యూజ్ చేసినట్లైతే ఇప్పటికే వారికి రూ.500/- ఫైన్ విధించడం గాని లేదంటే వారికి సంబంధించిన వాహనాన్ని సీజ్ చేయడం కాని జరుగుతోంది. ప్రతి జిల్లా కలెక్టర్‌కు కూడా దీనికి సంబంధించి ఆదేశాలు యిచ్చి ఎక్కడైతే ఇది మిస్‌యూజ్ అవుతుందో అది మిస్‌యూజ్ కాకుండా చూసి, ఏ ఉద్దేశ్యంతో అయితే ఈ సంస్థను ఏర్పాటు చేశారో అది పూర్తిగా సరైన దిశలో నడపడానికి మేం ప్రయత్నం చేస్తామని, అందులో ఎలాంటి లోపం లేదని నేను తెలియజేస్తున్నాను.

## మానసిక వికలాంగుల సంరక్షణాలయాలు

ప్రశ్న నెం. 28 (2875)

సర్వశ్రీ అరికెల నర్సారెడ్డి, చుక్కా రామయ్య;

గౌరవనీయులైన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) తగురీతిగా వైద్య సౌకర్యాలను సమకూరుస్తూ మానసిక వికలాంగుల కోసం సంరక్షణ హోంలను ప్రారంభించే ప్రతిపాదన ఏదైనా ఉందా;
ఆ) అయితే, వాటిని ఎప్పటిలోగా ప్రారంభించడం జరుగుతుంది;
ఇ) నిజామాబాదు పట్టణంలోను, దాని చుట్టుపక్కల ప్రాంతాలలోను మానసిక వికలాంగులైన పిల్లల కోసం ఏదైనా సర్వేను నిర్వహించడం జరిగిందా;
ఈ) అయితే, ఆ వివరాలేమిటి;

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి (శ్రీమతి కొండా సురేఖ)

అ) మానసిక వికలాంగుల కోసం సంరక్షణ హోంలను ఆరంభించే ప్రతిపాదన ఏదీ లేదు.
ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు
ఇ) లేదండీ
ఈ) ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ అరికెల నర్సారెడ్డి (నిజమాబా ద్) : అధ్యక్షా, మానసిక వికలాంగుల గురించి చెప్పాలంటే ఈ రోజులలో ఒక మనిషిని గురించి పట్టించుకోనటువంటి పరిస్థితులలో లేము అని వాస్తవిక పరిస్థితులు చెబుతున్నాయి. ఈ మధ్యన నేను మరియు చుక్కా రామయ్య గారు నిజామాబాద్ జిల్లాలో ఒక మానసిక వికలాంగుల హాస్టల్‌ను ఒక స్వచ్ఛంద సంస్థ నడిపిస్తోందని తెలిసి అక్కడికి వెళ్లడం జరిగింది. నిజామాబాద్ జిల్లాలో సుమారు 3,000 మంది మానసిక వికలాంగులు వున్నారు. దాంట్లో 2,400 మంది గ్రామీణ ప్రాంతాలలో వున్నారు. 600 మంది పట్టణ ప్రాంతాలలో వున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఏం చర్యలు తీసుకోవడం లేదు కాబట్టి మేము ప్రభుత్వాన్ని మీ ద్వారా కోరేది ఏమిటంటే మానసిక వికలాంగులు పిచ్చివారిలాగ బస్ స్టాండులలోను ఎక్కడ పడితే అక్కడ తిరుగుతుంటారు. వికలాంగులకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి వుంది కాబట్టి వాళ్లను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వం మీద వున్నది.

ఎందుకంటే మానసిక వికలాంగులు ఎక్కువ శాతం ఆర్థికంగా వెనుకబడిన తగరగతులకు, ఆర్థికంగా స్తోమత లేనటువంటి వ్యక్తుల దగ్గరనే వుంటారు. దీనికి కారణం వారికి సరైన పోషకాహారం, సరైన వైద్యం లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి వస్తుందని మీకు తెలియజేస్తున్నాను. కాబట్టి దీని మీద ఒక రీసెర్చ్ సెంటర్ వేస్తే మానసిక వికలాంగులైన పిల్లలందరిని కాపాడే పరిస్థితి ప్రభుత్వానికి కల్గుతుందనే ఉద్దేశ్యంతోనే నేను ఈ విషయాన్ని

మీ దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాను. నిజామాబాద్ జిల్లాలో దీనికి సంబంధించి మేం కొంత సమాచారం కూడా తీసుకోవడం జరిగింది. ఈ జిల్లాలో మానసిక వికలాంగులుగా అయిదు సంవత్సరాలలోపు వున్న పిల్లలు 250 మంది, పది సంవత్సరాలలోపు పిల్లలు 600 మంది, పద్నాలుగు సంవత్సరాలలోపు పిల్లలు 349 మంది, పద్దెనిమిది సంవత్సరాలలోపు వ్యక్తులు 679, పద్దెనిమిది సంవత్సరాలు పైబడిన వ్యక్తులు 3,400 మంది వున్నారు.

ఇదంతా నేను ఎందుకు చెబుతున్నానంటే దీనికి సంబంధించి వాస్తవ పరిస్థితులు ప్రభుత్వం దగ్గర లేవు కాబట్టి చాలా సులువుగా ప్రభుత్వం తరఫున మేం ఏం చేయడం లేదని చెబుతోంది కాబట్టి చెప్పాల్సి వస్తున్నది. అంతే కాకుండా ఇందిరా క్రాంతి పథకం క్రింద 64 మంది విద్యార్థులను అయిదు మండలాలకు నిజామాబాదులో పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవడం జరిగింది. అందులో 64 మందికి ప్రభుత్వం ఎడ్యుకేషన్‌ను ఇస్తున్నది. అదే విధంగా రాజీవ్ విద్యా మిషన్ క్రింద 64 మందికి నిజామాబాదు జిల్లాలో ఎడ్యుకేషన్‌ను ఇస్తున్నది. దీనికి సంబంధించి స్నేహ సొసైటీ అనే ప్రైవేట్ సంస్థ ఆర్గనైజ్ చేస్తున్నది. వారికి జిల్లా స్థాయిలో ఒక రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే దాని వల్ల కొన్ని లాభాలు వున్నాయి. కాబట్టి ప్రైవేట్ సంస్థలు ఏవైతే ఆర్గనైజ్ చేస్తున్నాయో దానికి స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే ప్రత్యేక పాఠశాలలను రాజీవ్ విద్యా మిషన్ క్రింద గ్రాంటు అందించి వారికి సహకరిస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని నేను భావిస్తున్నాను.

శ్రీ చుక్కా రామయ్య (నల్గొండ, వరంగల్, ఖమ్మం) : అధ్యక్షా, కేవలం నిజామాబాద్ జిల్లా ఒక్కటే కాదు, వరంగల్ జిల్లాలో ఒక ఆడ మనిషి స్వతహాగా తన ఇద్దరు పిల్లలతో మానసిక బాధ పడుతున్నారు కాబట్టి వీరికి సంబంధించి ఒక స్కూల్‌ను స్వతహాగా నిర్వహిస్తున్నది. ఇప్పుడు సర్వే చేస్తే ఒక్క వరంగల్ పట్టణంలోనే 3,500 మంది మానసిక వికలాంగులైన పిల్లలు వున్నారు. ఇదే విధంగా నల్గొండ జిల్లాలో కూడా వున్నారు. ఈ రకంగా ఇంత మంది మానసిక వికలాంగులు వుండగా, పిల్లల తల్లి దండ్రులు దానిని యాచన చేసి సంస్థను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ పది సంవత్సరాల నుండి నిర్వహించబడుతోంది. అంతేకాకుండా శ్రీ ప్రభాకర్ రెడ్డి, కలెక్టర్‌గా వున్నప్పుడు స్వతహాగా అతను ఎంతో సహాయం చేశాడు. ఇప్పుడు శ్రీ సజ్జనార్,సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వారికి నెలకు ఒక బస్తా బియ్యం ఇప్పిస్తున్నారు. ప్రజలు ఇంత స్వతహాగా సహాయం చేస్తున్నప్పుడు ప్రభుత్వం దీని గురించి పట్టించుకోకపోతే ప్రజలలో ఏ విధమైన భావన వస్తుందనే ఉద్దేశ్యంతోనే కనీసం ప్రభుత్వం ఇప్పటికైనా దానిని నిర్వహించడానికి ఏమైనా చర్యలు తీసుకుంటుందా అని నేను అడుగదలచాను.

శ్రీ విటపు బాలసుబ్రమణ్యం (ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) : అధ్యక్షా, ఆంధ్ర ప్రదేశ్‌లో మానసిక వికలాంగుల సంఖ్య ఇతర రాష్ట్రాలతో పోలిస్తే చాలా ఎక్కువగా వున్నదని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కూడా దీని గురించి ఒక కామెంట్ చేయడం, యూనిసెఫ్ వారు కూడా ఒక సర్వే చేయడమనేది జరిగింది. ఎందుకని ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ పరిస్థితి వుందనే దాని మీద మన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగారి దగ్గర ఏమైనా వివరాలు వున్నాయా? మేనరికపు వివాహాలు ఆంధ్ర ప్రదేశ్‌లో ఎక్కువగా వున్నందువల్ల ఈ పరిస్థితి ఉత్పన్నం అవుతుందనేటటువంటిది వాళ్ల రీడింగ్. దీనిని తగ్గించే దాని కోసం మనం ప్రయత్నిస్తే తప్ప ఇంత పెద్ద యెత్తున మానసిక వికలాంగుల సంఖ్య తగ్గడమనేది సాధ్యమయ్యే పని కాదు. ఈ చర్య కూడా తీసుకునే ప్రయత్నం ఏమైనా వున్నదా అని మంత్రిగారిని మీ ద్వారా అడుగుతున్నాను.

శ్రీ పోచింరెడ్డి సుబ్బారెడ్డి:- అధ్యక్షా, మీ ద్వారా మంత్రిగారిని ఒకటి కోరుతున్నాను. ఇప్పటికే రాజీవ్ విద్యా మిషన్ ద్వారా IED ఇన్‌స్ట్రక్టర్లను పెట్టి గ్రామాలకు వెళ్లి చదువు చెబుతున్నారు. దానికి ప్రభుత్వమే ఖర్చు

పెడుతోంది. ఎలాగూ ఎడ్యుకేషన్‌కు ఖర్చు పెడుతున్నారు కాబట్టి వారి ఆరోగ్య విషయాలను కూడా ప్రత్యేకంగా పట్టించుకోవడానికి ప్రభుత్వం తరఫుననే ప్రత్యేకమైన రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసే అవకాశం ఏమైనా ఆలోచన చేస్తున్నారా?

శ్రీ బి. రాధా క్రిష్ణయ్య:- అధ్యక్షా, గవర్నమెంట్ ఆఫ్ ఇండియాలో సోషియల్ జస్టిస్ డిపార్టుమెంటు ద్వారా ఈ మానసిక వికలాంగుల సంరక్షణ కొరకు గ్రాంట్లు విడుదల చేయడానికి కూడా ప్రొసీజర్ వున్నది. రాష్ట్రంలో అనేక స్వచ్ఛంద సంస్థలు గ్రాంట్లు తెచ్చుకుని నడుపుతున్నాయి. అవి ఎన్ని వున్నాయి, ఎక్కడెక్కడ గ్రాంట్లు వచ్చే సంస్థలు నడుస్తున్నాయనేది మంత్రిగారు ఏమైనా వివరించగలరా?

శ్రీమతి కొండా సురేఖ:- అధ్యక్షా, వాస్తవంగా మానసిక వికలాంగులకు సంబంధించి మన ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు ఏమీ లేవు. ఇవన్నీ కూడా ఎన్జీవోలు నడుపుతున్నారు. ఎన్జీవోలు కూడా సెంట్రల్ గవర్నమెంటు నుంచి Grant in Aid ద్వారా శాంక్షన్‌లు తీసుకుని ట్రైనింగ్ సెంటర్లు, స్కూల్స్ నడుపుతున్నారు. ఆ ప్రతిపాదనలో మాత్రం స్థానికంగా సంబంధించిన కలెక్టర్ల నుండి లేకపోతే సెక్రటరీ గారి నుండి కోరడం జరుగుతుంది. అక్కడి నుండి వచ్చిన ఫండ్స్ వివరాలు కూడా మన ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే పరిస్థితులు గతంలో లేవు. ఈ మధ్య కాలంలో మన సెక్రటరీ గారు ఈ విషయాన్ని ఒకటికి రెండు సార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మరి మాకు వచ్చే ఫండ్స్ ఎవరెవరికి ఎంత పంపిస్తున్నారనే విషయాలు మాకు తెలియడం లేదని చెప్పడం వలన ఈ మధ్య కాలంలోనే వారికి సంబంధించిన వివరాలు మన దృష్టికి వస్తున్నాయి. మన రాష్ట్రంలో కనుక హోమ్స్ రన్ చేసి వుంటే దానికి సంబంధించిన పూర్తి వివరాలను మేం యిచ్చే అవకాశం వుంటుందని ఈ సందర్భంగా నేను గుర్తు చేస్తున్నాను. నిజంగానే మానసిక వికలాంగుల గురించి మనందరం ఆలోచించాల్సిన అవసరం వున్నది. గత ప్రభుత్వంలో వీరిని చాలా నిర్లక్షం చేయడం జరిగింది. గత ప్రభుత్వం వీరికి కనీసం పెన్షన్లు కూడా ఇవ్వలేదు. వీరికి కేవలం రూ.75/- పెన్షన్‌ను అది కూడా పద్దెనిమిది సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వయసు వున్న వారికి మాత్రమే యిచ్చి మిగతా వారిని నిర్లక్ష్యం చేయడం జరిగింది.

ఉ.11.20

అధ్యక్షా, గతంలో ఉన్న ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.75లు చొప్పున సంవత్సరానికి కేవలం నాలుగుకోట్ల యాభై లక్షలు ఇచ్చేవాళ్లు. కానీ మా ప్రభుత్వం వయస్సుతో నిమిత్తం లేకుండా ఒక్కొక్కరికి రూ.500లు చొప్పున సంవత్సరానికి దాదాపు నాలుగువందల డెబ్బైనాలుగు కోట్ల రూపాయలను మానసిక వికలాంగులకు ఇవ్వడం జరుగుతోంది. స్నేహ స్వచ్ఛంద సంస్థవారు స్కూల్ నిర్వహించుటకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుండి మాత్రం ఇందుకు సంబంధించి గ్రాంటు శాంక్షన్ చేసే పరిస్థితి లేదు, కేంద్రప్రభుత్వం నుండి నిధులు మంజూరు అవుతున్నాయి. సదరు ప్రతిపాదనలు వారు ఇచ్చినట్లైతే మేము తప్పకుండా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వారి ద్వారా గ్రాంట్ ఇన్ ఎయిడ్ మంజూరు చేయించడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తమ ద్వారా గౌరవసభ్యులకు మనవి చేస్తున్నాను. అదే విధంగా 'మనో వికాస మానసిక వికలాంగుల కేంద్రం' గురించి పెద్దలు శ్రీ చుక్కా రామయ్య గారు చెప్పారు. నేను కూడా గతంలో ఆ సంస్థకు వెళ్లాను. మా కుటుంబ సభ్యులము కూడా ఆ సంస్థకు కొంత సొమ్మును డొనేట్ చెయ్యడం జరిగింది. అటువంటి వారికి ప్రోత్సహించే బాధ్యత మనందరిపైన ఉన్నది. నేను వారి ద్వారా ఒక రిప్రెజెంటేషన్‌ను తీసుకొని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రావడానికి కృషిచేస్తాను. ఆంధ్రప్రదేశ్‌లో మానసిక వికలాంగులు ఎక్కువ మంది ఉన్నారని గౌరవ సభ్యులు ప్రస్తావించారు. ఎందుకు ఈ ప్రాంతంలోనే ఎక్కువమంది ఉన్నారని పరిశీలించి ఇకముందు రిపీట్

కాకుండా మా శాఖ తగు జాగ్రత్తలు తీసుకుంటుందని మనవి చేస్తున్నాను. పేద కుటుంబాలలోనే మానసిక వైకల్యం గల పిల్లలు ఉంటున్నారని సభ్యులు శ్రీ నర్సారెడ్డిగారు చెప్పారు, అది సరికాదండీ, ఉన్నత కుటుంబాలలోని పిల్లలు కూడా మానసిక వైకల్యం గలవారున్నారు. పౌష్టికాహార లోపం వల్ల మానసిక వైకల్యం వస్తుందనడం సరైనది కాదు. కాబట్టి ఎవరైనా అందరినీ ఒకే క్రమంలో చూడవలసిన అవసరం ఉంది కాబట్టి అట్టివారిపై శ్రద్ధ వహించి, మానసిక వికలాంగుల బాగోగుల గురించి తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి (అసెంబ్లి) : అధ్యక్షా, మానసిక వైకల్యం అనేది ఆహార లోపం కాదు, మామూలుగా గొప్పవాళ్ల ఇళ్లల్లో కూడా ఉంటున్నారని మంత్రిగారు ఇంతకు ముందు అన్నారు. గొప్పవాళ్లు అటువంటి పిల్లలు ఉన్నప్పుడు ఎక్కువ ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోవడమో లేకపోతే వారికి ఏదోవిధంగా శిక్షణనిచ్చి బాగుచేయించుకోవటమో చేయగలరు. పేదవాళ్లు పల్లెటూర్లనుండి సామాన్యంగా బయటకు రారు. నేనదేమంటే గత ప్రభుత్వంలో పట్టించుకోలేదన్నారు. మరి ప్రస్తుత ప్రభుత్వం ఏవిధమైన చర్యలు చేపట్టడం లేదు అన్నీ స్వచ్ఛంద సంస్థలకు అప్పజెపుతున్నామని వారు సమాధానం చెప్పారు. గత ప్రభుత్వం మాట ఎందుకు వచ్చిందసలు? మరి ఈ రోజు నిత్యావసర వస్తువుల ధరల విషయంలో.....

(అంతరాయం)

శ్రీమతి కొండా సురేఖ : నేనన్నదేమంటే గత ప్రభుత్వం వారు అందరికీ పెన్షన్లు ఇవ్వలేదు, రు. 75/- ఏజ్ లిమిట్‌తోటి ఇచ్చారు. మా ప్రభుత్వం వయసుతో నిమిత్తం లేకుండా పెన్షన్ రు. 500/- అర్హులైన వాళ్లందరికీ శాట్యురేషన్ పద్ధతిలో ఇస్తున్నామని అన్నాను. భుజాలెందుకు తడుముకుంటారు మీరు?

(అంతరాయం)

శ్రీ చుక్కా రామయ్య : ఈ ప్రభుత్వం పేదప్రజల దారిద్ర్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తోంది. మానసిక వికలాంగుల విషయంలో ప్రభుత్వంది కేవలం ప్రేక్షక పాత్ర మాత్రమేనా? స్వచ్ఛంద సంస్థలు చేస్తుంటే చూస్తూ ఉంటారా? వాటిని టేకోవర్ చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకరరెడ్డి (అసెంబ్లి) : అధ్యక్షా, నేను గౌరవ మంత్రివర్యులు సూచించిన సంస్థకు మానసిక వికలాంగుల సంక్షేమానికై నా ఒక నెల జీతాన్ని ఇవ్వడానికి ఈ సభలో అనౌన్స్ చేస్తున్నాను. అలాగే ఈ ఆర్థిక మాంద్య పరిస్థితులలో గౌరవ సభ్యులు కూడా అనౌన్స్ చేస్తే బాగుంటుంది.

## బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్

ప్రశ్న నెం. 29 (2538)

సర్వశ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్,గిడుగు రుద్రరాజు;

గౌరవనీయులైన మునిసిపలు పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా;

అ) రాష్ట్రంలో భవన జరిమానా విధింపు పథకం క్రింద జిల్లావారీగా వసూలు చేసిన మొత్తం వివరాలు ఏమిటి;

ఆ) సదరు మొత్తాలను స్థానిక సంస్థల సాధారణ నిధుల కోసం కేటాయించడం జరుగుతున్నదా;

ఇ) సదరు నిధులను వినియోగించాలని ప్రతిపాదించిన కార్యక్రమాల వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన మునిసిపలు పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖామంత్రి (శ్రీ ఆనం రామనారాయణరెడ్డి) ః

అ) బిపిఎస్ పథకం క్రింద జిల్లావారీగా ఆరంభంలో వసూలు చేసిన మొత్తాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి ః (రూ. లక్షలలో)

| | |
|---|---|
| 1) శ్రీకాకుళం | 52.65 |
| 2) విజయనగరం | 260.32 |
| 3) విశాఖపట్నం | 3808.97 |
| 4) తూర్పుగోదావరి | 1163.94 |
| 5) పశ్చిమ గోదావరి | 592.94 |
| 6) కృష్ణా | 1895.92 |
| 7) గుంటూరు | 1446.07 |
| 8)ఒంగోలు | 371.18 |
| 9) ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు | 299.14 |
| 10) అనంతపురం | 250.00 |
| 11) కర్నూలు | 402.00 |
| 12)కడప | 379.59 |
| 13)చిత్తూరు | 425.53 |
| 14)వరంగల్ | 480.07 |
| 15)కరీంనగర్ | 332.61 |
| 16)ఖమ్మం | 104.29 |
| 17)ఆదిలాబాదు | 51.14 |
| 18)హైదరాబాదు | 33231 (జిహెచ్ఎంసి ప్రాంతం) |
| 19)రంగారెడ్డి జిల్లా | 35.61(జిహెచ్ ఎంసి ప్రాంతం మినహా) |
| 20) నల్గొండ | 103.03 |
| 21) మెదక్ | 223.32 |
| 22) మహబూబ్‌నగర్ | 103.08 |
| 23)నిజామాబాద్ | 280.35 |

ఆ) లేదండీ.

ఇ) ఆ నిధులను ఆయా ప్రాంతాలలో సదుపాయాలను మెరుగు పరచడానికి అభివృద్ధి పనులకోసం వినియోగించాలని ప్రతిపాదించడమయింది.

శ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్ (అసెంబ్లి) : అధ్యక్షా, మంత్రిగారు చాలా స్పష్టమైన సమాధానమిచ్చారు. పురపాలక సంఘాలను ఆర్థికంగా పరిపుష్టం చేయాలనేటువంటి ఆలోచన చాలా కాలంగా నినాదంగానే మిగిలిపోయింది. ఈ మధ్యకాలంలో ముఖ్యమంత్రిగారు మునిసిపల్ ఉద్యోగుల కోరిక మేరకు వారి జీతాలను ట్రెజరీ ద్వారా చెల్లించాలనే సముచితమైన నిర్ణయం చేయడం ద్వారా ఈనాడు పురపాలకు సంఘాలకు ఆర్థికపరమైన వెసులుబాటు కలిగింది. అందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. అయితే ఈ స్కీముకింద వసూలు కాబడిన సొమ్మును ఏ విధమైన ఇతర అవసరాలకు ఉపయోగించకుండా ఉంచినట్లు తెలిసింది. ఒక్క రాజమండ్రి మునిసిపలు కార్పొరేషన్‌లోనే చూసినట్లైతే సుమారు ఐదుకోట్లకు పైబడి సొమ్ము వచ్చింది. మునిసిపాలిటీ పరిధిలోని రోడ్లు సరైన దశలో లేదు. వాటి నిర్మాణానికి ఎమినిటీస్‌కు సంబంధించి ఈ సొమ్మును ఖర్చు పెట్టడానికి మునిసిపాలిటీలకు అధికారం ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

ఉ. 11.30

శ్రీ గిడుగు రుద్రరాజు : అధ్యక్షా, తమద్వారా మంత్రిగారిని ఈ స్కీముయొక్క విధివిధానాలను గురించి అంటే ఎస్ఎఫ్‌టికి ఇంత అని వసూలు చేస్తున్నారా, లేక ఫ్లాట్‌కి ఇంత అని వసూలు చేస్తున్నారా అని ప్రశ్నిస్తున్నాను. వచ్చిన సొమ్ములో యాభై శాతమైనా సంబంధిత మునిసిపాలిటీను అభివృద్ధి పరచడానికి ఇస్తే బాగుంటుందని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

డా. రాయపాటి శ్రీనివాస్ (గుంటూరు) : బిపిఎస్ స్కీముకు సంబంధించి జులై 15, 2008 వరకు అప్లికేషన్లు తీసుకోడానికి గడువిచ్చారు. 3,4, సార్లు ఎక్స్టెంషన్లు ఇచ్చారు. కొంతమంది దీని గురించి కోర్టులో పిటీషను వేశారు. అప్లికేషన్లు పెట్టుకోవడానికి మరికొంత గడువు ఇస్తే బాగుంటుందని కోరుతున్నాను. ఢిల్లీలో 5,6 సంవత్సరముల క్రితం ఢిల్లీ హైకోర్టు ఎలాబరేట్ కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి విరుద్ధంగా తీర్పునివ్వడం జరిగింది. అందువల్ల ఆ విషయం కోర్టులో ఉన్నందువల్ల చాలామంది దరఖాస్తు చేసుకునేందుకు హెజిటేట్ చేశారు. అందువల్ల time extention చేయవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ టి. భానుప్రసాదరావు (కరీంనగర్) : అధ్యక్షా, సంబంధిత విషయమై కోర్టులో స్టే ఉన్నది. దరఖాస్తుదారులకు కట్టిన సొమ్ము అలాగే ఉంటుందేమో, సొమ్ము తిరిగి వస్తుందా, రాదా అనే అనుమానం ఉంది. అందుకని చాలామంది అప్లయ్ చేసుకోలేదు. ఒక వారం పదిరోజులకైనా గడువు ఇవ్వవలసిందిగా మంత్రిగారిని తమద్వారా కోరుతున్నాను.

శ్రీ కపిలవాయి దిలీప్ కుమార్ (వరంగల్, ఖమ్మం, నల్గొండ) : అధ్యక్షా, మునిసిపల్ ఏరియాలలో ముందు లే అవుట్ ప్లాన్ ఇవ్వడం జరుగుతుంది. తరువాత నంబరు అలాట్ చేస్తారు. దానివల్ల లే అవుట్ చేసేవాళ్లు అమ్మడం, బిల్డింగ్ ప్లాన్ చేసుకోవడం జరుగుతుంది. లే అవుట్ అప్రూవ్ అయిన తరువాత, ఫీజు కట్టిన తరువాత పర్మిషన్ ఇస్తే ఇల్లీగల్ కన్‌స్ట్రక్షన్ కాదు. లే అవుట్ రిలీజ్ అయిన తరువాత నంబరు ఇస్తే బాగుంటుందని మంత్రిగారిని తమ ద్వారా కోరుతున్నాను.

శ్రీ బి. మోహన్ రెడ్డి :- అధ్యక్షా,ఒక వారం, పది రోజులు తేదీని ఎక్స్‌టెన్షన్ చేస్తే చాలామంది దరఖాస్తు చేసుకోడానికి అవకాశముంటుందని తమ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఆనం రామనారాయణరెడ్డి :- బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమును మొదలు పెట్టే ప్రయత్నం చేయడం జరిగింది. చాలా కాలంగా మునిసిపల్ శాఖల్లో కొన్ని లోపాల వల్ల అన్ ఆథరైజ్డ్ నిర్మాణాలు జరగడం, తరువాత రిజిస్ట్రేషన్ల కోసం, బ్యాంకు లోన్ల కోసం వెళ్లినప్పుడు వాటికి సర్టిఫికేట్లు రాక చాలా ఇబ్బంది పడుతున్నట్లు బిల్డర్స్, బిల్డింగ్ వెల్ఫేర్ అసోసియేషన్లు ముఖ్యమంత్రిగారి వద్దకు వచ్చికి రిప్రజెంటేషన్ చేసుకున్న తరువాత ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ఎన్నో సంవత్సరాలనుండి జరుగుతున్న లోపాలను సరి చేయకుండా మనం ఎప్పటికప్పుడు దాటవేసుకుంటూ పోతే సొల్యూషన్ అనేది ఉండదు, దీనికి పరిష్కారం చూపించాలని భవనాలు, అపార్టుమెంటు కొన్నవారికి హక్కును, భద్రతను కల్పించే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేసింది. బిపిఎస్ స్కీమును పెట్టినతరువాత చట్టంలో కొన్ని మార్పులు తీసుకురావడం జరిగింది. ఇప్పటికి దాదాపు 3,60,049 అప్లికేషన్లు రావడం జరిగింది. మధ్యలో కొంతమంది కోర్టుకు వెళ్లారు. తరువాత ఈ స్కీమును కంటిన్యూ చేయమని, ఆపవద్దని హైకోర్టునుండి ఆదేశాలు వచ్చిన తరువాత రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ ప్రారంభించాము. అన్ని మునిసిపాలిటీలలోనూ, హైదరాబాదులాంటి నగరాలలోనూ కూడా ఈ ప్రక్రియను అమలు చేస్తున్నాము. కొంత సమయం కోర్టులో ఉండడం, లిటిగేషన్ల వల్ల చాలామంది దరఖాస్తు చేసుకోలేదు. వాళ్లకు కూడా అవకాశమివ్వమని ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ, కటాఫ్ డేట్‌ను గత శాసనసభ సమావేశాలలో చెప్పడం జరిగింది. కటాఫ్ డేట్ విషయంలో ప్రభుత్వం చేసింది సమంజసమేనని హైకోర్టు తీర్పునివ్వడం జరిగింది. అందుకని వెంటనే గడువు ఇవ్వడమనేది ప్రభుత్వ పరిశీలనలో లేదు. ఇప్పుడు వచ్చిన దరఖాస్తులను పరిష్కారం చేసుకుంటూ ఇంకా ఏదైనా అవకాశముంటే ఎక్స్‌టెన్షన్ గురించి ఆలోచించి ముఖ్యమంత్రిగారితో కలిసి నిర్ణయించి చెప్పడం జరుగుతుంది.

చట్టపరంగా కటాఫ్ డేట్ పెట్టాము. దాని ప్రకారమే వెళ్లవలసిన అవసరం ఉంది. లేకపోతే మళ్లీ కోర్టు, లిటిగేషన్లు వచ్చే అవకాశముంటుంది. ప్రస్తుతానికి గడువు పెంచే విషయమైతే ప్రభుత్వ పరిశీలనలో లేదని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

దీనిని ఎలా వసూలు చేస్తున్నారు, ధరల నిర్ణయం ఎలా చేస్తున్నారనే విషయమై సభ్యులు అడగడం జరిగింది. అపార్ట్‌మెంట్ పీనలైజేషన్‌కి దాదాపు రూ.3,000 నుండి 2,000 వరకు, ఇండిపెండెంట్ ఇళ్లకు, కమర్షియల్ కాంప్లెక్సులకు అయితే ఎస్ఎఫ్‌టి రూ. 10 నుండి 150 వరకు పెనాల్టీగా తీసుకోవడం జరుగుతుంది. నిధుల ఖర్చు విషయమై ఒక రూపాయి కూడా ప్రభుత్వ ఖజానాలోకి తీసుకోలేదు. ఆదాయాన్ని ఆయా మునిసిపాలిటీల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టే విధంగా ప్రత్యేకమైన అకౌంటును ఓపెన్ చేయడం జరిగింది. ఇప్పటికీ ఆ నిధులన్నీ మునిసిపాలిటీల పరిధిలోనే ఉన్నాయి. కోర్టు ఆదేశాలు వచ్చాయి కాబట్టి ప్రభుత్వం కొన్ని గైడ్‌లైన్స్ తయారు చేసి ఇవ్వడం జరుగుతుంది. కొద్ది రోజులలోనే వచ్చినటువంటి డబ్బును ఏఏ పనులకు వాడాలి అనేదానిమీద గైడ్‌లైన్స్ తయారు చేసి అన్ని పురపాలక శాఖలకు విడుదల చేస్తాం. అక్కడ ఉన్న వాళ్లే ఏం చేయాలో ఆలోచిస్తారు. ఈ అవకాశం వాళ్లకే ఇస్తామని గౌరవసభ్యులకు మనవిచేస్తున్నాను.

ఉ. 11.40

## పశువైద్యశాలలు

ప్రశ్న నంబరు 30 (2761)

శ్రీ యలమంచిలి వెంకటబాబు రాజేంద్రప్రసాద్, డా. మసాల పద్మజ, శ్రీ మల్లుల లక్ష్మీ నారాయణ:

గౌ. పశు సంవర్థన, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా;

(అ) రాష్ట్రంలో ఎన్ని పశు వైద్య ఆసుపత్రులున్నాయి? వాటిలో ఎంత మంది వైద్యులు, కాంపౌండర్లు ఉన్నారు;
(ఆ) అనేక పశు వైద్య ఆసుపత్రులలో వైద్యులు, మందులు లేని విషయం కూడా వాస్తవమేనా;
(ఇ) అయితే ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి;

పశు సంవర్థన, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమ శాఖ మంత్రి (శ్రీ కె. పార్థ సారథి):

(అ) ఈ తేదీ నాటికి రాష్ట్రంలో 5281 పశు వైద్య ఆసుపత్రులున్నాయి. ఈ ఆసుపత్రులలో ప్రస్తుతం 1863 మంది వైద్యులు (డిడిలు, ఎడిలు, వివిఎస్‌లు), 3966 మంది పారా పశు వైద్య సిబ్బంది పని చేస్తున్నారు.
(ఆ) తగినంత మంది వైద్యులు లభ్యంగా లేరు. అయితే తగినన్ని మందులను సరఫరా చేయడం జరుగుతున్నది. ప్రస్తుతం 517 వెటర్నరీ అసిస్టెంటు సర్జన్లు, 1123 పారా వెటర్నరీ సిబ్బంది పదవులు ఖాళీగా ఉన్నాయి.
(ఇ) పశు వైద్య గ్రాడ్యుయేట్లు లభ్యమయినప్పుడు, కంట్రాక్టు పద్ధతిపై రిటైర్డు వెటర్నరీ గ్రాడ్యుయేట్లను తీసుకోవడం ద్వారా రాష్ట్రంలో వెటర్నరీ అసిస్టెంట్ పదవులను భర్తీ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

రాష్ట్రంలో పారా వెటర్నరీ సిబ్బంది ఖాళీలన్నింటిని భర్తీ చేసేందుకు అవసరమైన చర్యలను కూడా తీసుకోవడమవుతున్నది. 203 మంది ఇన్ సర్వీసు అభ్యర్థులు వెటర్నరీ అసిస్టెంట్ కోర్సులో శిక్షణ పొందుతున్నారు. ఈ కోర్సు పూర్తయిన తర్వాత, వారిని వెటర్నరీ అసిస్టెంట్లుగా నియమించడమవుతుంది.

ప్రస్తుతం కంట్రాక్టు పద్ధతిపై 30 మంది రిటైర్డు వెటర్నరీ వైద్యులు, 450 మంది రిటైర్డ్ పారా వెటర్నరీ సిబ్బంది పని చేస్తున్నారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల కొరతను తీర్చడానికి గాను, 2008-09 సంవత్సరంలో రాష్ట్రంలోని కడప జిల్లా ప్రొద్దుటూరు, కరీంనగర్ జిల్లా కోరట్లలలో రెండు వెటర్నరీ కళాశాలలను ఏర్పాటు చేయడమయింది.

శ్రీ మల్లుల లక్ష్మీ నారాయణ (పశ్చిమ గోదావరి): అధ్యక్షా, మన రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత ప్రధానమైనటువంటి జీవనోపాధి కల్గించేది పాడి పరిశ్రమ. ఇది అభివృద్ధి చెందాలంటే పటిష్టంగా పశు వైద్యశాలలు, పశు వైద్యులు ఉంటే, పాడిపరిశ్రమపై ఆధారపడిన వాళ్లకు ఎంతో మేలు చేసిన వాళ్లమవుతాము. అయితే ఈ రోజు పశువుల ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత కాని, పారా వెటర్నరీ సిబ్బంది కొరత కాని చాలా తీవ్రంగా ఉంది. ఈ

కొరతను తీర్చడానికి ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నది? వైద్యుల లభ్యత లేదని మంత్రిగారు సమాధానం చెప్పడం సరైంది కాదు. డాక్టర్ల లభ్యత కోసం డాక్టర్ల ఖాళీలను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ ఏమైనా తీసుకుటుందా? ఎంత సమయం లోపల ఆ ఖాళీలను భర్తీ చేస్తారు? అదే విధంగా ఈ రాష్ట్రంలో మరిన్ని సంచార వైద్య శాలలను ఏర్పాటు చేసే దానికి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉందా?

శ్రీ నారదాసు లక్ష్మణరావు (మెదక్, నిజమాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్) : అధ్యక్షా, మెదక్ జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలో వందలాది పశువులు పశుగ్రాసం లేక చనిపోతున్నాయి. అందుకని రైతులు తమ పశువుల్ని ఇతర ప్రాంతాలకు తోలుకొని పోవడం జరుగుతోంది. ఇప్పుడు ఏర్పడిన వర్షాభావం వల్ల పశుగ్రాసం లేకపోవడం వల్ల రైతులు చాలా దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నారు. కాబట్టి పశువుల్ని ఆదుకోవడానికి గాను పశుగ్రాసం ఏర్పాటు చేసేందుకు ఈ ప్రభుత్వం ఏమైనా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందా అని మీ ద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ పి. సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, రాష్ట్రంలో పశు వైద్యులు చాలా తక్కువగా ఉన్నారు. ప్రయివేట్ యాజమాన్యంలో పశు వైద్య కళాశాలలు ఏర్పాటు చేసే ఆలోచన ఏమైనా ఉందా?

శ్రీ తేలుకుట్ల గోపాల వెంకట కృష్ణా రెడ్డి (గుంటూరు) : అధ్యక్షా, మీ ద్వారా మంత్రిగారికి సవినయంగా తెలియచేస్తున్నాను. పశు వైద్య శాలల్లో డాక్టర్లు చాలా తక్కువగా ఉన్నారు. కాబట్టి రిటైరు అయిన వారిని కాని, ఇంకొకరిని కాని అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించే ప్రయత్నం ఏదైనా ఉందా? రెండవది, డాక్టర్లు చాలా తక్కువగా ఉన్నారు కాబట్టి, పశు వైద్య కళాశాలలను తక్షణమే ఏర్పాటు చేయడానికి యూనివర్సిటీలను స్థాపించడానికి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉందా?

శ్రీ కె. పార్థ సారథి : అధ్యక్షా, మా ప్రభుత్వం యొక్క ప్రాధాన్యత వ్యవసాయం అని అందరికీ తెలుసు. పాడి పరిశ్రమ కూడా వ్యవసాయంలో ఒక భాగమే. ఈ రాష్ట్రంలో వెటర్నరీ యూనివర్సిటీని స్థాపించింది మా ప్రభుత్వమే. అయితే డాక్టర్ల లభ్యత గురించి చెప్పవలసి వస్తే.......

మిస్టర్ ఛైర్మన్ : గౌ.సభ్యులు వెటర్నరీ యూనివర్సిటీ లేదని అన్నారు. కాని మంత్రిగారి సమాధానం ప్రకారం already Veterinary University is established.

శ్రీ పి. సుధాకర్ రెడ్డి : కళాశాలలు లేవు. కళాశాలలు లేకుండా యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఏం లాభం?

శ్రీ కె. పార్థ సారథి : కాలేజీలు కూడా పెట్టాం. యూనివర్సిటీని స్థాపించింది మా ప్రభుత్వమే.....

శ్రీ తేలుకుట్ల గోపాల వెంకట కృష్ణారెడ్డి : యూనివర్సిటీ ఉంది కాదనడం లేదు. కాని డాక్టర్లు లేరు. కళాశాలల నుండి అవుట్ టర్న్ ఉంది కాని, ఇన్ టర్న్ లేదు. కాబట్టి కొత్తగా వెటర్నరీ కాలేజీలు ఏవైనా పెడతారా?

శ్రీ కె. పార్థ సారథి : డాక్టర్లు లేని మాట వాస్తవం. మన రాష్ట్రంలో వెటర్నరీ సైన్స్ గ్రాడ్యుయేట్లు ఎంత మంది కావాలో అంత మంది పాస్ అవుట్ అయ్యే పరిస్థితి లేదు. గతంలో మూడు కళాశాలలు ఉంటే, మా

ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రొద్దుటూరు, కోరుట్ల లో మరో రెండు కొత్త కళాశాలలను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే కోర్సు అయిదు సంవత్సరాలు కాబట్టి, కాలేజీలు స్టార్ట్ చేయగానే గ్రాడ్యుయేట్ల లభ్యత ఉండదు. అందుకనే సెప్టెంబరుకు ఫస్ట్ బ్యాచ్ వచ్చిన తర్వాత కొంత మంది లభ్యమయ్యే అవకాశం ఉంది. కాబట్టి రిటైర్ అయిన వెటర్నరీ డాక్టర్లను కంట్రాక్టు పద్ధతిలో నియమించడం జరుగుతోంది. ఆ విధంగా తీసుకున్న వారికి గతంలో రూ.ఆరు వేలు ఇస్తే, ఈ ముఖ్యమంత్రిగారు దాన్ని పది వేల రూ.లకు పెంచారు. వారితోపాటు, 3660 మంది పారా వెటర్నరీ స్టాఫ్‌ను కూడా కంట్రాక్టు పద్ధతిలో తీసుకున్నాము. అదే విధంగా ఆల్‌రెడీ సర్వీసులో ఉన్న 200,300 మంది పారా వెటర్నరీ సిబ్బందికి ట్రైనింగు ఇచ్చి, వెటర్నరీ అసిస్టెంట్స్‌గా మేము తీసుకుంటున్నాము. సభ్యులు ఇంకొక విషయం కూడా చెప్పారు. సంచార వైద్య శాలలను మరిన్ని ఏర్పాటు చేయమన్నారు. ఇప్పటికే 42 సంచార వైద్య శాలలు మన రాష్ట్రంలో ఉన్నాయి. అయితే అవసరాన్ని బట్టి , అవకాశం ఉంటే, పరిశీలించి తప్పకుండా పెంచే దానికి ప్రయత్నం చేస్తాము.

## స్వల్ప వ్యవధి ప్రశ్నలు

## గుంటూరు జిల్లాలోని కళాశాలల్లో ఫీజు తిరిగి చెల్లించుటలో సమస్యలు

స్వల్ప వ్యవధి ప్రశ్న నం. 30 ఎ (21- వి)

డా. రాయపాటి శ్రీనివాస్, శ్రీ కె. ఎస్. లక్ష్మణరావు ;

గౌ.వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా;

(అ) గుంటూరు జిల్లాలోని కళాశాలల్లో ఫీజు తిరిగి ఇవ్వడానికి సంబంధించి అనేక సమస్యలు ఏర్పడుతున్న విషయం వాస్తవమేనా;

(ఆ) ఈ విషయంలో కళాశాల యాజామాన్యాల బాధ్యత లేని వైఖరి మూలంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం కూడా వాస్తవమేనా;

(ఇ) అయితే, సమస్యలను పరిష్కరించడానికి తీసుకోదలచిన చర్యలేమిటి?

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ ఎం. ముఖేష్ గౌడ్):

(అ) లేదండీ

(ఆ) కొన్ని కళాశాల యాజమాన్యాలు కొన్ని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల విషయంలో రూ. 20,000 వరకు మాత్రమే మంజూరు వున్నందున, బి.సి. విద్యార్థులను ట్యూషన్ ఫీజులు చెల్లించాలని పట్టుబడుతున్న విషయం దృష్టికి వచ్చింది. విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్ లైన్‌లో సమర్పిస్తున్న సందర్భంలో, తప్పుగా కోర్సును ఎంపిక చేసుకోవడం వల్ల ఈ విధంగా జరిగింది. విద్యార్థులకు ఆన్‌లైనులో దరఖాస్తు ఫారాలను పంపుకోవడంలో అలవాటు లేకపోవడం వల్ల ఇది సాంకేతిక తప్పుగా జరిగింది.

(ఇ) ట్యూషన్ ఫీజులను ప్రభుత్వం తిరిగి ఇస్తుంది. అందువల్ల అర్హత గల బి.సి. విద్యార్థుల నుండి ట్యూషన్ ఫీజులను వసూలు చేయరాదని కళాశాలలన్నిటికి ఇప్పటికే అవసరమైన ఆదేశాలను జారీ

చేయడమయింది. విద్యార్థులకు వారి ట్యూషన్ ఫీజులను తిరిగి ఇవ్వడానికి వీలుగా జాగ్రత్తగా దరఖాస్తు చేయవలసిందిగా కూడా వారికి సలహా ఇవ్వడమయింది.

డా. రాయపాటి శ్రీనివాస్ : అధ్యక్షా, కౌన్సిలింగు ద్వారా అలాట్ అయ్యే ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించిన విద్యార్థుల ఫీజు రీఇంబర్స్‌మెంట్‌లో సమస్య ఉండటం లేదు. అయితే మామూలు డిగ్రీలు చదివే విద్యార్థుల విషయంలో సమస్య తలెత్తుతున్నది. గవర్నమెంట్ నుండి జిల్లాకు అమౌంట్ వచ్చిన తర్వాత, జిల్లా నుండి కాలేజీలకు ఆ అమౌంట్ చేరడంలో ఆలస్యమవుతోంది. అదే విధంగా కాలేజీలకు వచ్చిన తర్వాత కూడా ఆ అమౌంట్‌ను విద్యార్థులకు చెల్లించడంలో చాలా జాప్యం జరుగుతోంది. కాలేజీ యాజమాన్యాలు తమకు వచ్చిన అమౌంట్‌ను బ్యాంకుల్లో డిపాజిట్ చేయడం, లేకపోతే విద్యార్థులకు చెల్లించకపోవడం జరుగుతోంది. గుంటూరు జిల్లాలోని అనేక కాలేజీల్లో ఈ విధమైన సంఘటనలు అనేకం ఉన్నాయి.

ఉ. 11.50

మీ ద్వారా మంత్రిగారిని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నాను. రీపేమెంట్ జరగకపోతే మధ్యలోనే చదువు మానివేసే పరిస్థితి తద్వారా డ్రాపవుట్స్ ఎక్కువ అయ్యే అవకాశం ఉంటుంది. దీనిని నివారించాలని కోరుతున్నాను.

శ్రీ కె. ఎస్. లక్ష్మణ రావు : అధ్యక్షా, ఫీజు రీ ఇంబర్స్‌మెంట్‌కు సంబంధించి గుంటూరు జిల్లాలో బిసి విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీ ఇబర్స్‌మెంట్ చేస్తుంది కానీ ఇంజనీరింగ్, బిఇడి కళాశాలల్లో బిల్డింగ్‌ఫండ్, లైబ్రరీ ఫండ్ పేరుతో అదనంగా విద్యార్థుల దగ్గర ఫీజు వసూలు చేస్తున్నారు. యంత్రాంగం దానిని నివారించలేకపోతున్నది. ఇంజనీరింగ్ కళాశాలల్లో కౌన్సిలింగ్ ద్వారా జరిగితే, డిగ్రీ కళాశాలల్లో గత సంవత్సరం ఫీజు రాలేదు కాబట్టి మిమ్ములను చేర్చుకోము అంటున్నారు. కావాలంటే అలాంటి చాలా సంఘటనలు మీ దృష్టికి తెస్తాను. అందువలన జిల్లా కలక్టరుగారి నాయకత్వంలో ఫీజు రీ ఇంబర్స్‌మెంట్‌కు కన్సల్టెన్సీ ఏర్పాటుచేసి టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటుచేస్తే ఏ విద్యార్థియినా కూడా ఫోన్ చేసి తమ సమస్య పరిష్కారం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇకపోతే ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 20 మంది విద్యార్థులు, అధికారులు చేసిన తప్పుకు వారికి రావలసిన ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ రూ. 20,000 రావలసి ఉంటే రూ. 2 వేలు వచ్చింది. వారంతా ఎంఎస్సీ, కెమిస్ట్రీ చదువుతున్నారు. దీనిని పరిశీలించాలని కోరుతున్నాను.

శ్రీ నారదాసు లక్ష్మణ దాసు : అధ్యక్షా, ఫీజు రీఇంబర్స్‌మెంట్‌కు సంబంధించి ఎంబిఏ, ఎంసిఏ చేస్తున్న విద్యార్థులకు రూ. 27 వేలు ఫీజు ఉంటే రూ. 20 వేలు మాత్రం రీఇంబర్స్ చేసి మిగిలిన రూ. 7 వేలు ఆ విద్యార్థులను కట్టుకోమని చెబుతున్నారని చాలామంది విద్యార్థులు మాదృష్టికి తెస్తున్నారు. ఇంజనీరింగ్, మెడిసెన్ కోర్సులకు ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ మొత్తం ఇస్తూ, కేవలం ఎంబిఏ, ఎంసిఏలకు రూ. 20 వేలు ఇస్తున్నారు. ఈ విషయం వాస్తవమా? వారికి మొత్తం పీజు రీ ఇంబర్స్‌మెంట్ చేసే అవకాశం లేదా? దీనికి సమాధానం చెప్పాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ చుక్కా రామయ్య : అధ్యక్షా, పీజు రీ ఇంబర్స్‌మెంట్ జరగనందుకు 5 వేల మంది విద్యార్థులకు హాలు టికెట్ ఇవ్వని విషయం మీ దృష్టికి వచ్చిందా అని అడుగుతున్నాను.

శ్రీ ఎం. ముఖేష్ గౌడ్ : అధ్యక్షా, ప్రస్తుతం వున్న క్వశ్చన్‌కు సంబంధించి మాత్రమే చెబుతాను. ఇంకొకసారి తిరిగి అడిగితే మొత్తం రాష్ట్రానికి సంబంధించి చెబుతాను. ప్రస్తుతం గుంటూరు జిల్లాకు చెందిన సమాచారం మాత్రమే ఉంది. గుంటూరు జిల్లాలో ఫీ రీ ఇంబర్స్‌మెంట్ 2008-09 సంవత్సరంలో ఖర్చుచేసిన మొత్తం రూ. 20 కోట్ల 44 లక్షలు. అయినా కొన్ని అప్లికేషన్లు పెండింగ్ ఉండడం వలన అదనంగా రూ. 15 కోట్లు విడుదల చేయడం జరిగింది. ఇప్పటికి 2008-09 సంవత్సరానికి ఫీజు రీఇంబర్స్‌మెంట్ కోసం గుంటూరు జిల్లాకు రూ. 13 కోట్ల 13 లక్షలు ఖర్చుచేయడం జరిగింది. అలాగే 2008–09 సంవత్సరంలో గుంటూరు జిల్లాలో ఎస్‌బిహెచ్, ఆంధ్రా బ్యాంకు, సిండికేట్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకుల ద్వారా ఇప్పటికి 48,644 మంది విద్యార్థులకు ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ చేయడం జరిగింది. ఇంకా మిగిలిన 2,220 మంది విద్యారులకు ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ చేయలేదు. అది కూడా అందకపోవడానికి కారణం ఉంది. విద్యార్థులకు బ్యాంకు ఎకౌంట్ లేకపోవడం వలన, ఎటిఎం కార్డులు అందకపోవడం వలన ఇలాంటి సాంకేతిక సమస్యల వలన అందలేదు తప్ప నిధులు అందుబాటులో లేకపోవడం కాదు. ఈరోజు కూడా బ్యాంకులలో డబ్బు ఉంది. కొంత అవగాహనాలోపం, విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రక్రియ తెలియకపోవడంవల్ల ఇది జరిగింది. మేము కూడా మా డిపార్ట్‌మెంట్ నుండి ఎడ్యుకేట్ చేయడం జరిగింది. కాలేజ్ యాజమాన్యాలు కూడా కొంత ఇంటరెస్ట్ తీసుకుని వారికి ఎడ్యుకేట్ చేసి, కరక్టుగా అప్లయి చేయించితే నూటికి నూరుశాతం వచ్చే ఏర్పాటుచేస్తాము. గుంటూరు జిల్లాలోని 143 కాలేజ్‌లకు రీ ఇంబర్స్‌మెంట్ మంజూరుచేయడంలేదు. ఎందుకంటే ఇందులో కొన్ని కాలేజెస్ పూర్తిగా ప్రభుత్వఖర్చుతో నిర్వహింపబడుతున్నవి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలు కూడా ఇందులో వున్నాయి. కొన్ని కాలేజెస్ ట్యూషన్ ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ పొందడానికి అర్హత లేనివి, ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సర్కిల్స్ వారు కూడా అప్లయి చేశారు. కొన్ని కళాశాలలు ప్రారంభించకముందే ట్యూషన్ ఫీజు రీఇంబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్న దాఖలాలు వున్నాయి. కొన్ని కాలేజీల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోలేదు, అందుకే వారికి అందలేదు. మరి కొన్ని కాలేజెస్‌లో విద్యార్థులు అర్హత లేకున్నా స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారికి సంవత్సరానికి రూ.1 లక్ష కంటే ఎక్కువ ఆదాయం ఉన్నందున, ప్రభుత్వం రూ. 1 లక్ష ఆదాయం వరకు కటాఫ్ పెట్టినందున వారికి ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ మంజూరు చేయలేదు. అలాగే 143 కళాశాలల వివరాలు మీకు కావాలంటే సభలో ఉంచడానికి సిద్ధంగా ఉన్నాను.

శ్రీ కె. ఎస్. లక్ష్మణ రావు : అదనంగా బిల్డింగ్ ఫండ్ పేరుతో వసూలుచేస్తున్నారు. అలాంటివారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

MR. CHAIRMAN: Laxman Rao garu, I am not allowing you. Subba Reddy garu, there is a limit for everything. Please take your seat. You cannot dictate the House. This question pertains to Guntur District only. మీరు జనరలైజ్ చేశారు .

## VIRAL FEVER IN THE STATE

SNQ.No. 30 B (21-O)

MR. CHAIRMAN: SNQ No. 21-O is postponed at the request of the Member.

We have completed all the questions. After the tea break, I will take up the general discussion on budget. Now, tea break for fifteen minutes.

(Then the House adjourned at 11.58 a.m., for fifteen minutes' tea break)

మ.12.30

(THE HOUSE REASSEMBLED AT 12.38 P.M. WITH HON'BLE CHAIRMAN IN THE CHAIR)

MR. CHAIRMAN: All the Papers to be laid on the table are deemed to have been laid on the Table of the House.

## సభా సమక్షంలో ఉంచిన పత్రములు

1. A copy of the 33rd Annual Report of the Andhra Pradesh State Film Television and Theatre Development Corporation Limited for the year 2007-2008, as required under Section 619-A of the Companies Act, 1956 and

2. A copy of the 33rd Annual Report of the Andhra Pradesh State irrigation Development Corporation Limited for the year 2006-2007, as required under Section 619-A of the Companies Act, 1956.

## ప్రకటన

## **29.7.2009 న సాయంత్రము గం. 4.00 కు జరుగనున్న సెమినార్ గురించి**

MR. CHAIRMAN: I am to announce to the House that a seminar is being organized by the Rajaji International Institute of Public Affairs and Administration on "Practices and Procedures of Andhra Pradesh Legislative Assembly and Andhra Pradesh Legislative Council" at 4.00 p.m., today at Old Assembly Hall. Smt. S. Rama Devi, former Governor and Dr. Subhash C. Kashyap, former Secretary General, Lok Sabha will deliver the Key Note Address.

All the Members are requested to participate in the seminar.

మ. 12.40

శ్రీ పువ్వాడ నాగేశ్వరరావు (అసెంబ్లి) : అధ్యక్షా, ఈ నోటీస్ బాగా లేదు. లెజిస్లేటివ్ కౌన్సిల్ అండ్ అసెంబ్లీ అని రావాలి.

(అంతరాయం)

మీరు అనౌన్స్ చేశారు. ఈ ఆర్డర్ ప్రకారంగా, ప్రివిలేజెస్ ప్రకారంగా లెజిస్లేటివ్ కౌన్సిల్ అండ్ అసెంబ్లీ అని ఉండాలి. తమరు చదివిన దానిలో అలా లేదు.

MR. CHAIRMAN: It is the fault of the department.

శ్రీ పువ్వాడ నాగేశ్వరరావు: డిపార్ట్‌మెంట్ తప్పు చేస్తే మనం సరిచేయాలి. Because the prestige of this House is involved. The Legislative Council should come first in the order.

ఛైర్మన్ : ఆ, అన్నింటికి.

(సభలో నవ్వులు)

## సభా కార్యక్రమము

### i) 30.7.2009 న సాయంత్రపు సమావేశం నిర్వహించడం గురించి

శ్రీ దాడి వీరభద్రరావు: ఈ బడ్జెట్ సెషన్‌లో చర్చకు కొంత సమయం కేటాయించారు. పార్టీకి ఇన్ని నిమిషాలని కేటాయించినది జరగడానికి పాజిబిలిటి కనబడడం లేదు. ఎక్కువ మంది సభ్యులు మాట్లాడడానికి అన్ని పార్టీలవారు ఉత్సాహం చూపిస్తున్నారు కాబట్టి కనీసం రేపు సాయంత్రం బడ్జెట్ మీద ఈవినింగ్ సెషన్ పెడితే బాగుంటుందని సూచిస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్: ఇది కాకపోయినప్పుడు చూద్దాము.

శ్రీ దాడి వీరభద్రరావు: ఇప్పుడు మామూలుగా ముప్పావుగంటే సమయం ఉంది. మామూలుగా ఒకటిన్నర గంటఅని అనుకున్నాము. రోజు రోజుకూ కుదించుకునిపోతోంది.

శ్రీ కె. రోశయ్య: మామూలుగా సంఖ్యాపరంగా సమయం చూస్తే, దీనిని సద్వినియోగం చేసుకుంటే బాగా ఉపయోగించవచ్చు. రెండవ విషయం, బడ్జెట్‌లో డిస్కషన్ కాకున్నా, డిమాండ్స్ మీద డిస్కషన్ ఉంటుంది. కొన్ని ఇష్యూస్ ఐడెంటిఫై చేసి ఎక్స్‌ట్రా కూర్చొని సభ్యులందరికి ఏ ఇష్యూ మీద చర్చించాలని కోరితే ఆ విధంగా కూర్చోడానికి మనం నిర్ణయించుకున్నాము. ఇష్యూస్ వచ్చినప్పుడు మాట్లాడుకోవచ్చు. బడ్జెట్ ప్రపోజల్స్ శాసనసభకన్నా ఇక్కడ ఎక్కువ కావాలి, ఇంకా సమయం కావాలని కోరడం అంత హేతుబద్ధంగా ఉండదని నా అభిప్రాయము.

శ్రీ కపిలవాయి దిలీప్ కుమార్: పెద్దల సభలో పెద్దలు ఎక్కువగా మాట్లాడతారు.

శ్రీ కె. రోశయ్య: మాట్లాడుకోవడానికి సమయం సరిపోతుంది. ఇంకా అనేక విషయాల మీద మాట్లాడుకోవాలి.

మిస్టర్ ఛైర్మన్: పెద్దలు తక్కువ మాట్లాడాలి. ఎక్కువ భావం ఉండాలి.

### ii) ఎం.ఎల్.సి ల సౌకర్యాలు, ప్రోటోకాల్ అమలు గురించి

శ్రీ బి. మోహన్‌రెడ్డి: ఎం.ఎల్.సిల సౌకర్యాలు, సదుపాయాల గురించి ముఖ్యమంత్రిగారి ముందు మాట్లాడితే బాగుంటుంది. ఎందుకంటే ఇచ్చేవారి ముందు మాట్లాడితేనే బాగుంటుంది.

మిస్టర్ ఛైర్మన్: దానికి కమిటి ఉంది. అయినా, అందరూ మోహన్‌రెడ్డిగారి వద్దకు వెళుతున్నారు.

శ్రీ బి. మోహన్‌రెడ్డి: ముఖ్యమంత్రిగారు ఉన్నప్పుడు మాట్లాడడానికి అవకాశం ఇస్తే బాగుంటుంది, మా ఫీలింగ్స్ చెప్పుకుంటాము.

మిస్టర్ ఛైర్మన్: మీ బాధ నాకు తెలుసు. అందరూ మీ వద్దకు వస్తున్నారు.

శ్రీ బి. మోహన్‌రెడ్డిః సౌకర్యాలు ఎలా ఉండాలి. ఎమినిటీస్ గురించి. మనకు వయస్సు ఎక్కువ అయితే తేడా వస్తుంది.

(సభలో నవ్వులు)

మంత్రిగారు ఏదైనా తప్పు చెబితే తప్పు పడుతున్నామా? తమరు ఆలోచన చేయాలి.

శ్రీ దాడి వీరభద్రరావుః కౌన్సిల్ సభ్యులకు సంబంధించి, ఈ ప్రభుత్వం కౌన్సిల్‌ను ప్రవేశపెట్టింది. చాలా సంతోషం. సభ్యులకు కావలసిన ప్రివిలేజెస్ మిగిలిన సదుపాయాల గురించి మాట్లాడాలి. కౌన్సిల్‌కి సంబంధించిన ప్రివిలేజెస్ గురించికానీ, కొన్ని సమావేశాల్లో హాజరు కావడానికి మంత్రిగారు హామీ ఇచ్చారు. లోకల్ బాడీ సమావేశాల్లో, సభ్యులకు జిల్లా పరిషత్తులో ఇన్‌వైటీస్‌గా అటెండ్ కావడానికి మొదలైన అంశాలు ఉన్నాయి. బి.ఏ.సి.,లో డిస్కస్ చేయడానికి అవకాశం అడిగాము. బహుశా, 6వ తారీఖున పోస్టింగ్ అయిందని అనుకుంటున్నాము. ఆ రోజుడిస్కషన్‌లో ముఖ్యమంత్రిగారు హాజరు కావాలని మోహన్‌రెడ్డిగారు అంటున్నారు. ముఖ్యమంత్రిగారి ప్రెజెన్స్‌లో మాట్లాడితే వారు ఏదైనా చెప్పడానికి బాగుంటుందని అంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్ః ఏ టు జడ్ అన్నీ సి.యంగారి ముందు పెట్టే సమస్యలే.

శ్రీ దాడి వీరభద్రరావుః ఏ టు జడ్ అన్నీ పెడతాము. ఎంఎల్‌సిలకు సంబంధించినంతవరకూ.

డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డి (ముఖ్యమంత్రి) ః రోస్టర్ ప్రకారంగా నేను ఇక్కడ ఉంటాను. నిన్న రోస్టర్ ఇక్కడ ఉండింది. ఇక్కడ ఉన్నాను. ఈ రోజు ఆ హౌజ్‌లేదు. కాబట్టి ఇక్కడ ఉన్నాను. రేపు ఇక్కడే ఉంటాను. ఇక్కడ ఉన్నప్పుడు మాట్లాడడానికి అవకాశం ఉంటుంది. ఎమినిటీస్‌కి సంబంధించి, ప్రివిలేజెస్‌కి సంబంధించి కమిటి ఉంది. ఆ కమిటి డిస్కస్ చేస్తుంది. అవి ఇక్కడ డిస్కస్ చేయడం భావ్యం కాదు.

శ్రీ దాడి వీరభద్రరావుః ఎమినిటీస్ కమిటి ఉంది. దానిగురించి అడగడం లేదు. ప్రొటోకాల్‌కి సంబంధించింది.

డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డిః ప్రొటోకాల్‌కి సంబంధించి జీ.ఓ., ఉంది. ఎక్కడయినా ఇంప్లిమెంట్ కాకపోతే నా దృష్టికి తీసుకురండి. అవి చూస్తాను.

శ్రీ కపిలవాయి దిలీప్ కుమార్ః మంత్రి జె.సి. దివాకరరెడ్డిగారు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిలు, టీచర్ ఎంఎల్‌సిలు., మూడు మూడు జిల్లాల నుండి ఉన్నారు కాబట్టి వారందరికి ఇతర సమావేశాలకు హాజరు కావడానికి ఇన్విటేషన్ వస్తుందన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌స్ట్రక్షన్స్ ఇంకా రాలేదు. స్పెషల్ ఇన్‌వైటీగా రావడానికి ఇన్‌స్ట్రక్షన్స్ రాలేదు. ఇక్కడ రోస్టర్ ప్రకారంగా ముఖ్యమంత్రిగారు ఉన్నప్పుడు మాట్లాడడానికి అవకాశం ఇవ్వండి.

మిస్టర్ ఛైర్మన్ః అది కన్సిడర్ చేస్తాము.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : రాజ్యసభ, లోక్‌సభలోలాగా ఇక్కడ కూడా ఫండ్స్ ఇవ్వండని తమ ద్వారా ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్: ఇంతకుముందు చాలా మంది అడిగారు.

డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి: మీరు పెద్దలు కదా. మామూలుగా ప్రజలతో సంబంధం ఉండకూడదు.

(సభలో నవ్వులు )

**<u>అర్జీల సమర్పణ</u>**

శ్రీ దాచూరి రామిరెడ్డి: తమ ద్వారా పిటీషన్ సమర్పిస్తున్నాను. నిజామాబాద్ జిల్లాలో ఒక ఎయిడెడ్ స్కూల్‌లో 2002లో ప్రభుత్వం ఖాళీలు భర్తీ చేయడానికి అనుమతి ఇచ్చిన కాలంలో ప్రమోషన్స్ ఇచ్చారు. డిపార్ట్ మెంట్ దానిని రాటిఫై చేయలేదు. మామూలుగా 2004లో బ్యాన్ ఉండింది. అప్పటి నుండి ఇప్పటివరకూ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ల్యాప్స్ అయిన తరువాత ప్రమోషన్ లేకుండా రిటైర్‌అయ్యే పరిస్థితి ఉంది. కాబట్టి దయ చేసి పిటీషన్ కమిటి ద్వారా పరిష్కరించండి.

(పిటీషన్‌ను సమర్పించడం జరిగింది)

**<u>ప్రత్యేక ప్రస్తావన</u>**

శ్రీమతి బలశాలి ఇందిర (నామినేటెడ్) : తూర్పుగోదావరిలోని రాజమండ్రి రూరల్ మండలం ధవళేశ్వరం గ్రామంలో ఎలక్ట్రిసిటి బిల్స్ చాలా విపరీతంగా వచ్చాయి. ఆ ఏరియా అంతా ఫిషర్‌మెన్ కమ్యూనిటి. వారంతా కూడా చేపల మీద ఆధారపడ్డారు. వారికి రెగ్యులర్‌గా వచ్చేది నెలకు రు.150 నుండి రు.200 వరకూ వస్తుంది. చాలా ఇర్రెగ్యులర్‌గా, ఊహించని విధంగా రు.7,000 నుండి రు.12,000 వరకూ డ్వెల్లింగ్ హౌజ్‌కి బిల్లులు వచ్చాయి. వారంతా కూడ కంగారుపడి డి.ఇ.ఇ., వద్దకు వెళ్లారు. రు.10,000 నుండి రు.3,000లు తగ్గించి రు.7,000 కట్టాలని చెప్పారు. వారు అది చూసి రు.7,000 మేము ఎలా కడతామని నా వద్దకు వచ్చారు. ఎస్.ఇ., గారితో మాట్లాడాను. వారిని మా దగ్గరకు పంపించండి, రెగ్యులరైజ్ చేస్తానని ఎస్.ఇ.,గారు చెప్పారు. వారు చేసింది ఏమంటే, 10 ఇన్‌స్టాల్‌మెంట్స్ ఇచ్చారు. అది కట్టాలని చెప్పారు. అంత అమౌంట్ కట్టే పరిస్థితి లేదు. వారంతా రెండు, లేక మూడు బల్బులు మాత్రమే వాడుకుంటారు. వారికి రు.7,000, రు.8,000 రావడం తప్పు. అంతేకా కుండా ఇప్పుడు అక్కడి పరిస్థితి గందరగోళంగా మారే అవకాశం ఉంది. రెండు, మూడవ తారీఖులలో బిల్లు చెల్లించకపోతే కరెంటు కనెక్షన్స్ కట్ చేస్తామని అధికారులు అల్టిమేటమ్ ఇచ్చారు. ఎవరయినా కనెక్షన్ కట్ చేయడా నికి వస్తే కొడతామని వీరంతా అంటున్నారు. ఇప్పుడు అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉంది. కాబట్టి వెంటనే మంత్రిగారు చర్య తీసుకోవాలని కోరుతున్నాను.

మ. 12.50

**2009 - 2010 సంవత్సరపు వార్షిక ఆదాయ, వ్యయ పట్టిక (బడ్జెట్) పై సాధారణ చర్చ (కొనసాగింపు)**

శ్రీ జల్లి విల్సన్ (అసెంబ్లి) : అధ్యక్షా, 2009-2010 రాష్ట్ర బడ్జెట్‌పై జరిగే చర్చలో పాల్గొనేందుకు సీపీఐ తరపున నాకు ఈ రోజు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పెద్దలు రోశయ్య గారు అలవాటుగా కాని సాంప్రదాయంగా కాని రూ. 1,03,485 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఉన్న పరిస్థితుల్లో బడ్జెట్‌ను ఇంతకన్నా మెరుగైన విధంగా తీర్చి దిద్దడం కుదరదనేది రోశయ్య గారు కూడా అంగీకరించడం జరిగింది. ధరల పెరుగుదల, అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొంటే గత బడ్జెట్ కంటే అన్ని రంగాలకు శాస్త్రీయంగా 10 శాతం పెరగాలనే ఆలోచన లోపించినట్లు మాకు కనిపిస్తోంది. రాష్ట్రంలో భూముల అమ్మకాలు లేవు కాబట్టి కేంద్రం నుండి అదనపు నిధులు రాబట్టడం, బ్యాంకుల నుండి రుణాలు రాబట్టడం, మద్యం అమ్మకాలు పెంచుకోవడం, బలహీన వర్గాల సంక్షేమానికి కోత పెట్టడం, ప్రయివేట్ భాగస్వామ్యంతో పథకాలు అమలు పరచడం మొదలైన వాటి ద్వారా గట్టెక్కడ మనేది ఈ బడ్జెట్ యొక్క సారాంశం. ఆదాయవనరులను బడ్జెట్‌లో పూర్తిగా వివరించలేదు.

జలయజ్ఞం విషయానికి వస్తే, గత సంవత్సరం వార్షిక బడ్జెట్‌లో రూ.16500 కోట్లు, ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.12500 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.17800 కోట్లు ఈ పథకం క్రింద కేటాయించారు. నీటిపారుదల శాఖ వారు కనీసం రూ.19000 కోట్ల మేరకు కేటాయించవలసిందిగా ఆర్థిక శాఖను కోరారు. రోజు రోజుకు ప్రాజెక్టుల సంఖ్య పెరుగుతోంది కాబట్టి ప్రాజెక్టుల వారీగా కేటాయించే నిధులు కుదించబడతాయనేది మా భావన. వీటిలో కొన్నింటినైనా కేంద్రం జాతీయ ప్రాజెక్టులుగా గుర్తిస్తే కాని ఈ ఆర్థిక పరిస్థితి నుండి బయటపడలేము.

కృష్ణా డెల్టా ఆధునీకరణకు గతంలో రూ.4500 కోట్లు ఖర్చు పెట్టాలని నిర్ణయించగా గత రెండు సంవత్సరాలలో రూ.77 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.55 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ పథకం అమలుకు ఒక్క అడుగు కూడా ముందుకు సాగడం లేదు. నత్త నడకగా సాగుతోందనేది ఈ సందర్భంగా మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

పులిచింతల ప్రాజెక్ట్ చాలా ఉపయోగకరమైనటువంటిది. కృష్ణా డెల్టాను స్థిరీకరించేందుకు ప్రజల వాంఛలకు అనుగుణంగా రూపొందించబడినటువంటి ప్రాజెక్టు ఇది. దీనికి గతంలో రూ.250 కోట్లు కేటాయిస్తే ఈసారి బడ్జెట్‌లో రూ.150 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

అలాగే, రాష్ట్రంలో చాలా హెచ్చు సంఖ్యలో జల యజ్ఞం ప్రాజెక్టులను చేపట్టడం జరుగుతున్నా నిర్మాణంలో ప్రాధాన్యతా క్రమం ఉండాలనేది మా పార్టీ యొక్క భావన. పరివాహక ప్రాంతాల వారికి కాల్వలు వెళ్లేందుకు కాని, నదులు పారే ప్రదేశాలలో నివసిస్తున్న వారికి ఫలితాలు సక్రమంగా అందేందుకు కాని తగు చర్యలు తీసుకోవాలి. నిర్వాసితుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించాల్సిందిగా ఈ సందర్భంగా కోరుతున్నాను. ఆయకట్టు ఉన్న ప్రాంతాలలో నివసిస్తున్న పేదలకు, అలాగే నిర్వాసితులకు వారి వాటా సక్రమంగా దక్కాలి.

విద్యుత్ విషయానికి వస్తే, పాలక పార్టీ గత ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్ సరఫరా సమయాన్ని రోజుకు 7 గంటల నుండి 9 గంటల వరకు పెంచుతున్నామని చెప్పి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.5040 కోట్లు కేటాయిస్తే ఈసారి బడ్జెట్‌లో రూ. 6040 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇంత పెద్ద కార్యక్రమానికి రూ.1000 కోట్లు మాత్రమే పెంచారు. ఇది ఏ మాత్రం చాలదు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సమన్వయ కమిటీ తాజా అంచనాల ప్రకారం రూ.10936 కోట్ల మేరకు సబ్సిడీ నిమిత్తం కేటాయించి సకాలంలో నిధులను విడుదల చేయవలసిందిగా ఆర్థిక శాఖను కోరింది. వారు కోరిన ప్రకారం నిధులు కేటాయించకపోతే విద్యుత్ సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో పడడం ఖాయం. ఏపీ జెన్‌కోకు యథావిధిగా ఎటువంటి కేటాయింపులు జరగలేదు. గతంలో చేయలేదు. ఈ సారి కూడా చేయలేదు. సబ్సిడీలు కాక బడ్జెట్‌లో విద్యుత్ రంగానికి కేటాయించిన ఈ స్వల్ప నిధులు ఏపీ ట్రాన్స్‌కో రుణాల చెల్లింపుకు మాత్రమే సరిపోతాయి. ఇంత పెద్ద ఎత్తున ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్న సందర్భంగా పేదల నివాస గృహాలకు కూడా ఉచిత విద్యుత్‌ను సర ఫరా చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఇందిరమ్మ గృహ నిర్మాణ విషయంలో ఈ పథకానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని చెపుతున్న ప్రభుత్వం ఈ సంవత్సరం భారీ కోత విధించింది. గత సంవత్సరం బడ్జెట్‌లో రూ.5850 కోట్లు కేటాయింపులు చేస్తే సవరించిన అంచనాల ప్రకారం రూ.5993 కోట్లు ఖర్చు చేశారు. అంటే అదనంగా రూ.143 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ఇది ఇలా ఉంటే, ఈ సంవత్సరం ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి కేవలం రూ.1800 కోట్లు మాత్రమే కేటాయించి రూ.4193 కోట్లు భారీ కోత విధించారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణం అంతంత మాత్రంగా సాగుతుంటే ఈ భారీ కోత వల్ల మిగిలిన ఇళ్ల నిర్మాణం ఖచ్చితంగా ఆగిపోయినట్లే. ఇల్లు పీకి పందిర వేసుకున్నట్లుగా తయారవుతుంది. పూరిల్లే లేకుండా చేస్తామన్న మన ముఖ్యమంత్రి గారి మాటలు నీటి మూటలు అయ్యే ప్రమాదముంది.

(ట్రెజరీ బెంచెస్ నుండి అంతరాయం)

నన్ను మాట్లాడనివ్వండి. అన్నీ చెవులకు ఇంపైన మాటలే ఉండవు. అన్ని మసాలాలు ఉంటాయి. మొదటి, రెండు దశలలో ఆగిపోయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మూడవ దశలో చేపట్టవలసిన ఇళ్ల నిర్మాణానికి తగిన నిధులు కేటాయించి పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఇందిరమ్మ గ్రామాలు అంటే ఒక్క ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే కాదు. ఇందరమ్మ గ్రామాలకు మౌలిక వసతులు, త్రాగునీరు, రోడ్లు, మురుగునీటి పారుదల, విద్యుత్ తదితర సౌకర్యాల కల్పనకు ఈసారి బడ్జెట్‌లో పూర్తి కేటాయింపులు జరగాలని కోరుతున్నాను.

గ్రామాల్లో మినరల్ వాటర్ అమ్మకాలు అనే ఆలోచన వస్తోంది. ఇది సరైనది కాదు. అందరికి రక్షిత త్రాగునీరు అందించాలని మనవి చేస్తున్నాను. ప్రజలందరి ఆరోగ్యాలు కాపాడాలి.

వ్యవసాయ రంగానికి స్వర్ణ యుగమని ఒక ప్రక్క ప్రభుత్వం చెపుతున్నా బడ్జెట్‌లో ఈ రంగానికి కేటాయించిన నిధులు గత బడ్జెట్ కంటె సగానికి సగం తగ్గించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు గత ఏడాది బడ్జెట్‌లో రూ.4093 కేటాయిస్తే ఈ సంవత్సరం బడ్టెట్‌లో రూ. 2612 కోట్లకు దిగ కోసారు. ప్రతి వ్యక్తికి ఆహార భద్రతను కల్పించే వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇవ్వడం ద్వారానే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రైతు కూలీల పరిస్థితి మెరుగుపడుతుంది. నమ్మకమైన విత్తనాలు, క్రిమి సంహారక మందులు, ఎరువులు, సాగునీరు సకాలంలో సరఫరా చేయాలని కోరుతున్నాను. ఎన్నో ఇబ్బందులను అధిగమించి అధిక పంటలను పండిస్తున్న రైతులకు

మద్దతు ధర ఇవ్వాలని కోరుతున్నాను. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలి. అలాగే, ఎం.ఎస్. స్వామినాథన్ కమీషన్ సిఫారసుల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

సంక్షేమం రంగానికి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి సంబంధించి గత బడ్జెట్‌లో రూ.6969 కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.6930 కోట్లు కేటాయించారు. అతి పెద్ద సంఖ్య కలిగిన బలహీన వర్గాల సంక్షేమానికి నిధులు రెట్టింపు చేయవలసిన ఆవశ్యకత ఉంటే రూ.39 కోట్లు కోత విధించారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న వీరి సంక్షేమం ఇక ఎండ మావే అవుతోంది. సంక్షేమ హాస్టల్స్‌కు సంబంధించి జనరల్ హాస్టల్స్‌కు పక్కా భవనాలు లేవనే సంగతి మనందరికి తెలుసు. ప్రత్యేక ఎస్సీ హాస్టళ్లకు పక్కా భవనాలున్నాయి కాని జనరల్ హాస్టళ్లకు పక్కా భవనాలు లేవు. పక్కా భవనాల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

మ.1.00

అలాగే వీరి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నోడల్ ఏజన్సీ ఎక్కడుందో, పని చేస్తుందో లేదో కూడా తెలియడం లేదు. దాన్ని పని చేయించే పద్ధతిలో చర్యలు తీసుకోవాలి. పౌరులందరికి గౌరవ రాష్ట్రపతి గారి ప్రసంగంలో గాని, మన గవర్నర్ గారి ప్రసంగంలో గాని ఆహార భద్రత కల్పిస్తామని అన్నారు కాని అది కరువైంది. పాలక పార్టీలు అనేక సందర్బాలలో తెల్ల కార్డులలో వున్న ప్రతి వ్యక్తికి నాలుగు కిలోల నుండి ఆరు కిలోల బియ్యం సబ్సిడీగా అందిస్తామని చెప్పి రెండు కోట్ల మూడు లక్షల మంది తెల్లకార్డు దారులకు ఈ బడ్జెట్‌లో .................

("అందుకే ఓట్లువేసి గెలిపించారు" అని ట్రజరీ బెంచస్ నుండి వినవచ్చింది.)

శ్రీ పువ్వాడ నాగేశ్వర రావు:- అధ్యక్షా, ఒక నిమిషం ......................

MR.CHAIRMAN: You are taking the time of Mr.Wilson. Your colleague is on his legs.

శ్రీ పువ్వాడ నాగేశ్వర రావు:- అధ్యక్షా, కొన్ని అప్రియమైనవి, కొన్ని ప్రియమైనవి వుంటాయి. కొన్ని ప్రియమైనవి మరికొన్ని అప్రియమైనవి వస్తాయనుకోండి వస్తే దీనితో కామెంటు ఎక్కడికో వెళుతోంది. మేం మీకు ఓట్లు వెయ్యలేదా అండి? At that time without us have you been elected? We are respecting it.

MR.CHAIRMAN:- They have said it in a lighter vein and it should be taken in a sportive manner. I can understand. You should take it as a compliment.

శ్రీ జల్లి విల్సన్:- అధ్యక్షా, గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు ఈ సభలో వున్నారు. నాకు ఈ సమయంలో ఉపన్యసించడానికి అవకాశం వచ్చినందుకు నేను అదృష్టంగా భావిస్తున్నాను. నాగేశ్వర రావు గారు చెప్పినట్లుగా ప్రియము, అప్రియము అని రెండూ వుంటాయి. దాన్ని స్వీకరించి పరిపుష్టి చేసే పద్ధతిలో మన బడ్జెట్ వుండి ప్రజారంజక పరిపాలన చేయాలనే మేం కోరుతున్నాం. అంతే గాని దీన్ని తీసుకోవద్దని, ప్రతి క్షణం మీకు అనుకూలంగా వుండాలని కోరుకోవడం తప్పు. రెండు కోట్ల మూడు లక్షల మంది తెల్లకార్డు దారులకు ఈ బడ్జెట్‌లో రూ.3500 కోట్లు మాత్రమే కేటాయించారు, ఇది చాలదు. బోగస్ కార్డులు ముప్పై లక్షల వరకు వున్నాయని మన పాలకులు ఒక అంచనాకు వచ్చి వాటిని తగ్గించి ఒక కోటి డెబ్బై మూడు లక్షల కార్డులకు మొత్తాన్ని

ముందుగానే ఊహించి బడ్జెట్ కేటాయించినట్లుగా మాకు అర్థమవుతుంది. అర్హులైన తెల్లకార్డులు వున్న వారిని ఏ మాత్రం రద్దు చేయవద్దని ఏ ఒక్క దోషి శిక్షింపబడినా పరవాలేదు కాని ఏ ఒక్క నిర్దోషికి శిక్ష పడకూడదని నేను ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అలాగే అన్ని నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేసేందుకు, ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు, ప్రజలకు అందించేందుకు, ధరలు నియంత్రణ చేసేందుకు ఒక నిధిని ఏర్పాటు చేయాలి. దానికి ఈ బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదు. గత బడ్జెట్‌లో మాత్రం రూ.30 కోట్లు దీని కోసం కేటాయించారు కాని నిధులు విడుదల చేయలేదు. అలాగే గోడౌన్‌లో వుంచిన నిత్యావసర వస్తువులన్నింటిని బయటకు తీసి ప్రజలకు అందించాలని మన గౌరవ ముఖ్యమంత్రిగారు ఆదేశాలు జారీ చేశారు. దాని మీద చిత్తశుద్ధితో అధికారులు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. దొంగ వ్యాపారులను కఠినంగా శిక్షించాలి. అలాగే స్వాధీనం చేసుకున్న నిత్యావసర వస్తువులన్నింటిని వెంటనే ప్రజలకు అందించే ఏర్పాటు చేయాలని నేను ఈ సందర్భంగా కోరుతున్నాను.

అదే విధంగా ఆరోగ్యశ్రీ అనేది చాలా బ్రహ్మాండమైన పథకం అని మనందరం చెబుతున్నాం. కాని దీనికి అనేక రకాలైన బాలారిష్టాలు వస్తున్నాయి. ఈ మధ్యనే గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా చెప్పడం జరిగింది. దాన్ని అధిగమించడం కోసం చర్యలు తీసుకోవాలి. అలాగే ప్రతి దానికి కార్పోరేట్ ఆసుపత్రి అని కాకుండా ఆ నిధులు సంచయనానికి మళ్లించి ప్రభుత్వ ఆసుపత్రులలో చేయాలని కోరుతున్నాను. అలాగే తాలుకా స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పేరు మీద వున్నాయి. వీటిల్లో డాక్టర్ల పోస్టులు, సిబ్బంది పోస్టులు ఖాళీగా వున్నటువంటి పరిస్థితి వున్నది. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కుక్క కాటుకు మందు తప్పనిసరిగా ఉండేటట్లు చేయాలని నేను కోరుతున్నాను. ఇదే సందర్భంగా అన్ని పి.హెచ్.సిలను ఇరవై నాలుగు గంటల ఆసుపత్రులుగా చేయాలి. అలాగే ఇవ్వాళ పి.హెచ్.సిలలో గైనకాలజిస్టు పోస్టులు గాని, పిల్లల నిపుణులు గాని ఖచ్చితంగా ఉండేటట్లుగా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయాల్సిందిగా కోరుతున్నాను. ఎందుకంటే ఈ మధ్య కాలంలో అన్ని పి.హెచ్.సిలు తిరిగి వచ్చాను. అక్కడి ప్రజలు ఈ పి.హెచ్.సి సెంటర్లలో గైనకాలజిస్టులు, పిల్లల నిపుణులు వుండాలని చెబుతున్నారు. కాబట్టి ఇంత పెద్ద ఆరోగ్యశ్రీకి, ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నటువంటి మన ప్రభుత్వాన్ని, ప్రభుత్వ పంపిణీలనైనా అటు మరల్చి గైనకాలజిస్టులను, పిల్లల నిపుణులను ఏర్పాటు చేయాలి. అదే సందర్భంగా పి.హెచ్.సిలలో కుక్క కాటు మందు, పాము కాటు మందు ఏర్పాటు చేయాలని నేను చెబుతున్నాను.

అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనేది మన రాష్ట్రంలో అమలు జరుగుతోంది. అదే మోతాదులో అవినీతి కూడా జరుగుతుందనేది కూడా వినిపిస్తోంది. అన్ని స్థాయిలలో వున్నటువంటి అవినీతిని అరికట్టడం కోసం చర్యలు తీసుకోవాలి. మన ముఖ్యమంత్రి గారు ప్రకటించినట్లుగా గాని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద సంవత్సరంలో ప్రతి కష్టజీవి కుటుంబానికి 150 రోజులు పని కల్పించేటట్లు చేయాలని వారు చెప్పడం జరిగింది, అది చాలా మంచిది. ఎందుకంటే అది అందరం కలిసి సాధించుకున్న చట్టం. ఇది రాష్ట్రంలో అమలు జరుగుతోంది. అలాగే దానికి రోజు కూలీ రూ.120/- చేస్తామని ముఖ్యమంత్రి గారు సెలవిచ్చారు. అది ఖచ్చితంగా చేస్తే ఇవ్వాళ కష్ట జీవుల కళ్లలో వెలుగు చూడటానికి వీలవుతుంది. ప్రస్తుతం రూ.120/- కూలీ అనేది పడటం లేదు. రూ. 60/-, రూ.70/- మాత్రమే పడుతున్నది. వచ్చినటువంటి చట్టం అమలులో ఎన్నో ఇబ్బందులు వస్తున్నాయి.

అలాగే విజయవాడలోని సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ సంగతి ఈ సందర్భంగా చెప్పాలి. ఎందుకంటే మన ఆర్థిక మంత్రి గారు గత బడ్జెట్‌లో చేస్తామని చెప్పి మాట ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం అది కృష్ణా జిల్లా గుంటూరు జిల్లా మధ్యన ఊగిసలాడుతున్నది. విజయవాడ నగరంలో ఈ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌కు కావలసినంత స్థలం వున్నది, కాబట్టి విజయవాడ నగరానికి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటు చేయాలని నేను ఈ సందర్భంగా కోరుతున్నాను.

అలాగే కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులకు సంబంధించి వాటిని అమలు చేయడానికి నిధులు ఈ బడ్జెట్‌లో చోటు చేసుకోలేదు. పేద ప్రజలకు ఇప్పటికే నివాసం వుంటున్నటువంటి వాటిని సాగు చేసుకుంటున్నటువంటి భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతున్నాను. నిర్దిష్టమైన కాల పరిమితిలో దీన్ని అమలు చేసేదాని కోసం ప్రభుత్వం నిధులు కేటాయించి దాన్ని అమలు జరిపితే మంచి పేరు మీకు వస్తుందని మేం తెలుపుతున్నాం.

అదే విధంగా 2006 సంవత్సరంలో అటవీ హక్కుల చట్టం వచ్చింది. దాదాపు పన్నెండు లక్షల ఎకరాలకు మేం భూమి పంచుతామని అన్నారు. ఇప్పటికే దాదాపు మూడు లక్షల ఎనభై వేల ఎకరాలకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు, నేను కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నాను. కష్ట జీవులకు, గిరిజనులకు ఇది ఒక మంచి కార్యక్రమం. దీనికి కేటాయింపు కేవలం రూ.23 కోట్లు మాత్రమే అంటే భూమి అభివృద్ధికి గాని అక్కడ వున్నటువంటి దానికి చాలదని చెప్పి దాన్ని ఇంకా పెంచాలని నేను ఈ సందర్భంగా కోరుతున్నాను. అలాగే భూ భారతి కార్యక్రమం క్రింద సమగ్రమైన సర్వే ఈ రాష్ట్రంలో జరిగితే సరిహద్దు తగువులు వుండవు, రైతుకు, రైతుకు మధ్య తగువులు వుండవు. శాఖకు శాఖకు మధ్య తగువులు వుండవు. అలాగే హద్దులు నిర్ణయించవచ్చును, వారికి హక్కులు కూడా కల్పించడం కోసం ఒక పద్ధతిని అమలు చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

గీత, చేనేత వృత్తుల వారికి మీరు కొన్ని నిధులు కేటాయించారు. దీన్ని మీరు రెట్టింపు చేయాలని నేను ఈ సందర్భంగా కోరుతున్నాను.

మ.1.10

అన్ని ప్రభుత్వరంగ సంస్థలలోనూ, ఆర్‌టిసి మున్నగు సంస్థలలో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్ట్ సిబ్బందిని పర్మనెంట్ చేసే ఆలోచనవైపు మనం ఉండాలని తెలియచేస్తున్నాను. చివరిగా ఒక్క మాట చెప్పదల్చుకున్నాను- వ్యవసాయ రంగంలో చిన్న చిన్న కమతాల వలన రాబడి తగ్గుతుందనే ఆలోచన సరైనది కాదు. దీనిని సహకార వ్యవసాయమనే పేరుపెట్టి అటు మరల్చవద్దు. కాబట్టి ఇప్పుడున్నటువంటి ఆలోచన సాధ్యం కాదేమో, అది సత్ఫలితాలను ఇవ్వదేమో అని భావిస్తున్నాము. ఇటువంటి ఆలోచన మానుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

మచిలీపట్నం ఓడరేవుకి రు.20కోట్లు మాత్రమే కేటాయించారు. దీనివల్ల భూమి సేకరణ మాత్రమే సాధ్యపడుతుంది. నిర్మాణపనులు ముందుకు సాగాలంటే కష్టతరమవుతుంది. నేను మనవి చేసిన విషయాలను సహృదయంతో స్వీకరించి బడ్జెటుకు పరిపుష్టి చేకూర్చాలని ప్రజా రంజకమైన బడ్జెటును తయారు చేయాలని గౌరవ మంత్రివర్యులు శ్రీ కె. రోశయ్యగారికి మనవి చేస్తున్నాను.

శ్రీ బి. చెంగలరాయుడు : అధ్యక్షా, పెద్దలు రోశయ్య గారు ప్రవేశపెట్టిన బడ్జెటుపై మాట్లాడే అవకాశం నాకు కల్పించినందుకు మీకు నా ధన్యవాదాలు. గౌరవ మంత్రిగారు రెసిషన్ సమయంలో ప్రపంచం అంతా ఆర్థికమాంద్యంతో కుంగుతున్న ఈ పరిస్థితులలో కూడా ఇలాంటి బడ్జెటును తీసుకురావడం హర్షించదగ్గ విషయం. నేను కొన్ని విషయాలను చట్టసభలో మీముందుకు తీసుకురావడానికి అదే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తాను. What is Legislation? What is the relationship between the Legislation and the Legislator? What is the place of the Legislation? This is a holy place. అన్ని కులాలకు అన్ని మతాలకు సంబంధించిన ప్రజల పక్షాన ఈనాడు మనమందరం కలిసిచట్టాలను తీసుకువస్తున్నాము. ఈనాడు మనం మన పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రగతికి సూచనలిచ్చే విధంగా దేవుడు మనకు ఇటువంటి అవకాశం కల్పించాడు. ప్రజాస్వామ్య విషయానికి వస్తే మనతోపాటు స్వాతంత్ర్యం తెచ్చుకున్నటువంటి పొరుగు దేశాలలో ఆ స్వాతంత్ర్యం పోయి మిలిటరీ రూల్ వచ్చింది. మనతరువాత స్వాతంత్ర్యం తెచ్చుకున్న దేశాలలో కూడా మిలిటరీ రూల్ వచ్చింది.

మిస్టర్ ఛైర్మన్ : పుస్తకం వ్రాసే ముందు పీఠికలాగా మీ ప్రసంగం ముందు కూడా పీఠిక ఉన్నట్లు ఉన్నదే.

(సభలో నవ్వులు)

శ్రీ బి. చెంగలరాయుడు : ప్రస్తుతం అసెంబ్లీలో జరుగుతున్న సభావ్యవహారాలను టి.వి. ఛానెల్స్‌లో చూస్తున్న ప్రజానీకం ఈ రాష్ట్రంలో కూడా అటువంటి మిలిటరీ రూల్ వస్తే బాగుండునన్న ఆలోచన కలుగుతుంది కాబట్టి ఆ ఆలోచన ప్రజలకు రాకుండా ఉండడానికి శాసనసభ్యులుగా మన కర్తవ్యాన్ని నెరవేర్చవలసిన బాధ్యత మనపై ఉన్నది. నేను ఉదయం వాకింగ్‌కి వెడితే "ఏమిటయ్యా రోశయ్యగారికే కోపం తెప్పించారు మీ వాళ్లు" అన్నారు. అంటే ప్రజలలో ఇటువంటి భావం కలుగకుండా ఉండడానికి మనం జాగ్రత్త పడాలని తమద్వారా గౌరవ సభ్యులందరికీ తెలియచేసుకుంటున్నాను.

రాజ్యాంగంలో అధికరణ 202 ప్రకారం ఒక దేశానికి గానీ, రాష్ట్రానికి గానీ statement of estimated receipt and expenditure for the year తీసుకుంటారు. అందులో ఆదాయ వ్యయ అంచనాలు ఉంటాయి. మన రాష్ట్రంలో ఉన్నటువంటి నిధులను సక్రమంగా వినియోగించుకున్నటువంటి ఘనత మన రోశయ్యగారిది. 1994-95 నుండి 2003-04 వరకు తీసుకుంటే వచ్చినటువంటి నిధులను తీసుకుంటే అప్పులు చేయించారు. 1956-57లో అయితే ఈ రాష్ట్ర బడ్జెటు రు.280కోట్లు. అందులో ప్లాన్ కొరకు కేటాయించినది రు.60కోట్లు. తరువాత ముఖ్యమంత్రిగారు బాధ్యత తీసుకున్నప్పుడు శ్రీ నాదెండ్ల భాస్కరరావుగారు బడ్జెటు ప్రవేశపెట్టారు. అప్పుడు రు.2930కోట్లు. ఇంతకు ముందు మిత్రులు శ్రీ జల్లి విల్సన్ గారు రు. 3500కోట్లు బియ్యానికి ఇస్తే అది సరిపోదన్నారు. ఆనాడు రాష్ట్ర బడ్జెటు అంతా కలిపితే రు.2930కోట్లు. ఇకపోతే మనం తీసుకున్న అప్పులు ఎంత, వాటిని ఏవిధంగా సరిపుచ్చాలనే వాటిపై కొంత చర్చ జరిగింది. దానిమీద పెద్దలు శ్రీ దాడి వీరభద్రరావుగారు పెద్దగా దాడికి పోకుండా 95 శాతం బాగానే చెప్పారు. ఎందుకంటే అంతకుముందు ప్రభుత్వం వాళ్లు తెచ్చినటువంటి అప్పును నలభై అయిదు శాతం వరకే ప్లాన్ బడ్జెటులో పెట్టి కన్‌స్ట్రక్టివ్ సైడ్ వెళ్లారు. నా దగ్గర స్టేట్‌మెంట్ ఉంది. కానీ మేము 110 శాతం కాపిటల్ ఎక్స్‌పెండిచర్ చూపించి ప్రొడక్షన్‌లో వచ్చాము. ఈ సందర్భంలో నాకొక కథ గుర్తొస్తోంది. ఇద్దరన్నదమ్ములలో ఒకాయన లక్ష రూపాయలు అప్పు చేసి పిల్లలను చదివించుకున్నారు. ఇంకొకరు లక్షరూపాయలు అప్పు చేసి పిల్లాడికి మోటారు సైకిలు కొనిచ్చారు. చదువుకున్న

పిల్లవాడు పెద్దవాడైన తరువాత డాక్టరై తాను బాగుపడి, తన తల్లిదండ్రులను చక్కగా చూసుకున్నాడు. మోటారు సైకిలు కొన్నవాని పరిస్థితి ఏమయిందంటే టైర్లు అరిగిపోయి, మిగతా పార్టులు పోయి ఆఖరుకి మోటరు సైకిలే పోయింది. రాజశేఖరరెడ్డి గారు తెచ్చినటువంటి అప్పులు ఏవేవి ఎక్కడ ఏఏ ప్రాజెక్టులు ఉన్నాయో అన్నీ కనబడుతున్నాయి. అంతకుముందు ఉన్న వారు తెచ్చిన అప్పులన్నీ తిలకం సీసాలకు, సబ్బు బిళ్లకు, సెంటు బాటిళ్లకు, సిగరెట్ పాకెట్లకు పెట్టారు. ఇవన్నీ నగ్న సత్యాలు, వీటిని వారిముందు ఉంచుటకు ప్రయత్నిస్తున్నానే తప్ప వేరే కాదు.

ఇప్పుడు ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి రెసిషన్ పీరియడ్‌లో కూడా ఇరిగేషన్‌కు టాప్ ప్రయారిటీ ఇచ్చింది. పాదయాత్ర చేసినప్పుడు రాజశేఖరరెడ్డి గారు కడప జిల్లాలో తిరిగినప్పుడు ఈ రోడ్లు బాగా వేయించిన ఘనత చంద్రబాబునాయుడుగారికి దక్కుతుంది అన్నారు. నేను ఆశ్చర్యపోయాను. అర్థగంటలో చంద్రబాబు నాయుడు గారిని రెండుసార్లు పొగిడారు credit goes to Mr.Chandrababu Naidu అని. ఇంత డబ్బు రోడ్లమీద పెట్టకుండా, ప్రతి చేనుకి నీళ్లిస్తే ప్రతి చేతికి పని దొరుకుతుంది కదా అని నేనప్పుడు అన్నాను. అప్పుడు రాజశేఖరరెడ్డిగారు వచ్చేది మన ప్రభుత్వం చేసేది ఆపనే, ప్రతి చేను బీడు పోకుండా చూసుకునే బాధ్యత మనమీద ఉంటుందని అన్నారు.

(ట్రెజరీ బెంచెస్ వైపునుండి హర్షధ్వానాలు)

పాదయాత్ర చేసినప్పుడే పట్టాభిషేకం జరుగుతుందని ఆనాడే అందరం అనుకున్నాము. శ్రీరామచంద్రుడు పట్టాభిషేకం ముందు పాదయాత్ర చేశారు.

మ.1.20

అధికారంలోకి వస్తున్నాము, ఇరిగేషన్ ప్రాజెక్టులు తీసుకువస్తాం. ఆంధ్రరాష్ట్రాన్ని సశ్యశ్యామలం చేస్తామన్న విషయాన్ని ముందుగానే మేము చెబితే...

(ప్రతిపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

అధ్యక్షా, 1995వ సంవత్సరంలో పెద్దలు ఎన్.టి.రామారావుగారు, 95కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కిలో 2 రూపాయలు బియ్యం పథకానికి ఎలాట్ చేశారు. అంతకుమునుపే విజయభాస్కర్ రెడ్డి గారు రూ. ఒకరూపాయి తొంభై పైసలతోనే బియ్యం పథకానికి నాలుగు కోట్ల రూపాయలు కేటాయించారు. ఈ ఘనత కూడా కాంగ్రెస్ పార్టీదే. చివరలో దాడి వీరభద్రరావుగారు మాట్లాడుతూ కనీసం మీరు ఎన్.టి.రామారావుగారిని అయినా ఫాలో అయినందుకు ధన్యవాదాలు అన్నారు. ఇంకొక ముఖ్యమైన విషయం, ఇక్కడ జరుగుతున్నదేమిటంటే ఒక వ్యక్తి ప్రధానమంత్రి పదవి తన చేతికి వస్తే కూడా 'నాకు వద్దు' అని చెప్పి పార్టీని అనుసరించి మరో వ్యక్తికి ప్రధాన మంత్రి పదవినిచ్చారు. ఇంకొక వ్యక్తి ముఖ్యమంత్రి సీట్లో ఉన్నటువంటి వ్యక్తిని నిలువునా దించి ఆ సీట్లో కూర్చున్నారు.

(శ్రీమతి గంగా భవాని షేమ్... అన్నారు.)

ఆయనని ఇంపోర్టు చేసుకోవటమా, లేక ముఖ్యమంత్రిని కూడా ఇంపోర్ట్ చేసుకోండని చెబితే... ఇంతకన్నా దారుణం ఏమి ఉంటుంది అధ్యక్షా. ముఖ్యమంత్రి పదవిలో ఉన్నటువంటి వ్యక్తి సెక్రటేరియట్ గేట్ల వద్ద పడుకున్నారు. వైస్రాయ్ హోటల్ దగ్గర చెప్పులు విసిరివేయబడ్డారు అధ్యక్షా. అలాంటి పరిస్థితిలో ...చెప్పులని చెబుతున్నా అంతకు మించి వేరేది ఏమి లేదు.

(అంతరాయం)

అధ్యక్షా, మేము స్టూడెంట్ లీడర్‌గా ఉన్నప్పుడు విద్యార్థి దశలోనే రెండు శాతం నిధులు విద్యుత్‌కు కేటాయించాలని చెప్పి పెద్దగా స్ట్రైక్ చేశాము. ఈ రోజు 11 శాతం నిధులు విద్యుత్‌కు కేటాయించిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందని చెబుతున్నాను. ఇందులో ఇంకా చేయవలసినవి ఉన్నాయని తెలియజేస్తున్నాను.

హెల్త్ గురించి చెప్పారు. లీడర్ ఆఫ్ అపోజిషన్ చెప్పినవన్నీ ఆరోగ్యం వరకూ నూటికి నూరుపాళ్లు నిజాలు. హెల్త్‌కి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో లోయెస్ట్ పర్సెంటేజ్ ఎలాట్ చేశారన్నారు. ప్రపంచంలోకెల్లా తక్కువ హెల్త్‌కు ఎలాట్ చేసిన దేశం ఇండియా. భారతదేశంలో కెల్లా లోయెస్ట్ పర్సెంటేజ్ అలాట్ చేసిన రాష్ట్రాలు సదరన్ స్టేట్స్. సదరన్ స్టేట్స్‌లో కూడా లోయెస్ట్ పర్సెంటేజ్ ఇచ్చినటువంటిది ఆంధ్రప్రదేశ్. అధ్యక్షా, లోయెస్ట్ పర్సెంటేజ్ ఇచ్చి, హయ్యెస్ట్ మార్కులు తెచ్చుకుంది కూడా ఈ రాష్ట్రమేనని మీకందరికీ తెలియజేస్తున్నాను.

(సభలో సభ్యులు బల్లలు చరిచారు.)

ఎందుకంటారా! ఒక నిముషానికి 20,000 రూపాయలు. ఒక గంటకు 12,50,000 రూపాయలు. ఒక రోజుకు రూ. 3 కోట్ల రూపాయలు ఆరోగ్యశ్రీ మీద ఖర్చు పెట్టి ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చి దిద్దాలన్న ధృఢ సంకల్పంతో చేస్తే, మిగతా రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటివి ఎలా జరుగుతున్నాయి, ఇంత పర్సెంటేజ్ ఇచ్చినా మేము ఎందుకు చేయలేకపోతున్నామో అనుకుంటున్నాయి. ఇక్కడ బుర్ర కాదు కావలసింది, హృదయం కావాలి అధ్యక్షా. ఇది పెద్ద హృదయంతో చేసినటువంటి పని. ఆరోగ్యశ్రీ మీద ప్రభుత్వం ఎంత ఖర్చు పెడుతున్నదంటే యావరేజ్‌గా ఒక కుటుంబం మీద 250 రూపాయలు ఖర్చు పెడుతున్నది. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నటువంటి ప్రతి ఒక్క కుటుంబాన్ని మీ కుటుంబానికి ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం కల్పిస్తాము 250 రూపాయలు ఇవ్వండి అంటే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు అధ్యక్షా. కానీ అడగలేదే. అందరికీ ఆరోగ్యం కల్పించారు. ఇప్పుడే మిత్రులు చెప్పారు ప్రభుత్వ ఆసుపత్రుల మీద తక్కువ డబ్బు ఖర్చు పెడుతున్నారని. ఈ రోజు వరకు 1,020 కోట్ల రూపాయలు ఆరోగ్యశ్రీ మీద ఖర్చు పెడితే, అందులో 16 శాతం ప్రభుత్వ ఆసుపత్రులకు కేటాయించారు. జ్వరం వస్తే ఆసుపత్రికి పరిగెత్తుతాము. కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ అన్ని డిపార్టుమెంట్లకి కూడా ప్రభుత్వం దగ్గరుండి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తూ పోతూ ఉంటే, ఇంతకన్నా తక్కువ ఎవరు చేస్తారు అధ్యక్షా. తక్కువ శాతం కేటాయించి రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో కూడా ప్రసిద్ధిగాంచినటువంటి స్కీముని డా. రాజశేఖర్ రెడ్డిగారు ప్రవేశపెడితే, తక్కువ పర్సెంట్ ఇచ్చారని ఆరోపిస్తున్నారు. దీనిని ఎంత అప్రీషియేట్ చెయ్యాలి. ప్రైవేట్ ఆసుపత్రులనే కాదు, గవర్నమెంట్ ఆసుపత్రులను కూడా బాగా పెంచి పోషించేదానికి కృతనిశ్చయంతో ఒక పెద్ద ఆలోచన పెట్టుకున్నారని ఈ రికార్డులు చెబుతున్నాయి. 30 శాతమైనా గవర్నమెంట్ ఆసుపత్రులలో ట్రీట్ మెంట్ జరగలని చెప్పి, ఈ ఆలోచనతో ప్రభుత్వం ఉన్నదని రికార్డు చెబుతున్నది. All these records will speak the truth. ఇవన్నీ జీర్ణించుకోవాలని చెప్పి నేను తెలియజేస్తున్నాను.

ప్రభుత్వానికి ఏదన్నా ఆదాయం వచ్చేది రెండు ముక్కలు చెప్పమని రోశయ్యగారు ఇంతకు ముందు చెప్పారు. ఇంతకుముందు ప్రతిపక్షంలో ఉన్న వారందరూ కూడా ఆదాయం తెచ్చి పెట్టే మార్గాల గురించి, ఖర్చు పెట్టే మార్గాల గురించి చెప్పారు. చెప్పినవారందరూ దానికి తక్కువ, దీనికి తక్కువ అంటున్నారు కాబట్టి నేను ఒక ఇన్సిడెంట్ చెప్పదలచుకున్నాను. ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించి ఒక చెక్‌పోస్ట్‌లో ఒక రోజంతా చెక్‌చేస్తే అఫిషియల్ మనీ రూ. 12,500 వచ్చింది. అన్ అఫిషియల్ మనీ రూ. 2,50,000 వచ్చింది. దీనిని కొంచెం రియలిస్టిక్‌గా తీసుకుంటే, ఇందులో ఇంకా సుమారుగా రెండువేల ఐదు వందల కోట్ల రూపాయలు పెంచుకునేదానికి అవకాశం ఉంటుందని చెప్పి మీ ద్వారా రోశయ్య గారి దృష్టికి తీసుకువస్తున్నాను.

మైనింగ్ డిపార్టుమెంట్ కూడా ఇప్పుడు వచ్చినదానికన్నా ఇంకా రెట్టింపుచేసుకోవడానికి అవకాశం ఉంది. ఎలాగంటే బిల్డింగ్ మెటీరియల్ ధర అంతా పంపించింది పంపించినట్లు రికార్డు చేసుకోకుండా కేవలం సీనరేజ్ ఛార్జెస్ కట్టుకుంటున్నారు. ఒక విధంగా ఇసుక రేటు ఎన్‌హాన్స్ రేట్‌తో సప్లై చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఒక లోడ్ ఇసుక కొనాలంటే రూ. 9,000 నుండి రూ. 12,000 రూపాయలు అవుతున్నది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని మైనింగ్ డిపార్ట్‌మెంట్‌ని పెంచుకోవచ్చు.

టూరిజం డిపార్టుమెంట్‌లోను, ఎక్సేంజ్ డిపార్టుమెంటులోనూ పెంచుకోవడానికి అవకాశం ఉంది. పాలడుగు వెంకట్రావుగారు కేజి బేసిన్ గురించి చెప్పారు. గుజరాత్ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక గ్యాస్ ఏజెన్సీని గుజరాత్ స్టేట్ పెట్రో కెమికల్ గ్యాస్ ఏజెన్సీ ఒకటి పెట్టారు. నేను పి.జి. చేసేటప్పుడు మాకు స్కాలర్ షిప్‌లు కావాలని అడిగితే అంజయ్యగారన్నారు గోదావరిలో తేల్ (ఆయిల్) పడింది. పిల్లలకేమిటి అందరికీ స్కాలర్ షిప్‌లు ఇచ్చేద్దామన్నారు. పద్నాలుగు వందలకోట్ల రూపాయలు బడ్జెట్‌లో పెట్టిన ఓ.ఎన్.జి.సి. ఈ రోజు నలభై వేల కోట్ల రూపాయల ఆదాయంతో నవరత్నాల నిధి ఉందనే విషయాన్ని తెలియజేస్తూ ఆంధ్ర రాష్ట్రంలో ఉత్పత్తవుతున్న గ్యాస్ నిక్షేపాలంతా ఆంధ్ర రాష్ట్రానికే దక్కాలని, అందులోని లాభాలన్ని మన రాష్ట్రానికే దక్కాలని కోరుకుంటున్నాను. అందుకు తగిన శాసనాలు తీసుకురావలసినటువంటి బాధ్యత ఉందని చెబుతున్నాను.

బీదవారికి సంబంధించి స్టాంపు డ్యూటీ 50 గజాల వరకూ బీదలు రిజిస్టర్ చేసుకుంటే, దానికి నూరు శాతం మినహాయింపు ఇవ్వమని చెప్పి నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను. ఇక రెండవ విషయం కూడుకు బియ్యం ఇస్తున్నాము, గూడుకు ఇళ్లు కట్టించి ఇస్తున్నాము, ఇక బట్టకు కూడా ఏమైనా చెయ్యవలసింది. రేషన్ కార్డు హోల్డర్లందరికీ కనీసం రెండు జతలు బట్టలు ఇచ్చే విధంగా ఏమన్నా ఏర్పాటు చెయ్యమని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కూడు, గూడు, గుడ్డ అన్నీ కూడా ఈ ప్రభుత్వమే ఇచ్చే విధంగా తగు ఏర్పాట్లు చెయ్యాలని కోరుతున్నాను. మనమందరమూ ఇలాంటి తెల్లబట్టలు వేసుకుంటున్నాము. ఈ మధ్య రజకుల సంఘం సమావేశం ఏర్పాటు చేయగాఆ సమావేశానికి నేను హాజరయ్యాను. వారన్నారు 'మేము ఎలక్షన్లలో పోటీచేద్దామంటే మాకు అవకాశం ఇవ్వరు, 3 రాజ్య సభ, 6 కౌన్సిల్, 4 కార్పొరేషన్లు ఇవ్వమని ఒక పెద్దాయన అడిగితే, వెంటనే ఒక పెద్దాయన లేచి మాకు అవేమి వద్దు మాకు ఒక ధోభీ ఘాట్, ఒక ఇస్త్రీ పెట్టె, ఒక బండి ఇవ్వండి' అన్నారు. మొదటి వ్యక్తి అన్నీ అడిగినా ప్రజలు చప్పట్లు కొట్టలేదు రెండవ వ్యక్తి అడిగినది ఏమిటంటే ధోభీ ఘాట్ – బోర్ వేసి, రెండు తొట్లు కట్టించి, ఇస్త్రీ పెట్టెలు ఇచ్చి మాకు సౌకర్యాలు కలగచెయ్యండి అన్న మాటలకు ప్రజలు చప్పట్లు కొట్టారు. నియోజక వర్గానికి కనీసం 50 ధోభీ ఘాట్‌లన్న మంజూరు చెయ్యమని చెప్పేసి బి.సి. కార్పొరేషన్ వారికి... ఎందుకంటే మనమంతా మంచి బట్టలు వేసుకుంటుంటే... ఒక జత బట్టలు ఉతికించి ఇస్త్రీ చేయాలంటే జతకి నలభై రూపాయలు అవుతోందని తెలియజేస్తున్నాను...

(సభలో సభ్యుల నవ్వులు)

అన్ ఎంప్లాయ్ మెంట్‌కి సంబంధించి ముఖ్యంగా డ్రైవర్ల కొరత ఎక్కువగా ఉన్నది. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వచ్చిన తరువాత డ్రైవర్లు దొరకడం లేదు. 10 లక్షల మంది డ్రైవర్లకు, 10 లక్షల మంది కుక్కులకు (వంటమనుషులకు) ... వంటమనుషులు దొరకడం లేదు, డ్రైవర్లు దొరకడం లేదు. ఏ రూపంలోనైనా వారికి ట్రైనింగ్ ఇప్పించి... ఆదర్శ రైతుల వలె రెండు కిలోమీటర్లకు ఒక రోడ్డు గార్డుని పెడితే బాగుంటుందని నా అభిప్రాయం. ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీం వలన బీదవారికి బాగా పని దొరుకుతుంది. బీదలు వలసపోవడం లేదు కానీ, రైతులు వలసపోయే అవకాశం ఉందని చెబుతున్నాను.

మ.1.30

రైతులంతా వలస పోయే అవకాశం ఉంది. కాబట్టి నేను పాజిటివ్‌గా ఒక సలహా ఇస్తున్నాను. అంటే, కేంద్ర ప్రభుత్వం తీసుకోవలసిన నిర్ణయం అయినప్పటికీ, కేంద్రాన్ని మెప్పించవలసిన బాధ్యత మన మీద ఉంది. అదేమిటంటే, మీరు పని చేయించుకోండి. అదేదో రైతుల దగ్గర 25 శాతం తీసుకొని, మిగిలిన 75 శాతం గవర్నమెంట్ ఇచ్చి, పనుల్ని ఫుల్‌గా హార్టికల్చర్ డిపార్టుమెంట్‌కు ఇవ్వండి, ప్రస్తుతం జంగిల్ క్లియరెన్స్, అప్‌రూటింగ్, బైడింగ్ పనులు అన్నీ వాళ్లతో చేయిస్తున్నారు కదా! అలా వారితో చేయించండి. లక్ష ఎకరాలు హార్టికల్చర్‌కు వస్తున్నది. ప్రైమరీగా హార్టికల్చర్‌లో ఆ పథకాన్ని తీసుకుని, బొప్పాయి, అరటి, చీనీ తోటలు వేసుకోవడానికి అక్కడ ఉన్న లేబర్‌కు ఫస్ట్ ఫేజ్‌లో ఇస్తే , తర్వాత ఫేజ్‌లో మిగతా వాటికి ఎక్స్‌టెండ్ చేయవచ్చు. అప్పుడే రైతులకు ప్రయోజనం కల్గుతుంది. ఈరోజు కందిపప్పు ఉత్పత్తి ఒక్కటే తక్కువగా వస్తోంది రాష్ట్రంలో. ఉత్తరోత్రా ఇదే కొనసాగితే, వ్యవసాయ కూలీలు దొరక్క, వ్యవసాయం అంతా కుంటు పడే ప్రమాదం ఉందనే విషయాన్ని మీ దృష్టికి తీసుకుని వస్తున్నాను. వ్యవసాయం కుంటుపడితే మనం కట్టే ప్రాజక్టులన్నీ వృథా అవుతాయోమో అనే అనుమానం కల్గుతోంది....

(ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

ఇంకొకటి, లీడర్ ఆఫ్ ది అపోజిషన్ మొన్న ఒక విషయం చెప్పారు. దానికి సమాధానం చెప్పవలసిన పని ఉంది...

మిస్టర్ ఛైర్మన్ : మీరు ఇప్పుడు బాగా మాట్లాడుతున్నారని అంటున్నారు.

శ్రీ బి. చెంగలరాయుడు : అధ్యక్షా, నిజాలు ఎవరికైనా నిజాలుగానే కనపడతాయి. అయితే అంతరాత్మ అని ఒకటి ఉంటుంది. ఆ అంతరాత్మ ప్రకారం నడుచుకుంటేనే అది అందంగా, చందంగా ఉంటుందని చెపుతున్నాను.

ఇటువంటి పరిస్థితుల్లో ఇరిగేషన్ ప్రాజక్టుల మీద అవగాహన లేకుండా కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నారని అన్నారు. వారిలోని మిత్రుడు నిన్న ఒక క్వశ్చన్ వేశాడు....

శ్రీ దాడి వీరభద్రరావు :అవగాహన లేదని అని అనలేదు....

శ్రీ బి. చెంగల్రాయుడు : ఓ.కే. Records will speak the truth. రికార్డుల్లో ఏదైనా పొరపాటు ఉంటే, నేను రెక్టిఫై చేసుకుంటాను. అయితే నిన్న వాళ్లలో ఒక మిత్రుడు లేచి అడ్వకేటు జనరల్‌కు ఎంత జీతభత్యాలు చెల్లిస్తున్నారని అడిగారు. మంత్రిగారు జవాబు చెప్పారు. వెంటనే మీరు ఈ ప్రభుత్వానికి ఒక సలహా ఇచ్చి ఉండవలసింది అక్కడే. కోటి రూపాయలు ఇస్తున్నారు కాబట్టి .....

శ్రీ పి. యాదగిరి (అసెంబ్లి) : నా బడ్జెట్ స్పీచ్‌లో సలహా ఇస్తాను....

శ్రీ బి. చెంగల్రాయుడు : అదే యాదగిరిగారు నేను అడుగుతున్నాను మీరెందుకు గవర్నమెంట్‌కు సజేషన్ ఇవ్వకూడదని. హైకోర్టు జడ్జికి ఎంత జీతం ఇస్తున్నారో, అంత జీతం ఇవ్వకుండా, ఒక ఏభై లక్షల రూపాయలో, ఎంతో అడ్వకేట్ జనరల్‌కు ఇచ్చి, నడిపిస్తే పోతుంది కదా అని. ఆ విధంగా ఇప్పుడు కూడా పాజిటివ్‌గా సలహా ఇస్తారని అనుకుంటున్నాను. సజేషన్ ఇవ్వండి తీసుకుంటామని చెపుతున్నాను.

ఇకపోతే, ఇంకొక మిత్రుడు అన్నారు ఏమిటి మీ ముఖ్యమంత్రిగారు మాట్లాడినపుడల్లా ప్రతిసారి కోట్లాది రూపాయలు ఖర్చు పెడతాం, ప్రాజక్టులు పూర్తి చేస్తాం, లక్ష ఎకరాలకు నీరు ఇస్తామని చెపుతున్నారు అని. లక్ష కాదు రెండు లక్షల ఎకరాలకు కూడా మా ముఖ్యమంత్రి నీరందిస్తారు. మహాభారతాన్ని ముగ్గురు కవులు (కవిత్రయం) 18 పర్వాలను తెలుగులోకి అనువదిస్తే, 81 ప్రాజక్టులను ఒక్క కవే వ్రాసి ఇచ్చి, ఒక్క కవే .....

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

కోట్లాది రూపాయలతో, రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించబోతున్నారు. అది సామాన్యులు చేసే పనేనా?అది కూడా గ్రావిటీతో నీరు పారే ప్రాజక్టులు. అంతకు ముందు నాగార్జునసాగర్ కడితే, గ్రావిటితో 25 లక్షల ఎకరాలకు ఇప్పుడు నీళ్లు పారుతున్నాయి. అదే విధంగా ఇప్పుడు నాలుగు లిఫ్టులను పెట్టి చేవెళ్లకు నీరు అందించబోతున్నారు. మిత్రులు నాగేశ్వరరావుగారు అన్నారు మీ ముఖ్యమంత్రికి ఎంత ధైర్యమండీ నాలుగు లిఫ్టులు పెట్టి చేవెళ్లకు నీరు ఇస్తామంటున్నారు అని. ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తోందంటే, ముఖ్యంగా ఇరిగేషన్ ప్రాజక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం యొక్క పాత్రను కూడా తీసుకుని వచ్చే దానికి. బడ్జెట్‌లో రోశయ్యగారు చెప్పారు సంవత్సరానికి ఒకటి, రెండు చొప్పున మొత్తం అయిదు సంవత్సరాల్లో ప్రాజక్టులను పూర్తి చేసినట్లయితే మన రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని. అయిదేళ్లు టైమ్ ఇచ్చినా, నాలుగేళ్లలోనే పూర్తి చేస్తామని చెప్పిన విషయాన్ని కూడా మీ దృష్టికి తీసుకుని వస్తున్నాను. ఇప్పుడు 20 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చినందు వల్ల, మొన్నటి ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయి. ఒక చిన్న ఉదాహరణ చెపుతాను. బద్వేలు నియోజకవర్గంలో అంతకు ముందు గోవింద రెడ్డి 7 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు. నీళ్లు బాగా ఇచ్చినందు వల్ల ఇప్పుడు గెలిచిన వ్యక్తి 40 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు.....

(అధికార పక్ష సభ్యులు తమ హర్షాతిరేకం వ్యక్తం చేశారు)

రాబోయే రోజుల్లో 210 నియోజకవర్గాల్లో ఈ నీళ్లన్నీ తప్పనిసరిగా పారుతాయి కాబట్టి, దాన్ని దృష్టిలో పెట్టుకొని మంచి ఫలితాలు వస్తాయనే విషయాన్ని సభా ముఖంగా తెలియచేసుకుంటూ, ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియచేసుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

MR.CHAIRMAN: The House is adjourned to meet again tomorrow at 10.00 a.m.

(The House then adjourned at 1.35 p.m. to meet again at 10.00 a.m., on Thursday the 30th July, 2009)